సంపుటి : 3
సంచిక : 5
పుటలు : 52
రు. 20/-లు
తెనాలి

1993 నుంచి 2013 వరకు వెలువడిన **నడుస్తున్న చరిత్ర** కు నేటి రూపం

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

నుడి నాడు నెనరు

జులై 2017

## ఒకరి వెంట ఒకరు వెళ్ళిపోయిన ఆ ఇద్దరు ప్రతిభావంతులు కలిసి సృష్టించిన అద్భుతాలు అనేకం





### సి.నారాయణరెడ్డి (సినారె)

29 జులై 1931 - 12 జూన్ 2017

కథాకావ్యాలతో వాసికెక్కి, కావ్య సృష్టితో 'విశ్వంభరుడి'గా జ్ఞానపీఠ సత్కారాన్ని పొందారు. ప్రాచీన, ప్రబంధ సాహిత్యాల ప్రభావంతో సమాసభూయిష్టమైన సంక్లిష్ట వ్యక్తీకరణ నుంచి సమకాలీన సమాజ స్థాయికి దిగివచ్చి, సామాన్యుడికి చేరువకావడం అదో పరిణామ క్రమం. అందుకు దోహదం చేసిన ఉపకరణం 'పాట'. ఆ పాట తెలుగు చలన చిత్ర రంగంలో సినారె ప్రవేశానికి దోహదం చేసింది. ఆయన కలం నుంచి, ఆలోచనల బలం నుంచి ఆణి ముత్యాల్లాంటి పాటలెన్నో వచ్చాయి.

### దాసరి నారాయణరావు

4 మే 1942 - 30 మే 2017

పొట్ట గడవడానికి పొద్దుగూకే వరకూ శ్రమిస్తూ, నటన మీద ఆసక్తితో నాటక రంగంలో కృషి చేసిన కళాకారుడు. వెండి తెర నుంచి వచ్చిన పిలుపు మేరకు ఆయన రంగం మారింది. తీరా వెళ్తే పూలబాటలు ఎదురుకాలేదు. పరిస్థితులు సానుకూలంగా లేవు. ప్రతికూలతలోనే ఆయన లోని ప్రతిభ రాటుదేలింది. సంభాషణలు, దర్శకత్వ విభాగాల్లో సాగించిన కృషి తనదైన ముద్రను నెలకొల్పే దిశగా దారులు వేసింది. దాసరి నారాయణరావును 'దర్శకరత్న' స్థాయికి చేర్చింది.

## ఆధిపత్యవాదాన్ని ఎదుర్కోవాలి

# "మనిషికి ఎన్ని ఉన్నా, ఆరోగ్యం లేకుంటే - జీవితంలో ఆనందం లేనట్టే"

## హోమియో వైద్యంలో నివారింపబడు వ్యాధులు



**మానసిక వ్యాధులు :** జ్ఞాపకశక్తి తగ్గుట, ఆందోళన, అస్థిమితము, డిప్రెషన్స్, ప్రేమభంగము వలన కలిగే మానసిక అస్వస్థతలు, నిద్రలేమి, నిద్రలో గురక మొ॥నవి.

**శారీరకమైనవి :** చర్మవ్యాధులు, బొల్లి, పులిపిర్లు, నల్లమచ్చలు, సొరియాసిస్ (పొరలు ఊడు చర్మవ్యాధి) బోద, ఉబ్బసము, ఎలర్జీ (అన్ని రకములు) పోలియో, కోరింతదగ్గు, జీర్ణాశయ వ్యాధులు, వెంట్రుకలు ఊడుట, చిన్నతనములోనే నెరయుట, కండ్లకలక, న్యుమోనియా (ఊపిరితిత్తులలో నెమ్ము), పక్షవాతము, నరముల బలహీనత, దీర్ఘకాల తలనొప్పి, లివర్లు, పసికర్లు, గ్యాస్ట్రబుల్, సయాటికా, నడుమునొప్పి, హెపటైటిస్(బి), లుంబర్, సర్వికల్ నొప్పి.

**జననేంద్రియ వ్యాధులు :** వీర్యశక్తికి, నపుంసకత్వం నివారణకు, సంతానం కలుగుటకు, గర్భిణీ స్త్రీ సుఖప్రసవమునకు, ఎరుపుగాని, తెలుపుగాని అవుచున్న చికిత్స చేయబడును. సకాలములో రజస్వల కాకపోవుట, ఋతుశూల, గనేరియా "సిఫిలిస్ (సుఖవ్యాధులు)" మొ॥ వాటికి నిపుణతతో చికిత్స చేయబడును. ఎయిడ్స్ (హెచ్.ఐ.వి.)కి ప్రత్యేక నిరోధక, నివారణ చికిత్స చేయబడును.

### నా ప్రముఖ వైద్య, ఆరోగ్య గ్రంథములు

- ☞ హోమియో వైద్యం (1 & 2 భాగములు)
- ☞ ఇంగ్లీషు - తెలుగు మెడికల్ డిక్షనరీ
- ☞ యోగశాస్త్రం - ప్రథమ చికిత్స
- ☞ భారతీయ వైద్య విధానాలు
- ☞ హోమియో వస్తు గుణదీపిక
- ☞ సెక్స్ అండ్ హోమియో
- ☞ హోమియో దర్శిని
- ☞ ప్రకృతి వైద్యం
- ☞ మెడికల్ గైడ్
- ☞ హెల్త్ అండ్ బ్యూటీ
- ☞ వైద్య రత్నాలు
- ☞ సంపూర్ణ హోమియో వైద్యం

మరియు అనేక ఇతర గ్రంథములు

యునెస్కో అవార్డు గ్రహీత, మిలీనియం సోషల్ సర్వీస్ మెడల్ గ్రహీత, "ప్రజావైద్య సేవక్", "భిషక్ రాజా", "ఆరోగ్య రక్షక్", "దక్ష వైద్యశ్రీ" బిరుదాంకితులు. అనేక వైద్య, ఆరోగ్య గ్రంథముల రచయిత సి.వి. రామన్ అకాడమి, హైదరాబాద్ వారిచే "హోమియో విశారద" బిరుదాంకితులు


**Ln. డా॥ కె.వి.యన్.డి. ప్రసాద్ DHMS, M.H.S. (London)**

పాత గవర్నమెంట్ ఆసుపత్రి వెనుక, శ్రీ రాధాకృష్ణ కళ్యాణమండపం వద్ద, కొత్తపేట, తెనాలి.

☎ 08644 - 220832, Cell : 98484 09749

- తెలుగు అభివృద్ధి, సాధికారతలకోసం...
- తెలుగుభాషోద్యమ నిర్మాణంకోసం...
- ఆంధ్ర,తెలంగాణల్లో, ఇతరరాష్ట్రాల్లో, విదేశాల్లోనూ ఉన్న తెలుగువారికోసం...

తెలుగుజాతి పత్రిక

# అమ్మనుడి

సంపాదకుడు : డా॥ సామల రమేష్‌బాబు

తోడ్పాటు : డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు, డా॥ వెన్నిసెట్టి సింగారావు, డా॥ సుందర్ కొంపల్లి, రహ్మానుద్దీన్ షేక్, సరస్వతుల రామనరసింహం(సరసి), తమ్మా శ్రీనివాసరెడ్డి




**జులై 2017**

### రచయితలకు సూచనలు

తెలుగు భాష, సాహిత్యం,సాంస్కృతికతలతో పాటు తెలుగువారి చరిత్రకూ, సంస్కృతికీ, సాధికారతకూ, ప్రగతికీ చెందిన సామాజిక, ఆర్థిక, రాజకీయ అంశాలపై రచనలకు స్వాగతం. వ్యాసం, కథ, వచన కవిత, పాట -రచనను ఏ రూపంలోనైనా పంపవచ్చు.

1. వ్యాసాలు ముద్రణలో 1 నుండి 3 పుటలకు మించకూడదు. కథ 3 పుటలకు మించకూడదు. కవితలు 20 నుంచి 30 పంక్తులకు మించకూడదు. విమర్శలు విషయం పైనే ఉండాలి గాని వ్యక్తులపై గురిపెట్టి చేయరాదు. సరళమైన తెలుగులో వ్రాయాలి. 2. రచనలను యూనికోడ్‌లో గాని, అను ఫాంట్స్‌లో గాని టైప్ చేసి, పి.డి.ఎఫ్, పి.ఎం.డి. రెండింటిలోనూ పంపాలి. లేదా ఎ4 సైజు కాగితంపై వ్రాసి, స్కాన్ చేసి *editorammanudi@gmail.com* కు పంపాలి. కొరియర్ / రిజిష్టర్డ్ / సాధారణ పోస్టులో కూడా పంప వచ్చు. 3. రచనతో పాటు పోస్టల్ చిరునామా, ఫోన్ నంబరు, ఉంటే ఇ-మెయిల్ చిరునామా కూడా ఇవ్వాలి. ఈ వివరాలు లేని రచనల్ని తీసుకో లేము. 4. రచన స్వంతమేనని, ఇతర పత్రిక లకుగాని, ఇంటర్నెట్ పత్రికలకుగాని పంప లేదని, ఇంత వరకు ఎక్కడా ప్రచురణ కాలే దని హామీ పత్రాన్ని తప్పనిసరిగ పంపాలి. ముందుగా సోషల్ మీడియాలో పెట్టిన రచన లను ప్రచురణకు స్వీకరించలేము. **అమ్మనుడి** లో ప్రచురమైన తరువాత ఇతర పత్రికల లోగాని, సోషల్ మీడియాలోగాని ప్రచురించేట్లయితే – **అమ్మనుడి** నుంచి తీసుకున్నట్లు తప్పక పేర్కొనాలి.

## లోపలి పుటలలో....


| | | | |
|---|---|---|---|
| **సంపాదకహృదయం :** | ఆధిపత్యవాదాన్ని ఎదుర్కోవాలి | | **5** |
| **ఇంటర్‌నెట్ :** | భారతీయ భాషలు | **రహ్మానుద్దీన్ షేక్** | **7** |
| **పరిశోధన :** | తెలుగు భాషా సాహిత్యాలపై...... | **బి.ఆర్.బాపూజీ** | **10** |
| **శ్రద్ధాంజలి :** | సినారె కవన మువ్వల సవ్వడులు | **కత్తి పద్మారావు** | **18** |
| | ఒక జ్ఞాపకంలో ఆ ఇద్దరూ | | |
| **ఓలేటి శ్రీనివాసభాను** | **24** | | |
| | జన్మభూమితో సాహితీ విశ్వంభరుని.... | **సంకేపల్లి నాగేంద్రశర్మ** | **26** |
| **హిందీ :** | జాతీయ భాషా లేక.... | | **28** |
| **సాహిత్య రంగం:** | ఇద్దరమ్మల కథలు | **మధురాంతకం నరేంద్ర** | **29** |
| **ధారావాహిక :** | మానవీయత-మనిషిలోని..... | **బొర్రా గోవర్ధన్** | **32** |
| **సాహిత్యం :** | తెలుగు సాహిత్యంలో స్త్రీపాత్రల.... | **చెరుకుపల్లి లావణ్య** | **35** |
| **పిట్టచూపు :** | జీఎస్టీ అమలుతో....... | **చలసాని నరేంద్ర** | **38** |
| **మనసులోని మాట:** | పతంజలి మహర్షి..... | **వావిలాల సుబ్బారావు** | **41** |
| **కాశీలో తెలుగు :** | కాశీతో తెలుగుబంధం | **బద్రి కూర్మారావు** | **42** |
| **పెద్దోరి తీపి గురుతులు:** | మహీధర జగన్మోహనరావు | **సన్నిధానం నరసింహశర్మ** | **44** |
| **తెలుగుకు సాధికారత:** | తెలుగు చదివితే ఉద్యోగాలొస్తాయ్ | **ద్వానాశాస్త్రి** | **46** |
| **జనవాణి:** | | | **47** |
| **స్పందన:** | | | **47** |
| **వార్తలు:** | విశాఖపట్నంలో వార్తలు | | **48** |
| **తెలుగు గణితం:** | తెలంగాణ తెలుగు గణితం | **వాగుమూడి లక్ష్మీరాఘవరావు** | **49** |
| **ఎల్లలకావల తెలుగు:** | ఉడుమలపేట, ఒడిశా వార్తలు | | **50** |

**కవితలు**

| | | |
|---|---|---|
| జై తెలుగు టల్లీ | **-చైతన్య ప్రసాద్** | **23** |
| కొత్తదారి | **-గుర్రాల రమణయ్య** | **25** |
| అమృతభాష | **-వల్లూరుపల్లి లక్ష్మి** | **34** |
| ఆసరా | **-కరణం కళ్యాణ్ కృష్ణకుమార్** | **37** |



కార్టూన్లు : **సరసి**

ఫొటోలు : **అనుముల గంగాధర్** కంప్యూటరీకరణ : **సోమయాజులు**



రచనలు, ఉత్తరాలు పంపుటకు చిరునామా:

సంపాదకుడు: **అమ్మనుడి,** జి-2, శ్రీ వాయుపుత్ర రెసిడెన్సీ, హిందీ కళాశాల వీధి, మాచవరం,విజయవాడ-520004.

కార్యాలయం : *0866-2439466* సంపాదకుడు : *9848016136* **,** e-mail : editorammanudi@gmail.com

వలగూడు (ఇంటర్నెట్)లో *www.ammanudi.org* చూడండి.



రచయితల అభిప్రాయాలు వారి స్వంతం. వారితో పత్రిక యాజమాన్యం, సంపాదకుడు ఏకీభవించవలసిన అవసరం లేదు.

తెలుగుజాతి పత్రిక
# అమ్మనుడి
మాసపత్రిక
నుడి - నాడు - నెనరు

## చందా వివరాలు

| | | వ్యక్తులకు | సంస్థలకు | విదేశీయులకు |
|---|---|---|---|---|
| శాశ్వత చందా | : | రూ.5000 | రూ.7500 | -- |
| 5 సం॥ | : | రూ.1000 | రూ.1500 | 150 డాలర్లు |
| 3 సం॥ | : | రూ. 700 | రూ.1000 | 75 డాలర్లు |
| 1 సం॥ | : | రూ. 240 | రూ. 400 | 25 డాలర్లు |

ఎం.ఓ. లేదా తెనాలిలో చెల్లునట్లు బ్యాంకు డి.డి.ని **'అమ్మనుడి'** పేర పంపాలి. చెక్కు పంపేట్లయితే దయచేసి అదనంగా రు.30 లు చేర్చి పంపండి.

ఆన్‌లైన్ ద్వారా చందాను పంపేవారు NEFT / RTGS ద్వారా **'అమ్మనుడి'**-యాక్సిస్ బ్యాంకు, తెనాలి శాఖకు పంపాలి.
**AMMA NUDI - AXIS BANK, TENALI**
అకౌంట్ నెం. **915020010550189**
**IFSC Code : UTIB0000556**
ఆన్‌లైన్‌లో చందాను పంపినవారు, ఆ వెంటనే దయతో - చిరునామా, ఫోన్ నెం. తదితర వివరాలను జాబుద్వారాగాని, ఫోన్ మెసేజి ద్వారాగాని తెలుపగలరు.

చందాలు పంపడం, దానికి సంబంధించిన ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా

**డా॥ సామల లక్ష్మణబాబు,** ప్రచురణకర్త, 'అమ్మనుడి'
8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి**
గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244
ఇ-మెయిల్ : ammanudi@gmail.com

**చందాదారులు కోరినట్లయితే ఆన్‌లైన్‌లో కూడా పత్రికను పంపగలము. ఇందుకోసం మీ ఇ-మెయిల్ ఐడిని తప్పక తెలుపగలరు.**

### చందాదారులకు సూచనలు

1. చందా కాలం ముగింపు తేదీ - పత్రిక కవరుమీద మీ చిరునామా పై భాగంలోనే ఉంటుంది. గమనించండి.
2. చందా పూర్తయ్యేందుకు ఒక నెల ముందే దయచేసి మీ చందాను పంపించండి.
3. మీ ఇంటి నెంబరుతో పూర్తి చిరునామాను, పిన్‌కోడ్ నెంబరుతో సహా తెలియపరచాలి. మీ ఫోన్ నెంబరును, వుంటే మీ మెయిల్ ఐడి ని తెలపాలి.
4. మీ చిరునామా మారినట్లయితే దయచేసి వెంటనే తెలియజేయండి.

**'అమ్మనుడి'** ఈ క్రిందిచోట్ల కూడ లభిస్తుంది

**నవోదయ బుక్ హౌస్,** ఆర్యసమాజ్ భవనం ఎదురుగా, కాచిగుడా.**హైదరాబాదు - 27.** ఫోన్ :040-24652387

**మైత్రీ బుక్‌హౌస్,** జలీల్ వీధి, కార్ల్‌మార్క్స్‌రోడ్డు (ఏలూరు రోడ్డు) **విజయవాడ - 2.** ఫోన్ : 9866211995

**మణి బుక్‌స్టాల్,** షాప్ నెం.58, సండేమార్కెట్, **నెల్లూరు**-1. ఫోన్:7386223538.

# తెలుగుజాతి (ట్రస్టు)

**నడుస్తున్న చరిత్ర** ప్రోత్సాహంతో 2000సం॥నుండి ఆంధ్రప్రదేశ్ లోని, పొరుగు రాష్ట్రాల్లోని తెలుగువారి శ్రేయస్సుకు, తెలుగుభాషోద్యమ నిర్మాణానికి ఎంతో కృషి జరిగింది. దక్షిణ భారతదేశమంతటా చిక్కగా అల్లుకొని, మొత్తం దేశంలోనేకాక, ఇతర దేశాల్లో కూడా భాషా సాంస్కృతిక మూలాలను విస్తరించు కొనివున్న తెలుగు జాతిలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో సంఘీభావాన్ని, భావ సమైక్యతను బలపరచవలసిన అక్కరను గుర్తించిన కొందరు కార్యకర్తలు అందుకోసం పనిచేస్తున్నారు. అయితే, అనివార్య కారణాల వల్ల నడుస్తున్న చరిత్ర పత్రికను 2013 నవంబరు నుంచి నిలిపివేయవలసి వచ్చింది. కొద్ది విరామం తరువాత మళ్ళీ పత్రికను ప్రచురించడంతోపాటు తెలుగు నుడి, చరిత్ర, జాతి ముందడుగుకు అవసరమైన పుస్తకాల ప్రచురణను, ప్రచార కార్యక్రమాలను చేపట్టాలని తలపెట్టాము. ఇందుకోసం 'తెలుగుజాతి' ట్రస్టును స్థాపించాము. (92/2014).

2015 మార్చి నుంచి **అమ్మనుడి** పత్రికను ప్రచురిస్తున్నాము. తొలుత స.వెం. రమేశ్ వ్యాసాల సంకలనం **ఎల్లలు లేని తెలుగు**ను విడుదల చేశాము. ఆచార్య గారపాటి ఉమామహేశ్వరరావు గారి రచనలు **ద్రావిడ-మంగోలు భాషల జన్యుసంబంధం ('తెలుగు' పుట్టుపూర్వోత్తరాలు)** అనే పరిశోధనా గ్రంథాన్ని, **తెలుగు రాష్ట్రాలలో భాషాసంక్షోభం** పైనా, చేపట్టవలసిన **భాషావిధానం**పైనా మరి రెండు పుస్తకాలను త్వరలో వెలువరించనున్నాము.

**ఈ ట్రస్టును బలమైన పునాదులపై, తగినన్ని వనరులతో నిర్వహించటానికి మీ అందరి చేయూత కావాలి. విరాళాలనిచ్చి తోడ్పడగోరుతున్నాము.**

| | |
|---|---|
| రాజ పోషకులు రు.1,00,000/- | పోషకులు రు.25,000/- |
| విశిష్ట పోషకులు రు.50,000/- | ప్రోత్సాహకులు రు.10,000/- |

దాత ఫోటోను, క్లుప్తంగా పరిచయాన్ని **'అమ్మనుడి'** పత్రికలో ప్రచురిస్తాము. దాతలందరినీ శాశ్వత చందాదారులుగా పరిగణించి పత్రికను ప్రతినెలా పంపిస్తాము. ట్రస్టు ప్రచురించే పుస్తకాలను కూడా వెనువెంటనే పంపిస్తాము.

సొమ్మును ఆన్‌లైన్‌లో 'TELUGUJAATHI' పేర **యాక్సిస్ బ్యాంక్, సికిందరాబాదు**కు పంపాలి. అకౌంట్ నెం. 914020020387880 I.F.S.C.Code : UTIB0000068. లేదా- అదే బ్యాంకు పేర బ్యాంకు డ్రాఫ్టుగా పంపాలి. డ్రాఫ్టు పంపుటకు, ఉత్తర ప్రత్యుత్తరాలకు చిరునామా : డా॥ సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు),8-386, జీవక భవనం, అంగలకుదురు పోస్టు, **తెనాలి.** గుంటూరు జిల్లా - 522 211. ఫోన్ : 9440448244

**డా॥ సామల రమేష్‌బాబు,(98480 16136) మేనేజింగ్ ట్రస్టీ**
ట్రస్టీలు : పారుపల్లి కోదండరామయ్య, డా॥ వెన్నిసెట్టిసింగారావు, స.వెం.రమేశ్, సామల లక్ష్మణబాబు, కోటిపల్లి సుబ్బారావు, పూదోట శౌరీలు, డా॥ గారపాటి ఉమామహేశ్వరరావు

సంపాదకీయం

# ఆధిపత్యవాదాన్ని ఎదుర్కోవాలి

'భారతదేశం అంటే హిందూదేశమే. అందుకే దీన్ని హిందూస్థాన్ అని అంటారు.'

'అయితే, ఈ దేశంలో హిందువులు మాత్రమే ఉంటారా? ముస్లిములు, క్రైస్తవులు ఉండకూడదా? ఇంకా బౌద్ధులు, జైనులు తదితరుల మాటేమిటి?'

'అయ్యో, అట్లా అంటారేమిటి? వాళ్లు అందరూ కూడా హిందువులే. ఈ హిందూస్థాన్‌లో నివసించేవారంతా హిందువులే!'

'మరి, వాళ్లను హిందువులంటే ఒప్పుకోరు కదా!'

'అవును. హిందువులు అనగానే వాళ్లు హిందూమతం అనే అర్థంలో అనుకొంటున్నారు...!'

'మీరే అర్థంలో చెప్పినా, సాధారణ అవగాహన అంతే. అందుకనే భారతదేశం–భారతీయులు, ఇండియా–ఇండియన్స్ అనే మాటల్నే ప్రపంచమంతా అర్థం చేసుకొంటుంది. అయితే – 'హిందూస్థాన్' అనే మాట 'ఇండియా'కు మారు పదంగా హిందీ దృశ్య, ప్రసార, పత్రికా మాధ్యమాల్లో బాగా వాడుకలో ఉంది.'

'అవును, కాలగమనంలో కొన్ని మాటలకు కొత్త అర్థాలు ఏర్పడతాయి. అవే స్థిరపడతాయి. భాషల తీరుతెన్నుల్లో తమాషా అదే!'

'మీరు భాషల సంగతి కొచ్చారు.... మరి హిందీ అంటే హిందువుల భాషేగా... ఇతర మతాలవాళ్లు హిందీని మాట్లాడకూడదా?!'

'అదెట్లా ! హిందూస్థాన్‌లో ఉండేవాళ్ల భాష గనుక దాన్ని హిందీ అన్నారు.'

'అయితే, మీరూ నేనూ హిందూస్థాన్‌వాళ్లం కాదా? హిందువులం కాదా?!'

'ఇలాంటి విషయాలు చర్చకొస్తే ఒక పట్టాన తెగవు గదండీ'

'బాగా చెప్పారు. ఇందాకే అనుకొన్నాం కదా, కొన్ని మాటలకు అర్థాలు మారిపోయి, కాలగమనంలో మరో అర్థంలో స్థిరపడతాయి..'

'అయ్యా, మీరు పెద్దవారు. ఇక్కడ ఒక్క విషయం గమనించాలి. ఈ హిందూస్థాన్, హిందీ – ఈ పదాలన్నీ కేవలం కొన్ని వందలేళ్లబట్టి వచ్చినవే. దానికి ముందునుంచీ ఉన్నదే భారతదేశం. ఇక్కడ ఎన్నో భాషలు పుట్టి పెరిగాయి. అవి అన్నీ జనభాషలు. వాటిల్లో ప్రాచీనమైన ఒక భాష తెలుగు. అదే మీకూ నాకూ మాతృభాష. వీటిల్లో ఉత్తరభారతంలో అనేక జనభాషలు రాజకీయ అవసరాలకొద్దీ కలిసి ఏర్పడ్డ భాషే 'హిందీ'. దీనితో సంబంధం లేకుండా వేలాది ఏళ్లుగా పుట్టి పెరిగిన జనభాషలు తెలుగు, తమిళం, కన్నడం, మలయాళం – ఇంకా ఎన్నో....'

– ఇటీవల అమెరికాలో సెయింట్‌లూయిస్‌లో 'తానా'సభల్లో పాల్గొన్న సందర్భంగా కొందరు తోటి సదస్యులతో తీరిగ్గా కూర్చున్నప్పుడు ఇద్దరు మిత్రుల మధ్య పైవిధంగా సంభాషణ సాగింది. ఆ సంభాషణ క్రమంగా – ఇప్పుడు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలోని భారత ప్రభుత్వ భాషావిధానం మీదకు మళ్లింది. 'హిందూ–హిందుత్వ–హిందీ' నినాదం ఇప్పుడు ముందుకొస్తోందని, ఇది దేశ అనైక్యతకు దారితీస్తుందనీ భారతదేశాన్నుంచి వచ్చినవాళ్లలో ఒకరు అన్నారు. వెంటనే భారతీయ జనతాపార్టీ ప్రభుత్వానికీ తెలుగుదేశం పార్టీ ప్రభుత్వానికీ మద్దతుదారు ఒకాయన జోక్యం చేసుకొన్నారు.

'ఆ నినాదం దేశసమైక్యత కోసమే. భారతీయ జనతాపార్టీ, తెలుగుదేశం పార్టీలు రెండూ దేశభక్తికి కట్టుబడివున్న పార్టీలే. జాతీయభాషగా హిందీని పటిష్టం చేస్తే దేశప్రజలందరి మధ్య బంధం పెరుగుతుంది. మీ

భాషేమిటంటే జాతీయభాషగా హిందీనే చెప్పుకొంటాం గదా!" అన్నారాయన.

అమెరికాలో ఉద్యోగం చేసుకొంటున్న మరొక తెలుగు యువకుడు జోక్యం చేసుకొంటూ – 'అయ్యా, రాజ్యాంగం గుర్తించిన 22 భాషలు, అన్నిటి స్థాయీ ఒకటే. స్పష్టంగా రాయకపోయినా అవి అన్నీ జాతీయభాషలే. హిందీని జాతీయభాషగా ఎక్కడా పేర్కొనలేదు. ప్రభుత్వ అధికారభాషగా మాత్రమే – అదీ కొన్ని పరిమితులతో మాత్రమే – హిందీ గుర్తింపబడింది. ఈ విషయాన్ని మనమంతా గుర్తుపెట్టుకోవాలి' అన్నాడు.

ఈ మాట అనగానే అక్కడ మిగిలిపోయివున్న నలుగురైదుగురు మిత్రులూ నోళ్లు వెళ్లబెట్టారు. 'హిందీ' జాతీయభాషే అనే అభిప్రాయంతో వున్నారు వారంతా.

ఆ యువకుడు నావైపు చూపించి, 'నాకు తెలిసింది చెప్పాను. ఇక దీనికి సంబంధించినదంతా ఆయన్ను అడగండి' అన్నాడు. అక్కడనుండి ఎన్నో ప్రశ్నలు, ఎన్నో సందేహాలు, ఎంతో ఉద్వేగం, ఎంతో ఆలోచన – అక్కడి మిత్రుల్లోంచి పొంగుకొచ్చాయి. అదంతా ఇక్కడ వ్రాసే స్థలమూ, సమయమూ లేవు. అయినా అవన్నీ 'అమ్మనుడి' పాఠకులకు బాగా తెలిసిన అంశాలే. కేంద్రప్రభుత్వ విద్యా, భాషావిధానాలు హిందీకిగాక తక్కిన దేశభాషల అభివృద్ధికి ఎంత వ్యతిరేకంగా ఉందో మన చదువరులకు తెలుసు. హిందీని జాతీయభాషగా భావింపజేసే లక్ష్యంతో చేపడుతున్న ప్రజావ్యతిరేక విధానాలతో పాటు, వాళ్లు చెప్పే జాతీయవాదానికి పూర్తి వ్యతిరేకంగా–ఆంగ్ల భాషానుకూల కార్పొరేట్ విద్యారంగ పటిష్టతకు దారితీసే కేంద్రవిధానాల లోగుట్టు అంతా అమ్మనుడి పాఠకులకు విదితమే.

ఒకే దేశం–ఒకే పన్ను, ఒకే దేశం–ఒకేసారి అన్ని ఎన్నికలూ లాంటి విధానాల సంగతేమోగాని, ఒకే దేశం–ఒకే భాష అంటే మాత్రం మనదేశంలో చెల్లదు గాక చెల్లదు.

'మీ మతమూ, మా మతమూ ఒకటే; కాని మీ భాష, మా భాష వేరు' అనే ప్రాతిపదికన బంగ్లాదేశ్ రాజ్యం ఏర్పడింది. 'మీ భాషా, మా భాషా ఒకటే; కానీ మా ప్రాంతాన్ని మేమే పరిపాలించుకొంటాం' అనే నినాదంతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడింది. ఈ రెండు పరిణామాలను కలుపుకొని ఆలోచించాలి. తమిళనాట జరిగిన ద్రావిడ సాంస్కృతికోద్యమం, హిందీ వ్యతిరేకోద్యమాలను అధ్యయనం చెయ్యాలి. దక్షిణ భారతదేశంలో రాజకీయంగా నివురుగప్పిన నిప్పులా ఏళ్లతరబడీ వున్న ఉత్తర భారత వ్యతిరేక భావనలను విస్మరించకూడదు.

హిందీని కేంద్ర అధికారభాషగా చెయ్యాలని, 15 ఏళ్లలో ఇంగ్లీషును దేశం నుంచి పారద్రోలాలని నిర్ణయించి అర్ధశతాబ్దం దాటిపోయింది. ఈలోపున ఆంగ్లభాష అన్నిస్థాయిల్లోనూ వ్రేళ్లూనుకొంది. దీనికి మన పాలకుల బానిసభావాలే కారణం. ఇప్పుడు జాతీయభాషగా హిందీని అన్నిస్థాయిల్లో బలవంతంగా రుద్దాలనుకోవడం ప్రమాదకర పరిణామాలకు దారితీస్తుంది. కావాలంటే – ఈ అంశాన్ని జాతీయస్థాయిలో చర్చకుపెట్టి అన్నిరకాల భావాలనూ ఓపికగా విని, ఒక విధానాన్ని నిర్ణయించగల మహాప్రయత్నం జరగాలి. మొత్తంగా దేశంలోని మాతృభాషలు ముఖ్యంగా రాజ్యాంగం గుర్తించిన 22 భాషల పరిస్థితిపై – ఒకనాటి రాజ్యాంగ నిర్ణయసభలో జాతీయభాష–అధికార భాషలపై చర్చ జరిగిన స్థాయిలో – ఇప్పుడు మళ్లీ కసరత్తు చెయ్యాలి. అలాకాకుండా ఏకపక్షంగా కేంద్రం తన అజెండాను భాష విషయంలో దేశీయులపై రుద్దాలని ప్రయత్నిస్తే అది తీవ్ర సంక్షోభానికి దారితీస్తుంది.

ఆధిపత్యవాదం–అది ఏరూపంలో ఉన్నా సహించదగింది కాదు. భాషాధిపత్యాన్ని అసలు ఏమాత్రం సహించకూడదు. మనిషి పుట్టుకతోనే తెచ్చుకొనే వారసత్వపు ఆస్తి అమ్మనుడి. మన అమ్మనుడి తెలుగు మన ఆస్తి. దానిని నాశనంచేసే హక్కును ఎవ్వరికీ ఇవ్వలేం.

ఇదే హెచ్చరిక రెండు తెలుగురాష్ట్రాలలోని ప్రభుత్వాలకూ వర్తిస్తుంది. వేలఏళ్ళ చరిత్ర, శక్తి గల ప్రజలభాష తెలుగును అన్నిరకాలుగా అణచివేయడం జాతి ఆత్మవిస్మృతికి దారితీస్తున్నది. ఇప్పటికే ఈ అంశంపై రెండు రాష్ట్రాల్లోని ఆలోచనాపరుల్లోనేగాక, సాధారణ ప్రజల్లో కూడ తీవ్ర వ్యతిరేకత అలుముకొంటున్నది. రెండు రాష్ట్రాల ప్రభుత్వాలూ వెంటనే తెలుగులోనే నూరు శాతం పాలనను సాగించడంతోపాటు, విద్యారంగంలో తెలుగుస్థానం విషయమై స్పష్టమైన విధానాన్ని ప్రకటించాలి. ఇందుకోసం వెంటనే తగిన అన్ని చర్యలనూ చేపట్టాలి. రెండేళ్ళలో రానున్న ఎన్నికలలో ప్రజలభాషల అణచివేత ఒక అంశంగా చర్చకు వచ్చి, పాలక పక్షాల పుట్టి మునగకముందే కళ్ళు తెరవడం ఏలికలకే మంచిది.

తేది : 30-06-2017

సామల రమేష్‌బాబు

-రహ్మానుద్దీన్ షేక్
96869 03386

# భారతీయ భాషలు - భారతదేశంలో వలగూడు

గత సంచికలో ముఖ్యంగా భారతీయ భాషలలో వలగూడు (ఇంటర్నెట్) కు ఉన్న ప్రాధాన్యత, ఆంగ్ల ఇంటర్నెట్ వాడకం, భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడకం పోలికలు, ఆర్థికంగా భారతీయ భాషలలో వలగూడు ఉండాల్సిన అవసరం మొ॥ విషయాలు తెలుసుకున్నాం.

ఇక భారతీయ భాషలలో ఇంటర్నెట్ వాడుకరుల నడవడిక గురించి తెలుసుకుందాం.

99% మంది భారతీయ భాషా వలగూడు వాడుకరులు వలగూడును తమ చరవాణుల నుండి వాడుతున్నారు. 78% భారతీయులు (ఆంగ్ల వాడుకరులతో కలిపి) వలగూడును చరవాణుల ద్వారా పొందుతున్నారు. మొబైల్ లో లేదా కంప్యూటర్ లో ముందుగా స్థాపించి ఉన్న అప్లికేషన్‌లనే కొత్తగా చేరే వాడుకరులు ఎక్కువగా వాడుతున్నారు. 68% భారతీయులు ఆంగ్ల సమాచారం కన్నా సొంత భాషలో ఉన్న సమాచారం మెరుగైనదిగా భావిస్తున్నారు. భారతీయ భాషలన్నిటిలోకి తమిళ వాడుకరులు (42%) ఇంటర్నెట్‌ను స్వీకరించడానికి సిద్ధంగా ఉన్నారు. తరువాత వరుసలో హిందీ, కన్నడ భాషలున్నాయి.




తమిళం(42%), హిందీ(39%), కన్నడ(37%), బెంగాలీ(34%), మరాఠీ(34%), తెలుగు(31%), గుజరాతీ(28%) మరియు మలయాళం(27%)

35% మంది భారతీయ భాషా వలగూడు వాడుకరులు వలగూడును కేవలం ప్రభుత్వ సేవలను పొందడానికి, వాణిజ్య ప్రకటనలు చూడటానికి, వార్తలకు, డబ్బు చెల్లుబాట్లకు వాడుతున్నారు.

గ్రామీణ ప్రాంతాల వాడుకరులు సగటున వారానికి 530 నిమిషాలు (పది నిమిషాలు తక్కువ తొమ్మిది గంటలు) వలగూడుపై గడిపితే, నగర-పట్టణ ప్రాంతాల వాడుకరులు సగటున 487 నిమిషాలు (ఎనిమిది గంటలకు ఏడు నిమిషాలెక్కువ) సమయం







వలగూడుపై గడుపుతున్నారు

వినోదాన్నందించే అనువర్తనాలు, చాటింగ్ అనువర్తనాలకు 90% ప్రజాదరణ ఉంది. కాగా 88% భారతీయులు వ్యాపార ప్రకటనలను వారి సొంత భాషల్లో చూసేందుకు ఇష్టపడుతున్నారు. 2021 నాటికి భారతదేశం నుండి ఆంగ్లంలో వలగూడు వాడేవారికన్నా హిందీలో వలగూడు వాడే వారి సంఖ్య ఎక్కువగా ఉండనున్నది.



తెలుగు, తమిళం, బెంగాలీ, మరాఠీ భాషలలో వలగూడు వాడబోయే వారు మొత్తం 30% ఉండనున్నారు

తమిళం, కన్నడ భాషీయులు అత్యధిక శాతం వలగూడును వారి భాషలో స్వీకరించనున్నారు.

ఆంగ్లానికి బదులుగా వారి సొంత భాషను వలగూడుకు స్వీకరించనున్న ప్రజల శాతం, భాషల వారీగా:




హిందీ – 54%, బంగాళీ – 46%, తెలుగు – 60%, తమిళం – 74%, మరాఠీ – 43%, గుజరాతీ – 43%, కన్నడం – 74%.

వలగూడు ద్వారా వస్తువులు కొనుగోలు చేసే వారి సంఖ్య 2021 నాటికి నాలుగు రెట్లు పెరిగి 16.5 కోట్ల మంది భారతీయ భాషా వలగూడు వాడుకరులు తమ నిత్యావసరాలు – కూరగాయలు–పచారీ సరుకులన్నీ వలగూడు ద్వారానే కొనుగోలు చేయనున్నారు భారతీయ భాషలలో వలగూడును ఇవాళ వాడే వాడుకరులు ఎక్కువగా టీవీ, ఫ్రిజ్, వాషింగ్ మషీన్, ఏసీ లాంటి పెద్ద ఎలక్ట్రానిక్ ఉపకరణాలను కొంటున్నారు. దుస్తులు, ఫర్నిచర్, అలంకరణ వస్తువులను పెద్దగా కొనడం లేదు. ఆంగ్లంలో వాడేవారు దుస్తులు, పుస్తకాలు, అలంకరణ వస్తువుల కొనుగోలు జోరుగా చేస్తున్నారు.

| భాష | లక్షల్లో వాడుకరులు (2016) | లక్షల్లో వాడుకరులు (2021) |
|---|---|---|
| హిందీ | 190 | 750 |
| బెంగాలీ | 40 | 160 |
| తెలుగు | 40 | 140 |
| తమిళం | 50 | 170 |
| మరాఠీ | 40 | 170 |
| గుజరాతీ | 20 | 80 |
| కన్నడం | 30 | 120 |
| మలయాళం | 10 | 60 |

నేటికీ వంద శాతం పూర్తిగా (అంటే ఎంపిక–కొనుగోలు–డబ్బు చెల్లింపు) వలగూడు కొనుగోళ్ళు మన భాషలలో అందుబాటులో లేవు. ఐనా వస్తువుల వివరణ, సహాయం లాంటి పుటలను కొన్ని సంస్థలు భారతీయ భాషల తర్జుమాతో అందించాయి.

71% మంది వాడుకరులు సమాచారం వారి భాషలో అందుబాటులో లేకపోవడం వలన కొనుగోళ్ళు చేయడం లేదు.

42% మందికి వలగూడులో కొనే ఆసక్తి లేదు.

67% మందికి ఫోనుల్లో వస్తువులను చూసి కొనడం పై సంతృప్తి లేదు.

5% మందికి వలగూడులో కొనుగోలు చేయవచ్చని తెలియదు.

ఇక బ్యాంకింగ్ వ్యవస్థ కంప్యూటరీకరణ తరువాత చరవాణి ద్వారా డబ్బు చెల్లింపులూ పెరిగాయి. నేడు ఆంగ్లంలో వలగూడు వాడేవాళ్ళు 72%, భారతీయ భాషలలో వాడేవారు 28% గా ఉన్నారు. 2021 నాటికి ఈ సంఖ్యలో మార్పులు జరిగి 43% అవనుంది. 75% మంది బ్యాంకు వారు ఇచ్చిన అప్లికేషన్లో కాకుండా పేటీఎం లాంటి అప్లికేషన్లని వాడేందుకు ఇష్టపడుతున్నారు. **ఇందుకు ముఖ్య కారణం – బ్యాంకు వారి అప్లికేషన్లో ఆంగ్లం మాత్రమే ఉండి పేటీఎం లాంటి అప్లికేషన్లలో భారతీయ భాషలు ఉండటమే.** తమిళం, తెలుగు, కన్నడం మాట్లాడేవారు ఈ విధంగా ఆన్లైన్ చెల్లింపులలో చురుకుగా పాల్గొంటున్నారని తెలుస్తోంది.

2021 నాటికి 18 కోట్ల భారతీయులు కేవలం భారతీయ భాషలలో వార్తల కోసం వలగూడును చేరనున్నారు.

2016లో 10.6 కోట్ల భారతీయులు వార్తల కోసం వలగూడును చూస్తున్నారు, ఈ సంఖ్య 2021నాటికి 28.4 కోట్లు కానుంది. ఐతే వార్తల్లో కూడా ప్రాంతీయ వార్తలకే ఎక్కువ ప్రాధాన్యత ఉంది. క్రీడా వార్తలను 44% మంది చూస్తుండగా రాజకీయ వార్తలను 39% మంది చూస్తున్నారు.

వలగూడుకు వార్తల కోసం జనాలు ఎందుకు రావడం లేదని సర్వే జరపగా, 94% మంది మన భాషలలో సమాచారం లేక పోవడాన్ని కారణంగా చెప్పారు. 38% మంది మాత్రమే కంప్యూటర్–లాప్టాప్–చరవాణి వాడకం ఇబ్బంది అన్నారు. 8% ప్రజలకు వార్తలు వలగూడులో చదవవచ్చు అన్న విషయం అస్సలు తెలీదు.

గూగుల్ వారి అంచనా ప్రకారం 3.2 కోట్ల మంది మరే ఇతర వనరుల్లో వార్తలు చూడటం కానీ చదవటం కానీ చెయ్యటం లేదు. వీరంతా వలగూడులో మాత్రమే వార్తలు చదువుతున్నారు/చూస్తున్నారు.

60% మందికి ప్రాంతీయ వార్తలే కావాలి. రాబోయే రోజుల్లో అనకాపల్లి లోకల్ న్యూస్, కనిగిరి వార్తలు, కావలి సుద్దులు లాంటి యూట్యూబ్ ఛానళ్ళకు ఈనాడుకు మించి ప్రజాదరణ వస్తుందన్నా అతిశయోక్తి కాదేమో!

**ఎప్పటికప్పుడు, మనకు నచ్చిన తాజాగా వార్తలు అందించడం వలనే వలగూడుకు ప్రజాదరణ పెరిగింది.**

హిందీ, మరాఠీ, బెంగాలీ, తమిళంలో వార్తలు చూసేవారు మొత్తం భాషలలో వార్తలు చూసేవారిలో 80% గా ఉండనున్నారు.

మొబైళ్ళలో సమాచారం చూసే వారిలో 99% వార్తల కోసమే చూస్తున్నారు.

ఒకవేళ భారతీయ భాషలలో విస్తృతంగా వార్తలు రావటం మొదలైతే మరో 56% ఆంగ్లంలో వార్తలు చూస్తున్న/చదువుతున్న జనాభా భారతీయ భాషలకు మారతారు.

Language wise preference for digital news categories[19]

| Categories | Hindi | Bengali | Telugu | Tamil | Marathi | Gujarati | Kannada | Malayalam |
|---|---|---|---|---|---|---|---|---|
| Regional | 82% | 67% | 58% | 63% | 72% | 68% | 56% | 65% |
| Sports | 49% | 60% | 42% | 45% | 35% | 44% | 47% | 18% |
| Politics | 40% | 16% | 64% | 61% | 27% | 17% | 47% | 36% |
| Entertainment | 48% | 35% | 58% | 44% | 43% | 67% | 31% | 59% |

2021 నాటికి 10 కోట్ల మంది ఉద్యోగాలు వలగూడులోని వ్యాపార ప్రకటనలపై ఆధారపడి ఉంటాయి. **వ్యాపార ప్రకటనలు ఆంగ్లం కన్నా భారతీయ భాషలలో ఉంటేనే మెరుగైన స్పందనలు వస్తున్నాయని వ్యాపార సంస్థలు ఒప్పుకున్న విషయం.**

53% ప్రకటనలు ఉద్యోగాల గురించి ఉండనున్నాయి. 34% వివాహ సంబంధాల గురించి, 28% రియల్ ఎస్టేట్ గురించి ఉన్నాయి.

(సశేషం)

## ఇకపై హిందీలో కూడా భారత పాస్‌పోర్టులు

భారతదేశంలో 22 అధికారికంగా గుర్తింపు పొందిన భాషలున్నాయి. ఒక అంచనా ప్రకారం 14.5–24.5 శాతం భారత పౌరులు హిందీ భాషని మాట్లాడుతున్నారు. 45 శాతం భారతీయులు, అవధీ, భోజ్?పురి లాంటి ఏదో ఒక హిందీ మాండలికంలో మాట్లాడుతున్నారు. నేటి వరకు పాస్‌పోర్టులు కేవలం ఆంగ్లంలో మంజూరు చేసేవారు. కానీ ఇక మీదట హిందీలో కూడా పాస్‌పోర్టులు అందుబాటులోకి వస్తాయి. భారత ప్రభుత్వం హిందీకి ఇస్తున్న ప్రాధాన్యత వలన మరొక కొత్త శకం మొదలయింది. ఇక మీదట హిందీ, ఆంగ్లం రెండు భాషలలోనూ పాస్‌పోర్ట్ తీసుకోవచ్చు. ఈ ప్రకటనను కేంద్ర విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి సుష్మా స్వరాజ్ ప్రకటించారు.

## తెలుగు రచయిత వాసాల నరసయ్యకు 2017 బాల సాహిత్య పురస్కారం

2017కు గాను తెలంగాణ ప్రముఖ బాలసాహిత్య రచయిత వాసాల నరసయ్యకు కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కారాన్ని ప్రకటించింది. 35 యేళ్ళకు పైగా తెలుగులో బాలల సాహిత్యానికి చేసిన సేవకు గాను ఆయనకు ఈ పురస్కారం ప్రకటించారు.

నవంబర్ 14న జరిగే ఒక కార్యక్రమంలో ఈయనకు పురస్కారంతో పాటుగా 50,000 రూపాయల నగదు బహుమతిని ఇవ్వనున్నారు.





తెలుగుజాతి ట్రస్టు ప్రచురణం
పుటలు : 254
వెల : రు.200/–లు

**మీరు చదివారా? చదవకపోతే, వెంటనే చదవండి.**

రెండు తెలుగు రాష్ట్రాలకు బయటి రాష్ట్రాలలోని తెలుగువారి గురించి ఎన్నో విశేషాలు తెలుసుకోండి. తెలుగు సమాజ పరిశోధకుడు, నిరంతర అన్వేషి **స.వెం.రమేశ్** వ్యాసాల సంపుటి.

**'ఎల్లలు లేని తెలుగు'**

పుస్తకం కావలసినవారు రు.200/–లను ఎం.ఓ గాని, బ్యాంక్ డ్రాఫ్టు గాని పంపాలి. సొమ్ము చేరిన వెంటనే పుస్తకాన్ని కొరియర్ ద్వారా గాని రిజిస్టర్డు బుక్‌పోస్టుగా గాని పంపగలము. చిరునామా, ఫోన్ నెంబరుతో సహా తెలియపరచాలి.

డా॥సామల లక్ష్మణబాబు, ట్రస్టీ, తెలుగుజాతి (ట్రస్టు), 8–386, జీవక భవన్, అంగలకుదురు, తెనాలి–522 211, ఫోన్ : 94404 48244

హైదరాబాదులో : నవోదయ బుక్‌హౌస్, ఆర్యసమాజ్ ఎదురు సందు, కాచిగూడ క్రాస్‌రోడ్స్ దగ్గర, ఆర్ట్స్ అండ్ లెటర్స్, ఇందిరాపార్క్ క్రాస్‌రోడ్స్ వద్ద లభించును.

- బి.ఆర్. బాపూజీ

# తెలుగు భాషా సాహిత్యాలపై పరిశోధన

## కొన్ని భావనలూ, పద్ధతులూ, మార్గదర్శక సూత్రాలూ

**ఈ పత్రం పరిధీ, పరిమితులూ**

ఈ పత్రాన్ని ఒక పాఠం అనుకోవచ్చు. లేదా ఒక ప్రసంగ వ్యాసం అనుకోవచ్చు. భాషా సాహిత్యాలపై పరిశోధనకి సంబంధించి కొన్నిభావనలనూ( కాన్సెప్ట్సు), పద్ధతులనూ( మెథడ్స్), మార్గదర్శక సూత్రాలనూ( గైడ్ లైన్స్) క్లుప్తంగా ప్రస్తావించి, వాటిని పరిశోధక విద్యార్థులకు( ఎంఫిల్, పీహెచ్‌డీలు చేసే విద్యార్థులకు) పరిచయం చేయాలన్నది ఈ పత్రం ఉద్దేశం. ఈ పరిచయం సమగ్రమైనది కాదు. తెలుగు భాషా సాహిత్యాలపై జరిగిన, జరగవలసిన పరిశోధనలకు స్పష్టంగా, సూటిగా అన్వయించి, ఉదాహరణలతో, విశదీకరించి చెప్పినది చాలా తక్కువ. దీన్ని ఒక సంక్షిప్త పరిచయ పత్రంగా మాత్రమే పరిశోధక విద్యార్థులు భావించాలి.

**కొన్ని నిర్వచనాలు:**

ఫ్రాన్స్ దేశపు తత్వవేత్త వోల్టేర్ ఒక సందర్భంలో ఇలా అన్నాడు:"నాతో సంభాషించదలిస్తే, నీ మాటల్ని నిర్వచించు" అని.

ఇద్దరు వ్యక్తులు గానీ, అంత కన్న ఎక్కువ మంది గానీ జరిపే సాధారణ సంభాషణల్లో అయినా, శాస్త్ర చర్చల్లో అయినా ఎవరు ఏ మాటని, ఏ అర్థంతో వాడుతున్నారో స్పష్టత లేకపోతే, సంభాషణా సాగదు; శాస్త్ర చర్చా సాగదు. సాగినా అది అనేక వలయాలు తిరిగి, బైల్దేరిన చోటుకే వచ్చే ప్రమాదం వుంది.

ఈ పాఠంలో లేదా ఈ పత్రంలో ఏ అంశాలు చర్చించదల్చుకున్నామో, వాటిని ముందుగా నిర్వచించుకుందాం.

ఒక మాటకి వున్న అర్థాన్ని స్పష్టంగా చెప్పడమే నిర్వచనం. ఈ వ్యాసం ప్రధాన శీర్షికలో వాడిన కొన్ని మాటల్ని ఏ అర్థంతో వాడామో చూద్దాం.

**తెలుగు భాష:** శాసనాల్లోనూ, తాళపత్ర గ్రంథాల్లోనూ, అంతకు ముందు జనపదాల్లో వుండి తరతరాలుగా కొనసాగుతూ వుండిన తెలుగు నించీ మొదలుపెట్టి, ఆధునిక సాహిత్యంలోనూ, దైనందిన సంభాషణల్లోనూ, ప్రసార మాధ్యమాల్లోనూ – వివిధ ప్రాంతాలలో, వివిధ వృత్తులలో, వివిధ సందర్భాల్లో, వివిధ సామాజిక శ్రేణులు వాడే ఇప్పటి తెలుగు వరకూ వున్న భాషా రూపాలన్నీ కలిసినదే తెలుగు భాష.

**తెలుగు సాహిత్యం:** నన్నయ పూర్వపు లిఖిత, అలిఖిత సాహిత్యంతో మొదలుపెట్టి, ఈనాటి వరకూ వున్న లిఖిత, అలిఖిత సాహిత్యం అంతా తెలుగు సాహిత్యమే. సాహిత్య రూపాలూ, ప్రక్రియలూ, ప్రమాణాలూ, సామాజిక దృక్పథాలూ, నేపథ్యమూ, పరిధీ మొదలైన లక్షణాలు ఏమైనప్పటికీ అంతా సాహిత్యమే.

**పరిశోధన:** ఏ విషయం మీదైనా ( ఇక్కడ, మన సందర్భం భాషా సాహిత్యాల మీద ) ఒక క్రమ పద్ధతిలో పరిశీలన జరపడం. ఆ పరిశీలన అనేక విధాలు. కొత్త అంశాలను కనుగొనడం; అప్పటికే కనుగొన్న అంశాల్ని తిరిగి సమీక్షించడం; కొత్త సిద్ధాంతాల్ని ప్రతిపాదించడం; ఉన్న సిద్ధాంతాల్ని సమీక్షించి, వాటిని విస్తృత పరచడం లేదా అవి నిష్ఫలమని నిరూపించి తిరస్కరించడం; ప్రతీ పరిశీలనకీ తగినన్ని ఆధారాలు చూపడం; సరైన రీతిలో సమగ్రంగా విషయ సేకరణ చేయడం; సేకరించిన విషయాల ప్రాధాన్యతనూ, పరస్పర సంబంధాలనూ గుర్తించడం.

**కొన్ని మార్గదర్శక సూత్రాలు:**

పరిశోధనాంశాన్ని బట్టీ, ఆ భాషా సాహిత్యాల ప్రత్యేక స్వరూపస్వభావాలను బట్టీ పరిశోధనలో కొన్ని ప్రత్యేక సూత్రాలను మనం రూపొందించుకోవాలి. ఇక్కడ మనం అన్ని పరిశోధనాంశాలకూ స్థూలంగా, సాధారణంగా వర్తించే మార్గదర్శక సూత్రాల్ని పరిచయం చేసుకుంటున్నాము. వాటిని ఇలా ప్రస్తావించవచ్చును.

*1) పరిశోధనా ప్రణాళికను రూపొందించుకోవడం.*
*2) సంబంధిత పూర్వ పరిశోధనల్ని అధ్యయనం చేయడం.*
*3) పరిశోధనలో సమాచార ప్రాధాన్యతను గుర్తించి, సేకరణ పద్ధతుల్ని రూపొందించుకోవడం.*
*4) అంతిమంగా పరిశోధనా క్రమం మీదా, ఫలితాల మీద వివరణాత్మక నివేదికను రూపొందించడం.*

**<u>పరిశోధనా ప్రణాళిక</u>**

ఒక పరిశోధనాంశానికి సంబంధించిన సమాచారాన్ని తక్కువ వ్యయ ప్రయాసలతోనూ, ఎక్కువ క్రమ పద్ధతిలోనూ, సమర్థవంతంగానూ సేకరించి, విశ్లేషించడానికి కావలసిన కార్యాచరణ ప్రణాళికే పరిశోధనా ప్రణాళిక.

**పరిశోధనా ప్రణాళికలో అంతర్భాగాలు / దశలు**

**(1) పరిశోధనాంశపు ఎన్నిక:**

ఏ అంశం మీద పరిశోధించదల్చుకున్నామో మనకో స్పష్టత వుండాలి. లేని పక్షంలో మన పరిశోధనకి దారీ తెన్నూ వుండదు. మనకి కావాల్సిన సమాచారం ఏమిటో స్పష్టత రాదు. ఉదాహరణకి, భాషకి సంబంధించిన ఏ అంశం మీద? మాండలికాల మీదా? అయితే, ఏ మాండలికం మీద? మాండలికంలో ఏ అంశం మీద? వర్ణ వ్యవస్థ గురించా, పద నిర్మాణ పద్ధతుల గురించా, వాక్య భేదాల గురించా? మాండలిక అస్తిత్వ స్పృహ గురించా, ప్రామాణిక భాషా రూపాల వేపు చూపే మొగ్గు గురించా? భాషా బోధనా పద్ధతుల మీదా మన పరిశోధన? భాషాంతరీకరణ క్రమంలో జరిగేసర్దుబాట్ల గురించా, అప్పటికే జరిగిన అనువాదాల మూల్యాంకనం గురించా మన పరిశోధన? మాతృభాషని నేర్చు

కునే దశలు పిల్లల్లో ఎలా వుంటాయో అనే దాని గురించా? భాషా నవీకరణ గురించా? – ఇలా ఏదో ఒక నిర్దిష్టమైన పరిశోధనాం శాన్ని ఎంచుకోవాలి.

**(2) సమాచార మూలాల గుర్తింపు:**

పరిశోధనాంశాన్ని ఎంచుకున్న తర్వాత, ఆ అంశానికి సంబంధించిన ఉపయుక్తమైన సమాచారం ఏ యే చోట్ల నించీ, ఏ యే పద్ధతుల్లో సేకరించాలో తెలిసి వుండాలి. సమాచారం ముద్రితమా, అముద్రితమా? అధికారికమా, అనధికారికమా? వ్యక్తిగతమా, బహిరంగమా? పత్రికలా, పుస్తకాలా, రికార్డయిన ఉపన్యాసాలా? వ్యక్తిగత (అముద్రిత) డైరీలా? సజీవులైన వ్యక్తులతో ముఖాముఖీలా? – ఇలా సమాచారానికి వుండే రక రకాల మూలాల గురించి స్పష్టత వుండాలి.

**(3) పరిశోధన స్వరూప, స్వభావాలు:**

మన పరిశోధన స్వరూప స్వభావాల గురించి మనకి ముందే స్పష్టత వుండాలి. ఒక ప్రత్యేక / విడి రచయిత గురించి గానీ, రచన గురించి గానీ, ధోరణి గురించి గానీ మనం ప్రత్యేక పరిశీలన (కేస్ స్టడీ) చెయ్యదల్చుకున్నామా? ఇద్దరూ, అంతకన్న ఎక్కువ మంది రచయితల మధ్య లేదా రచనల మధ్య లేదా ధోరణుల మధ్య లేదా మాండలికాల మధ్య వుండే సామ్యాల గురించీ, భేదాల గురించా (కంపారెటివ్ స్టడీ) ఒక విడి రచయిత శైలిని గానీ, ఒక ధోరణికి ప్రాతినిధ్యం వహించే రచయితల శైలిని గానీ గణాంక పద్ధతిలో (స్టాటిస్టికల్‌స్టడీ) పరిశీలించదలిచామా? మాతృభాషకి సంబం ధించి గానీ, ద్వితీయ భాషకి సంబంధించి గానీ పిల్లలు ఏ యే భాషాంశాల్ని ఏ క్రమంలో, ఏ యే దశల్లో నేర్చుకుంటారూ – అనే ప్రయోగాత్మక పరిశీలనా (ఎక్స్‌పెరిమెంటల్ స్టడీ) మన పరిశోధన స్వభావం?

**(4) పరిశోధన లక్ష్యం:**

అంతిమంగా మన పరిశోధన లక్ష్యం ఏమిటీ – అనే అంశం మీద స్పష్టత వుంటేనే, లక్ష్యసాధన సాధ్యం అవుతుంది. ఎంచు కున్న పరిశోధనాంశాన్ని వర్ణనాత్మకంగా పరిశీలించడమా (డిస్క్రి ప్టివ్ స్టడీయా?) ఆ అంశం అలా ఎందుకు వుందీ – అనేదాన్ని వివరించడమా (ఎక్స్‌ప్లనేటరీ స్టడీయా)? మన పరిశీలన ఆధా రంగా అంతిమంగా సైద్ధాంతిక సూత్రాలను రూపొందించడమా (థియరిటికల్ స్టడీయా)? భాషా సాహిత్యాల బోధనకు గానీ, నేర్వడానికి గానీ ఉపకరించే – రక రకాల నిఘంటువులూ, వ్యాక రణ గ్రంథాలూ, సంప్రదింపు గ్రంథాలూ (మాన్యువల్స్) వాచ కాలూ, భాషా సాహిత్య మూల్యాంకనా సూత్రాలూ మొ॥– జ్ఞాన పరికరాలను రూపొందించే అనువర్తిత అధ్యయనమా (అప్లైడ్ రిసర్చ్)?

**(5) సామాజికాంశాల పట్ల అవగాహన:**

భాషా, సాహిత్య రంగాలలో మనం జరిపే పరిశోధనల్లో అనేక సామాజిక అంశాలు ప్రస్తావనకు వస్తాయి. కులం, మతం, ప్రాంతం, వయసు, స్త్రీ పురుష భేదం (జెండర్), వర్గం మొదలైన సామాజికాంశాల గురించి పరిశోధకులుగా మనకు తగినంత అవగాహన అవసరం. వాటికి సంబంధించిన వాదాలూ, సిద్ధాంతాలూ, దృక్పథాలూ, భావనలూ వగైరాల గురించి తగినంత అధ్యయనం వుండాలి. మనం మన అనుభవాల్ని బట్టో, సామాజిక స్తితి గతుల్ని బట్టో ఏదో ఒక (ఫలానా) వాదాన్నో, సిద్ధాంతాన్నో అంగీకరించవచ్చుగాక. అలా అంగీకరించే, ఆచరించే హక్కు మనకు వుంది. కానీ, మనం సరైనదని భావించే దృక్పథానికి భిన్నమైన, లేదా వ్యతిరేకమైన దృక్పథాల గురించిన పరిజ్ఞానం కూడా మనకు తగినంత వుండాలి. మన దృక్పథం సరైనదని శాస్త్రీయమైన ఆధారాలతో, తర్కబద్ధమైన వాదనలతో నిరూపించే క్రమంలో, మన దృక్పథానికి భిన్నమైన / వ్యతిరేకమైన వాదనలకు వున్న పరిమితులను వివరించగలగాలంటే, వాటి గురించి కూడా బాగా తెలిసి వుండాలి.

**(6) పరిధీ, పరిమితుల పట్ల స్పష్టత:**

పరిశోధకులు తమ పరిశోధనకున్న పరిధిని స్పష్టం చేసుకో వాల్సి వుంటుంది. ఉదా॥ భాషగురించి పరిశోధన అయితే, భాషలో ఏ నిర్దిష్ట అంశం; సాహిత్యంలో ఒక ధోరణి గురించి అయితే, ఆ ధోరణికి చెందిన అందరు రచయితల గురించా, ఫలానా కొద్ది మంది గురించా; ఫలానా ఒక్క వ్యక్తి గురించా; ఒకే తరహా రచనలన్నిటి గురించా, కొన్నిటి గురించా, ఏదో ఒక్క ప్రాతినిధ్య రచన గురించా – అది కూడా నిర్దిష్ట భౌగోళిక ప్రాంతా నికా? కులానికా, మతానికా, జెండర్‌కా, వర్గానికా? – ఇలా తగి నంత స్పష్టత వుండాలి. అలాగే కాలానికి సంబంధించి కూడా. స్వాతంత్ర్యం పూర్వం అనీ; నన్నయ పూర్వం అనీ; 1980 అనీ, 21 వ శతాబ్దం అనీ – ఏ పరిధిలో, ఏ పరిమితుల్లో పరిశోధన చేయబోతున్నామో ముందే ప్రణాళిక వేసుకోవాలి.

**(7) సమాచార సేకరణా పద్ధతులు:**

ఎవర్నిబడితే వాళ్ళని ఎంచుకుని సమాచారం సేకరిస్తామా (రాండం శాంప్లింగ్), కొన్ని లక్షణాల ఆధారంగా సమాచారం ఇచ్చేవారిని ఎంచుకుంటామా (స్ట్రాటిఫైడ్ శాంప్లింగ్) అనేది తేల్చుకోవాలి.

ఒక మాండలికం మీద పరిశోధన చేసేటప్పుడు, ఆ మాండలిక వ్యవహర్తల్ని కొంత మంది దగ్గిర సమాచారం సేకరించి ముగిస్తామా; లేకపోతే విద్యా, స్థాయీ, వృత్తీ, ఆర్థిక స్థితీ, వయస్సూ, స్త్రీ–పురుష భేదం, కులం – అనే అంశాల ఆధారంగా, ఒక్కో విభాగం నించీ కొంత మంది చొప్పున, వైవిధ్య పూరితంగా (కోటా శాంప్లింగ్) ఎంచుకుంటామా? – ఇలా అనేక విషయాల గురించి పరిశోధనా ప్రణాళికలో తగినంత స్పష్టత వుంటేనే, వీలైనంత ఎక్కువ నిర్దిష్టతనీ, సమగ్రతనీ సాధించగలం!

**<u>సంబంధిత పూర్వ పరిశోధనల అధ్యయనమూ, సమీక్షా</u>**

జ్ఞానం (అది లోకజ్ఞానం గానీ, శాస్త్ర జ్ఞానం గానీ) నిరంతరం విస్తరిస్తూ వుంటుంది. అది చేర్పులకూ, మార్పులకూ, తీర్పులకూ, తొలగింపులకూ లోనవుతూనే వుంటుంది. మొత్తం మీద అది నిరంతరం పెరుగుతూనే వుంటుంది. ఇవ్వాళ (వర్తమానంలో) మనం ఒక పరిశోధన చేపట్టామంటే, శూన్యంలోంచీ ప్రారం భించం. నిన్నటి వరకూ (గతంలో) జరిగిన పరిశోధనల

కొనసాగింపుగానో, వాటి నించి విడివడో – మొత్తం మీద గత పరిశోధనలతో సంబంధం లేకుండా (అనుకూలం కావచ్చు, ప్రతికూలం కావచ్చు) ఇప్పటి పరిశోధన సాగదు. అలాగే, ఇవ్వాళ మనం చేసే పరిశోధన రేపు (భవిష్యత్తులో) జరగబోయే పరిశోధనకు మార్గదర్శకంగా వుంటుంది. (అదే మార్గంలో కొనసాగడమా; వేరే మార్గానికి మళ్ళడమా అనే విషయంలో).

పరిశోధకులు (రచయితలు, విద్యాంసులు, భాషావేత్తలు మొ॥ వారు) తమ రచనల ద్వారా, అధ్యయనాల ద్వారా అనంతమైన భాండాగారాన్ని తర తమ భేదాలతో నింపుతూ వుంటారు. ఇవ్వాళ్టి పరిశోధకులు నిన్నటి వరకూ జరిగిన పరిశోధనల గురించీ; రేపటి పరిశోధకులు ఇవ్వాళ్టి వరకూ జరిగిన పరిశోధనల గురించీ వీలైనంత ఎక్కువగా సంబంధిత జ్ఞానాన్ని సంపాదించకపోతే, జ్ఞాన విస్తరణకి వారు చేయగలిగేది పెద్దగా వుండదు. లాంఛనంగా, పేరుకి మాత్రమే పరిశోధకులుగా మిగిలిపోతారు. ('డాక్టర్' అనే విశ్లేషణాల్ని తమ పేర్ల ముందు తగిలించుకుని!)

**పూర్వ పరిశోధనల లభ్యత:**

అవి సాధారణంగా గ్రంథస్థమై, లిఖిత రూపంలో వుంటాయి. పరిశోధనా గ్రంథాలు, విజ్ఞాన సర్వస్వాలు, పాఠ్య గ్రంథాలు, సంప్రదింపు గ్రంథాలు, శాస్త్ర పత్రికలు, నివేదికలు, పత్రికలు, దృశ్య శ్రవణ మాధ్యమాలూ వగైరాలలో దొరుకుతాయి.

**పూర్వ పరిశోధన అధ్యయనం ఎందుకంటే?**

మనం చేయబోయే పరిశోధనాంశానికి సంబంధించి గతంలో జరిగిన కృషి గురించి తెలుసుకోవచ్చు. దానికి సంబంధించిన భావనలనులోతుగా అవగాహన చేసుకోవచ్చును. వాటి ఆధారంగా కొన్ని ప్రతిపాదనలు చేసి, వాటికి వాస్తవంలో ఆధారాలున్నాయో లేదో మన పరిశోధనలో తెలుసుకోవచ్చును. గతంలో పరిశోధకులు అనుసరించినటువంటీ, సూచించినటువంటీ పరిశోధనా పద్ధతుల గురించి పరిచయం చేసుకోవచ్చును. ఇతర పరిశోధకులు సమాచారం కోసం ఎక్కడ, ఏ మూలాలను అన్వేషించారో తెలుస్తుంది. ఇతరులు తమ పరిశోధన ఫలితాలను నివేదించిన పద్ధతీ తెలుస్తుంది.

**పూర్వ పరిశోధనల సమీక్షలో చెయ్యాల్సిన పనులు:**

**1) పూర్వ పరిశోధనలో సేకరించవలసిన దాని గురించి స్పష్టత:** ఈ స్పష్టత రావాలంటే, దేని గురించి మన పరిశోధనా, ఆ పరిశోధనా లక్ష్యం ఏమిటీ – అనే విషయాల చిత్రణ. ఈ చిత్రణ ఆధారంగా పూర్వ పరిశోధనల నించి ఎలాంటి సమాచారాన్ని సేకరించాలీ, ఏది ఉపయోగం, ఏది అనవసరం అనేది తేల్చుకోవొచ్చును. అయితే, మనం సమాచార సేకరణా, సంబంధిత అధ్యయనమూ చేసే క్రమంలో, మన స్థూల చిత్రణ కూడా మారవచ్చును. ఉదా॥ భాషా ప్రామాణీకరణ క్రమం విద్యావంతుల్లో ఎలా జరుగుతోందీ అని ముందు అనుకుని, తర్వాత కేవలం ఒక్క ప్రాంతానికే పరిమితం అవుతామేమో.

**2) సేకరించిన సమాచారాన్ని నమోదు చేయడం:** గత పరిశోధనల్లో మనకు కనిపించే కొత్త భావాలూ, దృక్కోణాలూ, వాదనలూ, ఫలితాలూ మొ॥ వాటిని నమోదు చేయాలి. గత పరిశోధకులిచ్చిన నిర్వచనాలలో, సూత్రీకరణలలో ముఖ్యమైన వాటిని వేటిని ఉటంకించాలో వాటిని నమోదు చేయాలి – యధాతథంగా – నమోదు గుర్తులతో (ఇన్‌వెర్టెడ్ కామాస్‌తో).

ఉదా॥ "ప్రామాణికత అనేది ఒక రకమైన సామాజిక తీర్పు. భాషా ప్రయోగాల మీద సంక్లిష్టమైన సామాజిక విలువల్ని ప్రసరింపజేస్తారు – ఆ భాషా ప్రయోగం విలువ గలిగినదనీ, ఆ విలువేదో భాషాశాస్త్ర పరంగానే అంతర్గతంగా ఉన్నదనీ అర్థం వచ్చేలా!" (కృష్ణమూర్తి 1976: 673)

కొన్నిసార్లు యధాతథంగా కాకపోయినా, పూర్వ పరిశోధకుల మాటల, సూత్రీకరణల సారాంశాన్ని మాత్రమే ఇవ్వాల్సివుంటుంది.

ఉదా॥ ప్రామాణిక భాష గురించి కూడా రామయ్యగారి సానుభూతిపరుల్లో భిన్న వ్యక్తీకరణలు కనిపిస్తాయి. ప్రామాణిక భాష అనేది సమాజ భాష అని చుక్కా రామయ్యగారితో పాటు పేర్వారం జగన్నాథం గారూ, సి. ధర్మారావు గారూ; ప్రాంతీయ భాష అని ఇంకో సందర్భంలో సి. ధర్మారావు గారూ; కొన్ని జిల్లాలలో మాత్రమే వాడుకలో వున్న భాష అని రజా హుస్సేను గారూ; కోస్తా వారి భాష అని గుడిపాటి వెంకటేశ్వర్లు గారూ భావించారు.

**3) నమోదులో క్రమబద్ధత:** పూర్వ పరిశోధనల నించీ ఉపయుక్త అంశాలను నమోదు చేసేటప్పుడు, వాటి కాలక్రమాన్ని గమనంలోకి తీసుకుంటే మంచిది. దానివల్ల ఒక అంశం (ఉదా॥ స్త్రీల ఆత్మ గౌరవం, పేదల పోరాటాలు మొ॥) గురించి, పూర్వ పరిశోధకులు, ఆ యా కాలాల్లో ఎలాంటి అవగాహనతో వున్నారో, ఆ సామ్యాలూ, భేదాలూ, మనకి బాగా అర్థమవుతాయి. మన పరిశోధనలో వాటి నిగ్గు తేల్చడానికి మనం ప్రయత్నించవచ్చును. ఆ యా అంశాల నిర్వచనాలనూ, అవగాహనలనూ నిర్విమర్శగా ఆమోదించడమో; విమర్శనాత్మకంగా పరిశీలించి అవసరమైతే తిరస్కరించడమో, సవరించడమో చేయడానికి వీలుంటుంది.

అయితే, ఈ నమోదు చేసే పనిలో ఒక సాంకేతికాంశం వుంది. గతంలో ఒక బైండు పుస్తకం లోనో, పల్చటి విడి విడి కాయితాల లోనో నమోదు చేసేవారు. పైగా, అన్నిటినీ, వరసపెట్టి రాసుకుంటూ పోయేవారు. అలాంటి పద్ధతి వల్ల తర్వాత తర్వాత కొన్ని ఆచరణాత్మక ఇబ్బందులు వస్తాయి. సమయమూ, శక్తీ వ్యర్థమవుతాయి – కాయితాల్ని వెనక్కీ ముందుకీ తిరగేస్తూ, తిప్పుతూ పోతూ వుంటే! పైగా, అవన్నీ నలిగిపోవడం, ఛిద్రం అవ్వడం జరగవచ్చు. పైగా, ఒక అంశానికో, ఉప అంశానికో సంబంధించినవన్నీ ఒకే చోట వుండవు. ఒక పూర్వ పరిశోధన లోంచీ నమోదు చేసుకున్న అంశాలన్నీ, ఒకే వరసలో, ఒక చోట వుంటాయి. ఇంకో పరిశోధనకి సంబంధించినవి ఇంకో చోట వుంటాయి.

అలా కాక, పావు ఠావు సైజు కంటే చిన్నవైన మందపాటి కాయితాల వంటి కార్డుల మీద నమోదు చేస్తే, అవి నలగవూ, పాడు కావు. పైగా, అంశాలవారీగా, కాలక్రమం వారీగా, ఇతర అవసరాల వారీగా మనం ఆ కార్డుల్ని ఎప్పటికప్పుడు అమర్చుకోవచ్చు, ఆ అమరికను మార్చుకోనూ వచ్చు. సమాచార వర్గీకరణకు ఎంతో అనువుగా వుంటుంది కార్డుల మీద నమోదు చేసే పద్ధతి.

**4) నమోదులో రెండు రకాల కార్డులు:** రెండు రకాలుగా నమోదు

వుంటుంది. ఒకటి, పూర్వ పరిశోధనకు సంబంధించిన సాంకేతిక వివరాలు పొందుపరిచే కార్డులు. ఇది అర్ధ పావు తావు సైజు కంటే చిన్నగా వుండాలి. పరిశోధకుడి / పరిశోధకురాలి పేరూ; రచనా కాలం లేదా మొదటిసారి ముద్రించిన కాలం; పరిశోధనా గ్రంథం / వ్యాసం పేరూ; ప్రచురణ స్థలం పేరూ; ప్రచురణ సంస్థ పేరూ; సంప్రదించిన ప్రతి కాలం రచనా కాలం నించో మొదటి ముద్రణ కాలం నించో భిన్నమైనదైతే ఆ సంవత్సరం.

(ఉదా॥ అహ్మద్, ఐజాజ్. 1992. ఇన్ థియరీ. కాసెస్, నేషన్స్, లిటరేచర్. ఢిల్లీ: ఆక్స్‌ఫర్డ్ యూనివర్సిటీ ప్రెస్, 1997.)

రెండో రకం కార్డులు కొంచెం పెద్ద సైజులో వుంటాయి - పావు తావు సైజు కార్డులు. వీటి మీద, పూర్వ రచనల నించీ విడి విడి ఉటంకింపులు రాసుకోవచ్చును - ఒక కార్డు మీద ఒకటే - అలా! ఈ కార్డుల మీద ఉటంకింపు చివరన, బ్రాకెట్లలో పరిశోధకుడి పేరూ, రచనా సంవత్సరం: పేజీ నంబరూ రాసుకోవాలి.

(ఉదా॥ కృష్ణమూర్తి 1976: 673).

### పరిశోధనలో సమాచార ప్రాధాన్యత

ఏ పరిశోధనకైనా రకరకాల సమాచారం అవసరం. సమాచారం అంటే ఒక విషయానికి సంబంధించిన వాస్తవాలే! ఒక్కోసారి కొన్ని రకాల పరిశోధనల్లో గణాంకాలు కూడా అవసరం పడతాయి.

పరిశోధనని ఒక కట్టడంగా వూహిస్తే, భవన నిర్మాణానికి ఎలానైతే ఇటుకలూ, సిమెంటూ వగైరాలు అవసరమో, పరిశోధనకి కూడా ఉపయుక్తమైన, సంబంధిత సమాచారం అవసరం.

పరిశోధనను విజయవంతంగా సాగించాలంటే, సమాచారాన్ని సరైన చోట్ల నించీ సంపాదించాలి.

### సమాచారంలో రకాలు:

**ప్రత్యక్ష సమాచారం:** పరిశోధకులే స్వయంగా తాము ఏ రంగంలో పరిశోధన చేయాలనుకుంటారో ఆ రంగంలో స్వయంగా సేకరించే సమాచారమే ప్రత్యక్ష సమాచారం (దీన్ని ప్రాథమిక సమాచారం - ప్రైమరీ డాటా) అని కూడా అంటూంటారు.

**పరోక్ష సమాచారం:** పరిశోధకులు స్వయంగా కాకుండా, అప్పటికే ఇతరులు సేకరించిన సమాచారం. ఇది అచ్చు రూపంలో గానీ, అచ్చు కాకుండానే ఏదో రూపంలో రికార్డు అయి వుంటుంది. ఇతర పరిశోధకులు, తమ స్వంత, నిర్దిష్ట పరిశోధనలకు కావాల్సిన సమాచారాన్ని సేకరించినా, అది ఇతర పరిశోధకులకు ఏదో ఒక కోణంలో పరోక్షంగా వుపయోగపడుతుంది. దీన్ని ద్వితీయ తరహా సమాచారం - సెకండరీ డాటా - అని కూడా అంటూంటారు.

### సమాచార సేకరణ:

ఇది రక రకాలుగా వుంటుంది.

**ప్రత్యక్ష క్షేత్రాధారిత సమాచార సేకరణ:**

**(1) ప్రత్యక్ష పరిశీలన (డైరెక్ట్ అబ్జర్వేషన్):** పరిశోధకులు ఏ అంశం గురించైతే పరిశోధించదల్చుకున్నారో సంబంధిత రచనల్నో, వ్యక్తుల్నో, సంఘటనల్నో, పరిణామాల్నో నేరుగా, ప్రత్యక్షంగా, స్వయంగా పరిశీలించడం ద్వారా సమాచారాన్ని సేకరించడం. అలా సమాచారాన్ని సేకరించేప్పుడు పరిశోధకులు సాధ్యమైనంత వరకూ, తమ ఇష్టాయిష్టాలనూ, రాగద్వేషాలనూ పక్కనబెట్టి పరిశీలిస్తేనే సమగ్ర సమాచారం దొరుకుతుందనేది ఒక అభిప్రాయం. కాని, భిన్న ప్రయోజనాలూ, తత్ఫలితంగా భిన్న మన స్తత్వాలు కలవారు రాగద్వేషాలకు అతీతంగా వుంటారా అన్నది ప్రశ్న!

**(2) ప్రశ్నావళి ద్వారా సమాచార సేకరణ:** పరిశోధనాంశానికి సంబంధించిన వివిధ కోణాలను స్పృశించేలా ప్రశ్నలు తయారు చేస్తే, విలువైన సమాచారం దొరికే అవకాశం వుంటుంది. తీసుకున్న పరిశోధనాంశం చాలా విస్తృతమైనదైతే, సమాచారాన్ని పరిశోధకులు స్వయంగా సేకరించడం ఆచరణ సాధ్యం కానప్పుడు, తత్సంబంధమైన వారికి ప్రశ్నావళులు పంపి ఎక్కువ సమాచారాన్ని సేకరించగలుగుతారు. ప్రశ్నావళిలో రాసే జవాబుల్ని బట్టి, సంబంధిత వ్యక్తుల భావాలూ, ఉద్దేశాలూ, ప్రేరణలూ వగైరాలు ప్రత్యక్ష పరిశీలనలోకన్నా ఎక్కువ స్పష్టంగా అర్థమవుతాయి. ఈ ప్రశ్నావళుల్ని పరిశోధకులు, సమాచారం ఇచ్చే వ్యక్తులకు (లేదా సంస్థలకు) స్వయంగా వెళ్ళి, విషయం చెప్పి ఇవ్వవచ్చును; లేదా, పోస్టు ద్వారా (ఈ రోజుల్లో ఈ మెయిల్ ద్వారా) కూడా పంపవచ్చును. ప్రశ్నావళుల్ని తగినంత అక్షరాస్యతా, విద్యాస్థాయీ వున్న వారికే పంపగలం. జానపద సాహిత్యం, తదితర మౌఖిక కళా రూపాల అధ్యయనంలో ఆ సమాచారం ఇవ్వగలిగే వారిలో అక్షరాస్యత లేని పక్షంలో ప్రశ్నావళుల్ని వారికి ఇచ్చి ప్రయోజనం వుండదు. అలాంటి వారి కోసం, పరిశోధకులే స్వయంగా గానీ, వారి సహాయ పరిశోధకుల ద్వారా గానీ, సంబంధిత వ్యక్తుల దగ్గిరికి వెళ్ళి, వారి జవాబుల్నీ వీరే, తమ దగ్గిరున్న ప్రశ్నావళులలో రాసుకోవాలి.

**(3) ముఖాముఖీ (ఇంటర్వ్యూ):**

కొన్ని రకాల పరిశోధనల కోసం, పరిశోధకులు సంబంధిత వ్యక్తుల్ని ముఖాముఖి కలిసి, వుపయుక్తమైన సమాచారం సేకరిస్తారు.

ముఖాముఖి ద్వారా సమాచార సేకరణలో కూడా పరిశోధకులు కొన్ని ప్రశ్నలు అడిగినప్పటికీ, ఈ ప్రశ్నలకీ, ముందుగా ఒక క్రమంలో తయారుచేసుకున్న ప్రశ్నావళికీ తేడా వుంటుంది. ముఖాముఖీలో ప్రశ్నలకు ఒక క్రమం వుండదు; ముందుగా కొన్ని ప్రశ్నలు తయారుచేసుకున్నా వాటిని అదే వరసలో అడగాలని లేదు. సందర్భాన్ని బట్టీ, వ్యవహర్తలు ఇచ్చే సమాచారాన్ని బట్టీ, కొత్త కొత్త ప్రశ్నలను కూడా అడగవచ్చు. పరిశోధనాంశం పట్ల పరిశోధకులకు వున్న స్పష్టతని బట్టీ, గాఢతని బట్టీ ఏ ప్రశ్ననైనా అడగవచ్చు.

### పరోక్ష లేదా లిఖిత సమాచార సేకరణ

**వ్యక్తిగత పత్రాలు:** వ్యక్తులు (ఉదా॥ రచయితలూ, విమర్శకులూ, కళాకారులూ) వేర్వేరు సందర్భాల్లో, వేర్వేరు వుద్దేశాలతో గ్రంథస్థం చేసుకున్న ఎన్నో రకాల సమాచారం, కొన్ని రకాల పరిశోధనలకు పరోక్షంగా వుపకరిస్తుంది. ఈ సమాచారం ముద్రితమైనదైనా కావచ్చు, అముద్రితమైనదైనా కావచ్చు. జీవిత చరిత్రలూ, ఆత్మ కథలూ, డైరీలూ, ఉత్తరాలూ, అనుభవాలూ, జ్ఞాపకాలూ

వగైరాలన్నీ ఈ కోవకి చెందినవి. వీటిని ఆ యా వ్యక్తులు రాసేటప్పుడు, భవిష్యత్తులో ప్రచురించాలీ - అనే దృష్టి లేకుండా రాసి వుంటే మాత్రం (ఉదా॥ డైరీలూ, లేఖలూ) వాటికి విశ్వస నీయత ఎక్కువ వుంటుంది.(ఉదా॥ చలంఉత్తరాలు- దీక్షితులు గారికి రాసినవి)

వ్యక్తిగత పత్రాలు ఆత్మ విమర్శతోనూ, కచ్చితత్వంతోనూ, నిష్పక్షపాతంగానూ వుండనప్పుడు వాటిలో శాస్త్రీయతా, విశ్వస నీయతా లోపిస్తాయి.

వ్యక్తిగత పత్రాల్ని సేకరించడం కష్టం. సేకరించిన వాటి మీద పూర్తిగా ఆధారపడడమూ, కచ్చితమైన నిర్ధారణలకు రావడమూ కూడా కష్టమే!

**బహిరంగ లేదా అధికారిక పత్రాలు:** ఈ పత్రాల్లో కొన్నిటిని ప్రభుత్వ సంస్థలూ, కొన్నిటిని ప్రభుత్వేతర సంస్థలూ సేకరించిన సమాచారం వుంటుంది. ఇవి సర్వసాధారణంగా అముద్రితాలు, కొన్ని జనాలకు అందుబాటులో తేవడానికి ముద్రిస్తారు కూడా. రికార్డులూ, పత్రికలూ, నివేదికలూ ఇలా రక రకాలుగా వుంటాయి. సినిమాలూ, టెలివిజనూ, రేడియో, బహిరంగ ఉపన్యాసాలూ - ఇలాంటివన్నీ కూడా బహిరంగ పత్రాల కిందికే వస్తాయి.

ఈ పరోక్ష, లిఖిత స్వభావం గలిగిన బహిరంగ పత్రాల్ని సేకరించడం తేలికే గానీ, వీటి విశ్వసనీయతనీ, సమగ్రతనీ పరిగణనలోకి తీసుకోవడం కష్టమే!

### పరిశోధనా నివేదిక (పరిశోధనా పత్ర రచన)

అది ఏమిటీ, ఎందుకూ?

పరిశోధనా క్రమాన్నీ, దాని ఫలితాల్నీ లాంఛనప్రాయంగా ప్రకటించేదే పరిశోధనా నివేదిక. పరిశోధనాంశం గురించీ, అనుసరించిన పరిశోధనా పద్ధతుల గురించీ, పరిశోధనలో కనుగొన్న విషయాల గురించీ, చేసిన నిర్ధారణల గురించీ ఈ నివేదికలో పొందుపరుస్తాము.

మన పరిశోధన ముగిసిందీ - అని (ఒక అర్థంలో) భావించాక, దాన్ని ఇతరులకు (ఇతర పరిశోధకులకూ, ఆసక్తి వున్న చదువరులకూ) నివేదించాలి. దానివల్ల మనకీ, ఇతరులకీ మంచిది. మన పరిశోధనలోని బాగోగులూ, పరిమితులూ, ప్రయో జనమూ మొదలైన విషయాలను ఇతరుల స్పందన ద్వారా తెలుసు కుని భవిష్యత్తులో మెరుగైనకృషికిమనం ప్రయత్నించగలం.

అలాగే, ఇతర పరిశోధకులకు మన పరిశోధనలోని అనుకూ లాంశాలైనా,ప్రతికూలాంశాలైనా మార్గదర్శకాలుగా పనికిరావచ్చు.

**నివేదిక కుండాల్సిన లక్షణాలు:**

పరిశోధనకి సంబంధించినదైనప్పటికీ, నివేదిక, హాయిగా చదివించే కథనంతో వుండాలి. అదే సమయంలో, పరిశోధనా ఫలితాలను బలమైన ఆధారాలతో చెప్పే పత్రంగా స్ఫురించాలి.

దాని అంతర్గత స్వభావాన్ని బట్టీ, అది అందించే సమాచా రానికుండే ప్రత్యేక స్వభావాన్ని బట్టీ అది నిర్దిష్టమైన చదువరుల (పరిశోధకులా, పరిశోధక విద్యార్థులా) బృందాన్ని వుద్దేశించినదై వుంటుంది. అందుకే అది చదివే వారిని, 'ఇలా చెయ్యాలీ, అలా చెయ్యాలీ' అని సూచించే తరహాలో వుండదు. మనం ఏం చేశామో, ఎలా చేశామో మాత్రమే తెలియపర్చాలి. పరిశోధనలో ఫలితాలను ఒక సమస్యలోనో, అంశంలోనో కొన్ని చర్యలు లేదా వైఖరి తీసుకోవాల్సిన అవసరాన్ని సూచించినట్టున్నాగానీ, పరిశో ధకులు సూచనలు చేసే విషయంలో కొంచెం జాగ్రత్తగా వ్యవహ రించాలని కొందరు భావిస్తారు. నివేదించే పద్ధతి, నివేదించే విషయానికి లోబడి వుండాలని కొందరి వాదన. కానీ, నివేదిక అన్నది సరళంగా, చదివించేదిగా, సరైన వ్యక్తీకరణతో వుండాలని భావించేవారూ వున్నారు.

**పరిశోధక నివేదికలు చేసే పనులు:**

పరిశోధించిన అంశాన్నీ; ఆ పరిశోధనలో అవసరమైన సమాచారాన్ని సేకరించి, విశ్లేషించడానికి అనుసరించిన పద్ధతుల్నీ; కనుగొన్న విషయాలనూ; వచ్చిన నిర్ధారణలనూ, అవసరాన్ని బట్టీ సందర్భాన్ని బట్టీ చేసే సూచనలనూ - ఒక క్రమ పద్ధతిలో నివేదించే పత్రంగా పరిశోధనా నివేదిక పనిచేస్తుంది. భవిష్యత్తులో సంబంధిత అంశంపై పరిశోధన చేసే వారికి సంప్రదింపు గ్రంథంగానూ, మార్గదర్శకంగానూ పనిచేస్తుంది. జరిగిన పరిశోధన నాణ్యతను ఇతరులు అంచనా కట్టడానికి, పరిశోధనా నివేదికలు పనికివస్తాయి.

అంతిమంగా, ఒక క్రమబద్ధమైన జ్ఞానం రూపొందడానికి దోహదపడుతుంది.

**ఇక ఇప్పుడు, సాహిత్య పరిశోధనా క్రమంలో మనకు తటస్థించే కొన్ని భావనల గురించీ, ధోరణుల గురించీ క్లుప్తంగా పరిచయం చేసుకుందాం.**

*(గమనిక: ఇక్కడ ఇస్తున్న వాటికి ఆధారం: సాహిత్య విమర్శ పదాల డిక్షనరీ. కూర్పరి ఎస్.ఎస్.నళిని. పర్యవేక్షణ: ముదిగొండ వీరభద్రయ్య. సహకారం: బి. ఆర్. బాపూజీ.ప్రచురణ: నవోదయా బుక్‌హౌస్, హైదరాబాదు).*

**అంతర్గత ఐక్యత:** నాటక సాహిత్యాన్ని పరిశోధించేవారు, ఏదేని నాటకంలో - ముఖ్యంగా ప్రాచీన నాటకాలలో - కథాంశానికీ, సంఘటనలకూ, సన్నివేశాలకూ, కాలవ్యవధికీ, స్థలానికీ, మధ్య అంతర్గత ఐక్యత (యూనిటీ) వుందా లేదా అనేది చూస్తారు.

**అంతర్గత ఆధార పద్ధతి:** ప్రాచీన కాలానికి సంబంధించిన రచనల కాలాన్ని నిర్ధారించడానికి పరిశోధకులు ఉపయోగించే ఒక పద్ధతి అంతర్గత ఆధారాల పద్ధతి (ఇంటర్నల్ ఎవిడెన్స్ మెథడ్).

**అంతరార్థం:** సాహిత్య పరిశోధకులు రచనల్లో స్పష్టంగా బైటికి వ్యక్తం కాకుండా ఉంటూ కూడా అందే అర్థాన్ని (లేటెంట్ కంటెంట్‌ని) వెలికితీస్తారు.

**ఉపపాఠం:** ఒక రచనలో రచయిత కొన్ని విషయాలు స్పష్టంగా చెప్పకపోయినా, సూచన ప్రాయంగానో, అస్పష్టంగానో చెప్పిన విషయాలు ఉపపాఠంగా వుంటాయి. ఆ అస్పష్ట విషయం గురించి, మొత్తం రచన ఆధారంగా పరిశోధకులు ఒక అవగాహనకు వస్తారు. అలాంటి విషయాల్ని 'ఉప - పాఠంగా' గుర్తిస్తారు.

**ఉపదేశాత్మక రచనలు:** సాహిత్యం అనేది కేవలం ఆనందం ఇవ్వడమే కాకుండా, ఆ రచనను చదవడం ద్వారా పాఠకులు ఒక

కొత్త విషయాన్నీ, మంచి విషయాన్నీ, నిత్య జీవితంలో వుపకరించేదాన్నీ పొందగలగాలి అని భావించే పరిశోధకులు అలాంటి రచనల్ని ఉపదేశాత్మక రచనలుగా గుర్తించి, ఉపదేశాలు రచనలో అంతర్భాగంగా ఎలా వున్నాయి అని శోధిస్తారు. ప్రాచీన కాలం నించీ ఈ నాటి వరకూ సాహిత్యంలో ఉపదేశాత్మక రచనలు కొల్లలుగా వున్నాయి.

**చారిత్రక నేపథ్యం:** ఒక రచన సాగిన కాలమే ఆ రచనకు చారిత్రక నేపథ్యం. ఒక రచనలోని కథా వస్తువూ, పాత్రలూ, సంఘటనలూ సాధారణంగా ఒక కాలంలో ప్రబలంగా వుండే ఆలోచనా ధోరణుల మీదా, జీవిత విలువల మీదా ఆధారపడి వుంటాయి. ఉదా॥ జాతీయోద్యమం, ప్రపంచ యుద్ధాలూ, ఆర్థిక సంక్షోభం, రైతాంగ పోరాటాలూ, సాంస్కృతిక విప్లవాలూ – మొదలైనవి, కొన్ని రచనలకి చారిత్రక నేపథ్యంగా వుంటాయి. ఆ యా రచనల గురించి చేసే పరిశోధనల్లో చారిత్రక నేపథ్యానికి ప్రత్యేకత వుంటుంది.

**తటస్థత:** వ్యక్తి అభిప్రాయాలను పక్కనపెట్టి పరిశోధనకు పూనుకోవడం. (ఇది నూటికి నూరు పాళ్ళూ జరిగి తీరుతుందని హామీ లేదు.)

**దళిత సాహిత్యం:** దళితుల ప్రయోజనాలను ప్రతిబింబించే రచనలన్నీ దళిత సాహిత్యమే. అయితే, దళిత కులాలలో జన్మించి, రచయితలుగా ఎదిగినవారు సృష్టించేదే దళిత సాహిత్యం గానీ; దళితేతరులు రాసినది – అది ఎంత దళిత అనుకూలమైనదైనా – దళిత సాహిత్యం కాజాలదనే వాదనా వుంది.

**నవ్య సంప్రదాయవాదం:** ప్రాచీన సాహిత్య సిద్ధాంతాల ఆధారంగా సాహిత్య విమర్శకూ, పరిశోధనకూ ప్రయత్నించే వారి దృక్పథం. ప్రాచీన సంప్రదాయాలలో ఉపయుక్తమైన అంశాలను (క్రమబద్ధతా, నియమాలూ మొ॥ వాటిని) నూతన పరిస్థితులకు అన్వయించుకోవాలనే దృక్పథం.

**నమూనా/మూసపాత్రలు:** కొన్ని రకాల ప్రక్రియల్లో (ఉదా॥ కథలూ, నవలలూ, నాటకాలూ), ఒకే రకమైన స్వభావంతో, పాఠకులు కూడా వెంటనే గుర్తు పట్టగలిగే పాత్రల్ని సాహిత్య పరిశోధకులు మూస పాత్రలుగా గుర్తించారు.

**నిర్మమత:** పరిశోధనలో, అసూయాభిమానాలను దరిచేరనీయ కుండా తటస్తంగా పరిశీలించే దృష్టి.

**ప్రాథమిక అవగాహనాంశం:** ప్రతీ పరిశోధనలలోనూ – అది సాహిత్యం గానీ, భాష గానీ – పరిశోధకులు కొన్ని ప్రాథమికాం శాలను (ప్రిమైసెస్) కలిగి వుంటారు. ఉదాహరణకి, సాహిత్య ప్రక్రియల గురించీ, ఇతివృత్తాల గురించీ, శిల్పం గురించీ, రచనా విధానానికి సంబంధించిన ఇతర అంశాల గురించీ కొన్ని అవగాహనలను కలిగి వుంటారు. అది ఆ యా పరిశోధకుల ఆలోచనా విధానాన్ని (ఐడియాలజీని) బట్టీ, అనుభవాలను బట్టీ వుంటాయి.

**పండితపరిశోధన:** పరిశోధన అనేది (కేవలం భాషా సాహిత్యాలకు సంబంధించిన సూత్రాల ఉల్లేఖనతో సాగి, ఆ యా రచనల ప్రభావం సమాజంపై ఎలా వుంటుందనే అంశాన్ని పట్టించుకోక పోతే అది అకడమిక్ పరిశోధన (పండిత పరిశోధన) అవుతుం దనీ, ఆ పద్ధతి సరికాదని ఒక వాదన వుంది.

**ప్రాథమిక సైద్ధాంతిక ప్రతిపాదన:** ఏ పరిశోధనలోనైనా, ప్రథమంగా ఒక ఊహ తోటి, ఒక అభిప్రాయం తోటి బైల్దేరి, ఆ వూహ, ఆ అభిప్రాయం సత్యమా కాదా అనేదాన్ని అంతిమంగా నిర్ధారించడానికి ప్రయత్నిస్తాము. ఆ ఊహ, ఆ అభిప్రాయం ఇంకా నిర్ధారణ కాక పూర్వం ఒక సైద్ధాంతిక ప్రతిపాదన రూపంలోనే వుంటుంది. పరిశోధనాంశంగా మనం ఎంచుకున్న ఒక సమస్యని లేదా ఒక పార్శ్వాన్ని వివరించేదిగా ఈ ప్రతిపాదన వుంటుంది.

### ప్రాథమిక సైద్ధాంతిక ప్రతిపాదనకు వుండే లక్షణాలు

**పరిశీలన:** పరిశోధకులు ఒక ప్రతిపాదనతో బైల్దేరేముందు తమ ఎదుట వున్న వాస్తవాల్ని కనీసంగా పరిశీలించి వుంటారు. ఆ పరిశీలన ఆధారంగానే ప్రతిపాదనలను రూపొందిస్తారు.

**గ్రహింపు (రిఫ్లెక్షన్):** పరిశోధనకు సంబంధించిన వాస్తవాలను, వాటి అంతస్సంబంధాలతో సహా గ్రహించడం ద్వారానే కొన్ని ప్రతిపాదనలతో పరిశోధనను ప్రారంభించగలుగుతాము. ఉదాహరణకి రెండు వాస్తవాంశాల మధ్య సంబంధం ఏమిటో, ఆ సంబంధం అలా ఎందుకు వుందో వివరించగలుగుతాం. ఆ వివరణ ఒక సూత్రరూపంలో వున్నప్పుడు దాన్ని ప్రతిపాదన అంటారు.

ఒక రచయిత సామాజికంగా 'మధ్య తరగతి' అనే వర్గానికి చెందినవాడై వుంటాడు. ఇది ఒక వాస్తవం. కొందరు రచయితలు మధ్య తరగతి కుటుంబాల జీవితాన్నే చిత్రిస్తారు. ఇది ఇంకో వాస్తవం. ఈ రెండు వాస్తవాలకీ సంబంధం ఏమిటీ అనే దానికి జవాబుగా మనం ఒక ప్రతిపాదన చేస్తాం. ఉదా॥ మధ్య తరగతికి చెందిన రచయితలు తమకు తెలిసిన మధ్య తరగతి జీవితాన్ని చిత్రించే రచనలే చేస్తారు – అని!

ఇప్పటి వరకూ చూసిన ప్రతీ రచయితా మధ్య తరగతివాడే. రచయితలందరూ మధ్య తరగతివారే! ఈ ప్రతిపాదన అనేక సందర్భాల్లో సరైనదిగా రుజువు కావచ్చు! కొన్ని సందర్భాల్లో కాకపోవచ్చు.

**తార్కిక క్రమం:** ఏ అంశం గురించైనా ఒక తార్కిక క్రమాన్ని అనుసరించి నిర్ధారణలకు రావడం. కొన్ని ప్రతిపాదనలను ఆధారం చేసుకుని ఒక అంశం గురించి నిర్ధారణకు రావడం ఒక రకం తార్కిక పద్ధతి. ఉదా॥ రచయితలందరూ మధ్య తరగతికి చెందినవారు. ఇదిగో ఈ వ్యక్తి రచయిత. కాబట్టి, ఈ వ్యక్తి కూడా మధ్య తరగతికి చెందిన వ్యక్తే!

అనుభవాల మీదా, పరిశీలనల మీద ఆధారపడి ఒక అంశం గురించి ఒక నిర్ధారణకు రావడం ఇంకో రకం తార్కిక పద్ధతి. ఉదా॥ ఇప్పటి వరకూ చూసిన ప్రతీ రచయితా మధ్య తరగతి వ్యక్తే. రచయితలందరూ మధ్య తరగతివారే!

**ప్రాంతీయ స్పృహ:** ఒక ప్రాంతంపైనే ప్రత్యేక దృష్టితో రచనలు చేయడం; ఆ ప్రాంతానికే ప్రత్యేకమైన పదాల్నీ, పదబంధాల్నీ విస్తారంగా ఉపయోగించడం; ఆ ప్రాంత అలవాట్లనూ, వేష

భాషలనూ, చరిత్రనూ, నమ్మకాలనూ ప్రతిబింబించేలా సాహిత్య సృష్టి చేయడం. (సీమ కథలు, తెలంగాణ కథలు, ఉత్తరాంధ్ర కథలు మొ॥)

**ప్రయోగాత్మక రచనలు:** అనిర్దిష్ట కథా చట్రం, పొంతన లేని సంఘటనల చిత్రణా, అసంపూర్ణ పాత్ర చిత్రణా, విస్తారమైన వర్ణనలూ, పునరుక్తీ, నూతన పదబంధ ప్రయోగమూ, విచిత్ర వాక్య నిర్మాణమూ-వంటి సంప్రదాయవిరుద్ధ పద్ధతులతో సాగే రచనలు.

**మౌఖిక సాహిత్యం:** లిపి లేని సమాజంలో సాహిత్య, సాంస్కృతిక అంశాలు ఒక తరం నుండి మరో తరానికి కేవలం నోటి ద్వారానే ప్రసారం కావడం. చరిత్రలో సాహిత్యం మొట్ట మొదట మౌఖిక రూపంలోనే వచ్చింది. ఆ తర్వాతే లిఖిత సాహిత్యం.

**ప్రాపంచిక దృక్పథం:** ప్రకృతినీ, సమాజాన్నీ అర్థం చేసుకోవడానికి తోడ్పడే ఆలోచనా విధానమే ప్రాపంచిక దృక్పథం. ఇవి బహు విధాలు. ఇవి సాహిత్యకారుల ఆలోచనల్ని ప్రభావితం చేసి, ఆ దృక్కోణం నించే సాహిత్య సృజన చేయడానికి దోహదం చేస్తాయి.

**బహుళ వాద పరిశోధన:** ఏదో ఒక సిద్ధాంతానికో, భావజాలానికో కట్టుబడక భిన్న దృక్పథాలతో సాహిత్యాన్ని పరిశీలించే పద్ధతి.

**రచనా నిర్మాణం:** రచనలో చెప్పిన విషయాలు కాకుండా, దాని భౌతిక స్వరూపానికి సంబంధించిన లక్షణాలు (ఉదా॥ ఉపయోగించిన పదాలూ, అలంకారాలూ, ప్రతీకలూ,వ్యక్తీకరణ విధానమూ వగైరాలు).

**వాస్తవిక వాదం:** కాల్పనిక వాదానికి వ్యతిరేకంగా, జీవిత వాస్తవాన్ని చిత్రించడం అనే ఆశయానికి రచయితలు కట్టుబడి వుండాలని భావించే ధోరణి.

**శిల్పం:** ఎన్నుకున్న వస్తువును రచయితలు ఎలా చెప్పారన్నదే శిల్పం. సమస్త విషయాలనూ గ్రహించి సందర్భానుగుణంగా రచనలో చేర్చడం; పాఠకులకు అనుభూతిని కలిగించి వారి స్థాయిని పెంచడం - మొ॥ అంశాలన్నీ శిల్పం కిందకి వస్తాయి.

**శైలి:** భాషను (పదాలనూ, పద బంధాలనూ, వాక్య నిర్మాణాలనూ, ప్రతీకలనూ, భావ చిత్రాలనూ) ఒక ప్రత్యేక పద్ధతిలో ఉపయోగించే విధానమే శైలి. అది వ్యక్తుల్ని బట్టీ, సాహితీ ప్రక్రియని బట్టీ, కాలాన్ని బట్టీ, సైద్ధాంతిక ధోరణిని బట్టీ మారుతూ వుంటుంది.

**సామ్యవాద వాస్తవికత:** పీడిత ప్రజల పక్షపాతం, వారి చైతన్యం పెంచి, ఒక వున్నతమైన నూతన సమాజం పట్ల ఆశా, అవగాహనా కల్పించడం - అనే లక్ష్యంతో జరిగే సాహిత్య సృజన.

**సాదృశ్య రచనలు:** ప్రతీ రచనా దానికి పూర్వం వున్న రచనలన్నిటి మీదా ఆధారపడి వుంటుంది కాబట్టి, ఒక రచనకి ఇతర రచనలతో వుండే సంబంధాలను చూపించడం కోసం జరిగే ఒక తరహా పరిశోధనాంశం.

**గ్రంథ పరిష్కార పరిశోధన:** ఒక రచనకి అనేక ప్రతులున్నప్పుడు, వాటిలో సమస్త విషయాలనూ పరిశీలించి, అసలు ప్రతి ఏదో నిర్ణయించడానికి జరిపే పరిశోధన. రచనా కర్తృత్వాన్నీ, సాధికారతనీ నిర్ధారించడానికి జరిగే పరిశోధన ఇది.

**చారిత్రక పరిశోధనా పద్ధతి:** రచనలు వెలువడినప్పటీ, రచయితలు జీవించినప్పటీ సామాజిక, చారిత్రక పరిస్థితుల్ని పరిగణనలోనికి తీసుకుని, వాటి వెలుగులో రచనల్ని పరిశీలించడానికి పరిశోధకులు అనుసరించే పద్ధతి.

రచనలోని అర్థాన్నో, శిల్పాన్నో వివరించే పని కంటే, దాని చారిత్రక నేపథ్యాన్ని విశ్లేషించడమే ప్రధానంగా జరుగుతుంది ఇలాంటి పరిశోధనలో!

**జీవిత చరిత్ర ఆధార పరిశీలనా పద్ధతి:** ఒక రచయిత జీవిత చరిత్రకూ, అతను జీవించిన కాలానికీ ప్రతిబింబంగా అతని రచనల్ని పరిశీలించే పద్ధతి. పేదరికం అనుభవించిన రచయిత పేదరికం మీద గొప్పగా రాశాడనీ; కుటుంబ జీవితంలో అణిచివేతకి గురైన రచయిత్రి, స్త్రీల వేదనని గొప్పగా రాసిందనీ; దళిత కుటుంబంలో పుట్టిన రచయిత, ఆ చిత్రణ అద్భుతంగా చేశారని భావించడం.

**తులనాత్మక పరిశోధన:** వివిధ దేశాలకూ, వివిధ ప్రాంతాలకూ, వివిధ భాషలకూ చెందిన సాహిత్యాల మధ్య రూపంలో గానీ, విషయంలో గానీ, దృక్పథాల్లో గానీ వుండే పోలికల్నీ, తేడాల్నీ అధ్యయనం చేయడం.

**దృక్కోణం:** ఒక రచనలో విషయాలను (పాత్రల చిత్రణా, సంభాషణా, సంఘటనలూ మొ॥ వాటిని) రచయిత ఎలా చూస్తాడూ, ఎలా చూపుతాడూ అనేది రచయిత దృక్కోణం. రచయిత దృక్కోణాన్ని పరిశోధకుడు విశ్లేషించే తీరు పరిశోధకుడి దృక్కోణంగా వుంటుంది. ఉదా॥ ఒకే రచనను భిన్న దృక్కోణాలు (స్త్రీ వాద, దళిత వాద, సాంప్రదాయ వాద, వర్గ వాద) గల పరిశోధకులు రక రకాలుగా చూస్తారు.

**నవ్య మానవతావాదం (న్యూ హ్యూమనిజం):** మానవుడి ఔన్నత్యాన్ని అంగీకరించి, నైతిక విలువలకు ప్రాధాన్యత నిచ్చి, హేతువాదాన్ని ప్రచారం చేసే రచనల్ని సాహిత్య పరిశోధకులు నవ్య మానవతా వాదం వున్న రచనలుగా గుర్తించారు.

**నిర్మాణ వాదం:** ప్రతీ రచనా దానికదే సంపూర్ణమైన నిర్మాణం - అనీ; ఆ నిర్మాణానికి బైట ఏం వుందో పరిశోధకుడికి అనవసరమనీ; ఆ నిర్మాణ స్వరూపాన్ని బట్టే, రచనకున్న లక్షణాల్ని గుర్తించాలని నిర్మాణ వాదం చెబుతుంది.

**నైతిక - తాత్విక పద్ధతి:** ఏ సాహితీ ప్రక్రియ అయినా ఏదో ఒక నీతిని బోధిస్తుందనీ; తాత్విక అంశాలను అన్వేషిస్తుందనీ భావించి సాగే పరిశోధనా పద్ధతి. ఈ రకం పరిశోధన చేసే వారికి రూపం అప్రధానమైనది; నైతిక - తాత్విక అంశాలే ప్రధానం.

**పఠనీయత:** పరిశోధకులు, ఒక సాహిత్య ప్రక్రియను పరిశీలించేప్పుడు, అది పాఠకులకు తేలిగ్గా అర్థమై, ఎటువంటి ఆటంకమూ లేకుండా, ప్రవాహంలా సాగిపోతోందా లేదా అని చూసి, అది పఠనీయతను కలిగి వున్నదని నిర్ధారిస్తారు. రచయిత చెప్పదల్చుకున్న విషయం ఏదైనా, దాన్ని ఎలా చెప్పారన్న దాన్నిబట్టి పఠనీయతని అంచనా కడతారు.

**పరిశోధనలో ఆధునికవాద దృక్పథం:** రూపంలోనూ, వస్తువులోనూ అంతకుముందు లేని రకరకాల ప్రయోగాలపై కేంద్రీకరించి

సాగే పరిశోధన. సంప్రదాయంతో స్పష్టంగానూ, ఉద్దేశ్యపూరితం గానూ తెగతెంపులు చేసుకున్న రచనలకు ప్రాధాన్యత ఇచ్చి, మిగతా వాటిని విమర్శనాత్మకంగా తిరస్కరించే దృక్పథం.

**పరిశోధనలో ఉత్తర ఆధునిక వాద దృక్పథం:** సాహిత్య పరిశోధన భిన్న అస్తిత్వాల కోణంలో జరుగుతుందనీ; ఏ ఒక్క అస్తిత్వానికీ అత్యధిక ప్రాముఖ్యత వుండదనీ; అన్ని అస్తిత్వాలకూ, వేటికవే, స్వతంత్ర వునికినీ, ప్రత్యేక ప్రాధాన్యతనూ కలిగి వుంటాయనీ భావించే దృక్పథాం. స్త్రీ వాద దృష్టితో జరిగే పరిశోధనలూ, దళిత వాద దృష్టితో జరిగే పరిశోధనలూ; వేర్వేరు అస్తిత్వాల (కులం, మతం, జాతి, ప్రాంతం మొ॥) కోణం నించీ సాహిత్యాన్ని పరిశోధించే దృక్పథాలన్నీ ఉత్తర ఆధునిక వాద దృక్పథాలే. గతంలో ఆధునిక వాద దృక్పథం, భిన్న అస్తిత్వాలను పరిగణనలోకి తీసుకో లేదనీ; అందువల్ల గత పరిశోధనలు అసమగ్రంగా మిగిలిపోయా యనీ భావిస్తుందీ దృక్పథం.

**పరిశోధనలో ఉత్తర నిర్మాణవాదం / వినిర్మాణ వాద దృక్పథం:** సాహిత్య పరిశోధన చేసేటప్పుడు, ఒక రచనలో ఒకటి ప్రధానమూ, ఇంకోటి అప్రధానమూ అనే విభజనకు ఈ వాదం వ్యతిరేకం. విషయాలను, ఇలా ద్వంద్వాలుగా విభజించి, సాహిత్య పరిశోధన చేయడంవల్ల చాలా విషయాలను నిర్లక్ష్యం చేస్తాము – అని ఈ దృక్పథాన్ని అనుసరించే పరిశోధకుల వాదన. అంటే, 'ఇదీ వాస్తవం' అని ఏదో ఒక ప్రధానాంశం మీద ఆధారపడి, కచ్చితంగా తేల్చి చెప్పకూడదనీ, చెప్పలేమనీ, ఈ దృక్పథం సమర్థకుల వాదన. ఈ దృక్పథం ప్రకారం, సత్యం అనేది చెల్లా చెదురుగానూ, విభిన్న రూపాలలోనూ వుంటుంది కాబట్టి, 'ఇదీ సత్యం!' అని దేన్నీ అనలేమనీ, అన్నా ఒప్పుకోవలసిన అవసరం లేదనీ ఈ రకం పరిశోధకులు భావిస్తారు. సాహిత్యాన్ని పరిశోధించేప్పుడు అది సామాజిక మార్పుకి ఎలా దోహదం చేస్తుందీ – అనే ప్రాతిపదికగా పరిశీలించకూడదనేది ఈ రకం పరిశోధకుల అభిప్రాయం. మేధోపరంగా, కళాపరంగా వున్నత స్థాయిలో, ఎంత సంక్లిష్టంగావుంటే అది అంత గొప్ప రచనగా భావిస్తుందీ దృక్పథం.

**పరిశోధనలో వలస వాదానంతర దృక్పథం:** వలస పాలనా ప్రభావం వల్ల వలస దేశాలలో సంప్రదాయానికి భిన్నంగా గానీ, పూర్తి వ్యతిరేకతతో గానీ సృష్టించిన సాహిత్యానికి ప్రాధాన్యతనిచ్చి సాగే పరిశోధనలో కనిపించే దృక్పథం.

భారతీయ భాషలలో (తెలుగుతో సహా) 19 వ శతాబ్దం మధ్య భాగం నించీ వచ్చిన సాహిత్యాన్ని వలస వాదానంతర సాహిత్యంగా భావించవచ్చు.

సాంప్రదాయాన్ని పూర్తిగా తిరస్కరించిన రచనలు ఏవీ సంస్కరణలు ప్రతిపాదించి సాంప్రదాయాన్నీ, వలస పాలన ప్రభావం వల్ల అలవడిన ఆధునికతనీ సమన్వయపరిచిన రచనలు ఏవీ – అనే విషయాలు ఈ రకం పరిశోధనలో కనబడతాయి. వాటిని బైటికి తీయాలే తప్ప, లేని వాటిని బైటినించీ తీసుకు రాకూడదు. అప్పుడే నిష్పక్షపాత పరిశోధనగా వుంటుంది.

**పాఠక ప్రతిస్పందనాధార పరిశోధన:** పాఠకుల ప్రమేయం లేకుండా రచన అనేది ఉనికిలోనే వుండదు కాబట్టి, ఒక రచన గురించి చేసే పరిశీలన ఆ రచనలో వున్నదేమిటో చూసి గాక, ఆ రచన పట్ల భిన్న పాఠకుల భిన్న స్పందనలను బట్టి జరగాలనే దృష్టితో జరిగే పరిశోధన. పరిశోధకులు తమ వ్యక్తిగత అభిప్రాయాలనూ, దృక్పథాలను పక్కనపెట్టి నిష్పక్షపాత ధోరణితో ఒక రచనను పరిశీలించాలి. ఒక రచనను పరిశోధనకు ఎంచుకున్నప్పుడు కేవలం ఆ రచనల మీదే ఆధారపడి, ఆ రచన అసలు ఎలా వుందో అలాగే తీసుకుని పరిశీలించాలి. అంటే, రచనలో లేని బైటి అంశాల మీద పరిశోధకులు ఆసక్తి చూపరాదు.

**మనో విశ్లేషణాత్మక పరిశోధన:** మనస్తత్వ శాస్త్రజ్ఞులు ప్రతిపాదించిన అచేతనా, లైంగికతా, అహం, సహజాతం – మొదలైన మానసిక శాస్త్ర సంబంధమైన అంశాల ఆధారంగా సాగే పరిశోధన.

**మార్క్సిస్టు పరిశోధనా పద్ధతి:** సమాజం వర్గాలుగా, వర్గ విభాగాలుగా చీలి వుంది కాబట్టి, సాహిత్యం కూడా ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఆ యా వర్గ ప్రయోజనాలనూ, వర్గ మనస్తత్వాన్నీ, వర్గ విలువలనూ ప్రతిబింబిస్తుందని భావించి, ఆ దృష్టితో సాగే పరిశోధనే మార్క్సిస్టు పరిశోధన.

**లాక్షణిక పరిశోధన:** పరిశోధకుడు తన వ్యక్తిగత అభిప్రాయాలతో నిమిత్తం లేకుండా, ప్రాచీన లక్షణ గ్రంథాలలో సూచించిన ప్రమాణాల ఆధారంగా రచనలను పరిశీలించి, విలువకట్టే పద్ధతి.

**వినిర్మాణ వాదం:** ఏ సాహిత్య ప్రక్రియలోనూ (ఏ రకం రచనలోనూ) ఒక క్రమమూ, కచ్చితమైన అర్థమూ వంటివి వుండవని వాదించే అవగాహన కలిగినవారిని వినిర్మాణ వాదులంటారు.

అనుభూతులకూ, భాషకూమధ్య చాలా అగాధం వుంటుందనీ, భాషని బట్టి భావాల్ని అర్థం చేసుకుంటే అది ఆపాదించిన అర్థమే తప్ప, సంక్లిష్ట వాస్తవం కాదనీ వినిర్మాణవాదులు భావిస్తారు. రచనను ఒక సంపూర్ణమైన నిర్మాణంగా భావించడంవల్లనే ప్రతీ రచనకీ సంపూర్ణమైన అర్థం ఇదీ అని భావిస్తారని వినిర్మాణ వాదుల అభిప్రాయం.

**సాహిత్య సామాజిక శాస్త్రం:** సాహిత్యానికీ, సమాజానికీ మధ్య వున్న పరస్పర సంబంధాల్ని అధ్యయనం చేస్తూ, ఆ దిశగా పరిశోధనలు సాగించడానికి తోడ్పడే శాస్త్రం.

**స్త్రీ వాదం:** స్త్రీ పురుష సమానత్వం అనే ఆశయాన్ని గీటు రాయిగా పెట్టుకుని (సాహిత్యంలో) పరిశోధన జరగాలని వాదించే ధోరణి. అయితే, స్త్రీ వాదమన్నది ఏకశిలాసదృశ్యంగా వుండదు. భిన్నరాజకీయ దృక్కోణాలు కలిగిన అంతర్గతభేదాలు స్త్రీవాదంలో వున్నాయి.

**హేతు వాదం:** హేతువు, తర్కం అనే అంశాల ప్రాతిపదికన, మత గ్రంథాలనూ, ప్రాచీన కావ్యాలనూ, సమస్త సంప్రదాయ గ్రంథాలను పరిశీలించాలనే వాదం.

ఈ వ్యాస రచయిత హైదరాబాదు విశ్వ విద్యాలయంలోని అనువర్తిత భాషాశాస్త్ర అనువాద, అధ్యయనాల కేంద్రంలోఆచార్యులు

-డాక్టర్ కత్తి పద్మారావు
98497 41695

# సినారె కవన మువ్వల సవ్వడులు

**ఆయన కవిత్వంలో దేశభక్తి, ప్రకృతితత్వం, సంఘ సంస్కరణ, తిరుగుబాటు, మనోవిశ్లేషణ, మానవతావాదం, స్నేహం, ప్రేమ ఇవన్నీ ఉంటాయి. ముఖ్యంగా మానవ సంబంధాల ప్రవాహశీలతే సినారె కవిత్వం. ఆయన జీవితంలో క్రమశిక్షణగా వుంటారు. రోజు మొత్తాన్ని అధ్యయనం, అభివ్యక్తి, రాత, సృజనం, సంభాషణలుగా మలచుకుని ఒక సాహితీ వ్యక్తిత్వాన్ని లోకానికి అందించారు. అందుకే ఆయన లేని లోటు మనకు కనిపిస్తుంది.**



**తెలుగు సాహిత్యంలో మానవతాగానం చేసినవాడు సినారె. కవిత్వమే ఊపిరిగా బ్రతికినవాడు. తెలంగాణా మట్టిలో నుండి పుట్టి జీవ సత్యాలను వల్లించినవాడు సినారె. పుట్టిన గడ్డకు సాహితీ పరిమళాలు అందించిన సినారె ఆధునిక శ్రీనాథుడు. శ్రీనాథునిలాగే రాజాశ్రయాలు సంపాదించి రాజ్యానికి లోబడకుండా వ్యక్తిత్వాన్ని నిలుపుకొన్నవాడు సినారె. మౌఖిక సమాజంలో పుట్టి లిఖిత సంపదను సృష్టించిన సినారె ఒక కవితా సర్వస్వాన్ని సృజించాడు. మాటలో, పాటలో, వర్తనలో ఒక క్రమాన్ని రూపొందించుకొని 85 ఏళ్ళు జీవించాడు. స్నేహం, అనునయం, అభినందనలను జీవన వర్తనలుగా చేసుకొని అసంఖ్యాక శిష్య ప్రపంచాన్ని సృష్టించుకొన్నాడు.**

ఆయన నియంతృత్వానికి వ్యతిరేకి. అలెగ్జాండర్ ఆత్మవేదన గురించి ఆయన తన భాషలో చెప్పారు. ప్రపంచాన్ని అంతా కత్తితో జయించిన తర్వాత అలెగ్జాండర్ పై ఒక జ్ఞాని తిరుగుబాటు చేశాడు. అలెగ్జాండర్ తన మనస్సులో తనకు తాను ఏమని వివేచించుకున్నాడో సినారె ఇలా పలికాడు: *'ఏమిటి! సాధించిందేమిటి! నర రుధిరంలో ఎరుపెక్కిన చీకటి? ఈ చీకటి వెలుగౌతుందా! ఈ హింస గెలుపౌతుందా! మగతను నూరిపోసే లోభం మనసుకి మేలుకొలుపవుతుందా! కుత్తుకలను నరికితే కాదు, గుండెలను కలిపితే గెలుపు. వినాశం జరిగితే కాదు, వివేకం పెరిగితే గెలుపు. సమరం రగిలించేది భీతి, సహనం వర్షించేది ప్రీతి. అనురాగం చేసే శాసనమే అసలైన రాజనీతి!'* సినారె హింసకు వ్యతిరేకి. మనుష్యులను బాధపెట్టే ప్రతి విషయానికి ఆయన కదిలాడు. యుద్ధంలో భయం దాగుందని గొప్పగా చెప్పాడు. గుండెలను కదపటమే గెలుపన్నాడు. అలతి అలతి పదాల్లోనే మానవ ధర్మాన్ని వివేచించాడు. సినారె పెద్ద వివేచనాపరుడు. తనలో ఎక్కడ అహంకారం వస్తుందోనని తనను తాను ప్రశ్నించుకుంటాడు. జిజ్ఞాసను పెంచుకుంటాడు. ఆలోచనలను విస్తరింపచేసుకుంటాడు. మనుష్యులను పరిశీలించి మానవత్వాన్ని పరిమళింపచేస్తాడు.

**అనేక పాత్రల్లో సినారె గొంతు**

అనేక పాత్రల నుంచి కూడా ఆయన పలికాడు. సోక్రటీస్‌ను తనలో ఆవహనం చేసుకుని ఇలా అంటున్నాడు. *'నాకు తెలిసిందొక్కటే నాకేమీ తెలియదని, విత్తు నాటకుండానే వృక్షం మొలవదని, చెడూ మంచీ తెలిస్తే చెడుకు మంచి లొంగదని, అడుసు ఉనికి తెలిస్తేనే అడుగు నేలపై పడుతుందని. చదును చేసిన మనస్సులోనే పదునెక్కుతుంది జిజ్ఞాస, మునిమాపులో ఏనాడూ కనిపించదు ప్రత్యూష, ఆత్మాహుతిలోనే సత్యం అమృతంగా నిలుస్తుంది. తాను జ్వలిస్తే దీపం తన చుట్టూ వెలిగిస్తుంది. ఆలోచనల పొద్దుపొడుపును ఆపలేవు ఏ చీకట్లు, వెలిజిమ్మే ఆత్మకిరణాలను నిలుపలేవు ఏ గొలుసుకట్లు'.* మనోవిజ్ఞానం ఆయనకు మెండు. ఒక పాత్ర గురించి వ్రాసేటప్పుడు తనకు తాను ఆ పాత్రలోకి ప్రవేశిస్తారు. సినిమా పాటల్లో కూడా ఇది ఎక్కువే. అందుకే ఆయన కవిత్వంలో చిక్కదనం ఎంతో విస్తృతీ అంతే! కవిత్వం యొక్క గొప్పతనాన్ని గురించి నారాయణరెడ్డి చెప్తూ, *"కవిత్వమును నిర్వచించి దాని స్వరూప స్వభావములను నిరూపించుటకు ముందు అది యెప్పుడు ఎటుల అవతరించినదో, మానవ జీవితమున దాని ప్రాశస్త్యమేమియో వివరింతును. లలితకళలలో అగ్రపీఠము కవిత్వ మునకే యున్నది. గానము వినినంతసేపు, నాట్యము కనినంతసేపు మాత్రమే సామాజికునియందు రసనిష్పత్తి కలుగును. పైరెంటిలో లేని స్థిరత్వము కవిత్వమున కున్నది. దీనిలో రసచర్వణమునకు వీ లెక్కువగానున్నది. చిత్రశిల్పములలో శబ్దము లేదు. సుస్పష్టమైన అర్థవ్యక్తి లేదు. కవిత్వములో ఈ రెండుండుటవలన ఇది వానికన్న విలక్షణమైనది. కవిత్వం అక్షరకళ. 'బ్రహ్మ' మక్షరమే. కవిత్వము వలన సామాజికునికి కలుగు రసానందము బ్రహ్మానంద సబ్రహ్మచారి. అందుకే ఋషులు, వేదాంతులు సైతము నిగూఢ భావబోధనకు కవిత్వమును సాధనముగా స్వీకరించిరి."* అని అన్నాడు. కవిత్వం యొక్క మూలాల మీద, కవిత్వ సృజనం మీద ఆయనెంతో కృషి చేశారు. ఆయన కవి

మాత్రమే కాదు. కవితా విమర్శకుడు కూడా. 'ఆధునికాంధ్రకవిత్వం సాంప్రదా యములు, ప్రయోగములు' అనే తన పిహెచ్‌డి గ్రంథంలో కవిత్వాన్ని గురించి లోతులకు వెళ్ళారు. వర్డ్స్‌వర్త్, షెల్లీ, ఆర్నాల్డ్, కాల్‌రిడ్జ్ వంటివారు కవులే కాక సాహితీ విమర్శకులు కూడా! ఆ కోవలోనివారే నారాయణరెడ్డి. కవిత్వం ఎంత బలంగా రాశారో కవితా విమర్శ కూడా అంతే చేశారు. ముఖ్యంగా ఈ కవులంతా ప్రకృతిని మానవ ప్రకృతికి అన్వయించటంలో తమ కవితా శిల్పాన్ని అభివ్యక్తి చేసినవారే.

ప్రకృతి కవుల్లో ఉండే గాఢత, విశ్లేషణ, మానవ జీవన పరిశీలన నారాయణరెడ్డిగారిలో కూడా ఉన్నాయి. నారాయణరెడ్డిగారికి పక్షులు అంటే బాగా ఇష్టం. అందుకే పక్షుల మీద ఎక్కువగా రాశారు. జీవించటం అంటే బాగా ఇష్టం. సూర్యోదయంలా వెలుగొందటం అంటే ఇష్టం. కవిత్వం లోతుగా ఉండటం ఇష్టం. కవిత్వం పరిమళించటం ఇష్టం. కవిత్వాన్ని సజీవంగా శిల్పించటం ఇష్టం. అందుకే ఆనంద వర్ధనుని కవితా విశ్లేషణ ఒకసారి చూద్దాం. *'స్వసామర్థ్య వశేనైవ వాక్యార్థం ప్రతిపాదయన్ – యథా వ్యాపారనిష్పత్తౌ పదార్థో నవిభావ్యతే – తద్వత్ సచేతసాం సోర్థో వాచ్యర్థవిముఖాత్మనాం బుద్ధౌ తత్వార్థదర్శిన్యాం ఝటిత్యే వావభాసతే'* (అనగా వాక్యములో ప్రతిపదమున కొక అర్థముండును. అన్ని పదములు కలసి ఒక వాక్యార్థమును గోచరింప జేయును. వాక్యార్థజ్ఞానము కలిగిన పిమ్మట ప్రతిశబ్దము యొక్క ప్రత్యేకార్థము గోచరముకాదు. సహృదయుడీవాక్యార్థముతో అనగా వాచ్యముతోనే సంతృప్తి చెందడు. అతని బుద్ధికి ఈ వాచ్యర్థమే మరియొక అర్థమును స్ఫురింపజేయును. ఎందుచేత? అతని బుద్ధి తత్వార్థదర్శిని యగుటచేత. ఆ మరియొక అర్థమే వ్యంగ్యార్థము. అది ఝటితిగా స్ఫురించవలయును. ఆనందవర్ధనుని కారిక సారాంశమిది.)

**సినారె పలుకుబడుల సవ్వడి**

ఆనంద వర్ధనుని ధ్వన్యావలోకం అధ్యయనం చేసిన సినారె కవిత్వంలో బుద్ధిని మేల్కొలిపే అర్థగంభీరమైన కవిత్వాన్ని వ్రాయడం అలవాటు చేసుకున్నాడు. నిజానికి ఆయన సాహిత్యానుశీలనం నుంచి తన సాహిత్యాన్ని పరిపుష్టం చేసుకున్నాడు. సాహిత్యానికి సామాజిక దృక్పథం వుండాలి, సాంస్కృతిక పుష్టి వుండాలి, రమణీయత వుండాలి, సంక్షిప్తత వుండాలి. అప్పుడే కవిత్వం ప్రజల హృదయాల్లోకి చొచ్చుకు పోతుంది. పాఠకుణ్ని పరవశుణ్ణి చేస్తుంది. పాఠకుల్లో నూత్న చైతన్యం తీసుకొస్తుంది. అందుకే సినారె కవిత్వంలో ఒక మానవతా స్పర్శ, ఒక విజ్ఞత, ప్రాజ్ఞత మనకు గోచరిస్తాయి. ఆయన ఏ ప్రక్రియ తీసుకున్నా ఈ మార్గాన్నే అనుసరించాడు. గజళ్ళను వ్రాయడంలో సిద్ధహస్తుడైన ఆయన ఆత్మీయమైన అంశాలను శీర్షికగా తీసుకున్నాడు. అమ్మలాంటి మా అమ్మ గంగకు అని వ్రాసిన అంకిత పద్యాల్లో కూడా ఒక ప్రేమ అనురాగ గంగ ప్రవహిస్తుంది ఇలా – *'మళ్ళీ జన్మిస్తే నా తల్లి గంగ కావాలి. కన్నతల్లి బుచ్చమ్మే గంగై దిగిరావాలి. నన్నే కన్నయ్యగ తన కన్నుల ఒడిలో పొదిగిన గంగకు అర్పింతును నా గజళ్లు ఎదలోన మడిచి. ఋణవిముక్తికై చేసిన కృతి సమర్పణం కాదిది. తల్లినోట ముద్దలిడే పిల్లవాని చాపల్యం'* (సినారె గజళ్ళు). ఏ కవికైనా తల్లి గురించి వ్రాయడం, చెల్లి గురించి వ్రాయడం, కూతురు గురించి వ్రాయడం ఆత్మీయమైన అంశాలు. ఆయన ఎంతగానో ప్రేమించిన భార్య చనిపోయిన తరువాత నలుగురు కూతుళ్ళను తనతోనే వుంచుకున్నారు ఆయన. కూతుళ్ళను ఆయన ఎంత ప్రేమించాడో కూతుళ్ళు తనను అంతే ప్రేమించారు. అనేక కవితలు ఆయన చెప్తుంటే ఆయన కుమార్తె గంగ గారే వ్రాసేవారు. కుమార్తె ఎదురుగా వుంటే ఎవరికి కవిత రాదు! ఆయన కవిత్వానికి ప్రేరణ శక్తిగా గంగ గారినే చెప్పుకో వచ్చు. ఆయన వ్రాసిన గజళ్ళలో 'ఎదురుగా క్షీర సముద్రాలున్నా' అనే గజల్ ప్రజల గుండెల్లో ఇలా మారుమ్రోగింది. *ఎదురుగ క్షీర సముద్రాలున్నా హృదయానికి దాహం, కరిగే తొలకరి మేఘాలున్నా గగనానికి దాహం, తీర్చిన సభలో తలలే అలలై తెగ ఊగేస్తున్నా రసికత ఒలికే చెవి లేదేమని రాగానికి దాహం, తన రాక కొరకు సమస్తలోకం తారాడుతువుంటే, చెరిగే చీకటి సిగ నిమరాలని కిరణా నికి దాహం, ఎన్ని చూపులో తన చుట్టుగా భ్రమిస్తూనేవున్నా అనువైన తనువు లభించలేదని అందానికి దాహం, ఒడినిండా జలసంపదలెన్నో ఉరకలు వేస్తున్నా చేరిన అల తనతో నిలవాలని తీరానికి దాహం, తన ముంగిటిలో వెలకందని సౌందర్యరాసులున్నా ఊహా ప్రేయసి కనపడదేమని దేహానికి దాహం.'* సినారె మనిషిని చిత్రించడంలో, మనిషి భావాల్ని చిత్రించడంలో, మనిషిలో వున్న భావోద్వేగాలను చిత్రించడంలో, మనిషిలో వున్న ఘర్షణలను చిత్రించడంలో ఆరితేరిన వాడు. మనిషిలో వున్న ఏ భావావేశాన్నీ ఆయన దాచలేదు కాని పరిమితుల్లో చెప్పారు.

ఆయన మీద కబీరు ప్రభావం బలంగా వుంది. కబీరు తాను చెప్పదలచుకున్నది శృతిబద్ధంగా చెప్పాడు, సూత్రబద్ధంగా చెప్పాడు, సూక్ష్మంగా చెప్పాడు, గుండెల్లో నాటుకునేలా చెప్పాడు అందుకే ఆయన ప్రపంచ కవి కాగలిగాడు. కబీరు కవిత్వం ప్రపంచమంతా ప్రవహిచింది. మెదడుల్లో నాటుకుంది. తంబురగా మ్రోగింది. మనిషిని నిదురలేపింది, మానవ సమాజాన్ని తట్టిలేపింది. కబీరులో వున్న భావోజ్వల దీప్తి మనకి సినారెలో కనిపిస్తుంది. కబీరు ఇలా అంటారు *"సాతో సబద్ జహా । బాజతే, హోత్ ఛతీసో రాగ్ । తే మందిర్ ఖాలీ పడే, బై సణ లాగే కాగ్"* ॥ (ఒకప్పుడు సప్త స్వరాల నాదాలతో, రాగ రాగిణుల నర్తనలతో అలరారిన రాజు ప్రాసాదం ప్రస్తుతం ఖాళీగా బోసిపోతున్నది. ఆనాటి వైభవం ఏమైంది? ఆ భవనంపై కాకులు నివసిస్తున్నాయి. లోకంలోని అన్ని వస్తువులూ అశాశ్వతమైనవే. నశించేవే అంటున్నాడు కబీర్) *"జల్ మే కుంభ కుంభమే జల్ హై, బాహర్ భీతర్ పానీ। ఫ్యూట్యో కుంభ జల జలహి సమానా, యహ తత్ కథ్యోగియానీ"* (జలంతో నిండిన కడవ నదీ నీళ్ళలో ఉంటుంది. అలాగే శరీరమనే ఆవరణ లోపల ఆత్మదాగి ఉంది. కడవ పగిలి చిట్లిపోగా కుండ లోపలి నీళ్ళు బయటి నదీ జలంలో మిళితమవుతాయి. అవి నది నీళ్ళలో ఏకాకృతి చెందినట్లు శరీర కవచం తొలగిపోగానే ఆత్మ మళ్ళీ పరబ్రహ్మాలో విలీనమవుతుంది. దర్శన శాస్త్ర నిగూఢ సిద్ధాంతాన్ని ఇంత సరళంగా అభివ్యక్తం చేయడం కబీర్ భాషలోని విలక్షణత.)

**సినారెపై ఉర్దూ గజళ్ళ ప్రభావం**

ఒక్క సినారె మీదే గాక తెలంగాణాలో వున్న గొప్ప రచయితలు

కవులు ఎక్కువ మంది మీద ఉర్దూ గజళ్ళ ప్రభావం వుంది. తెలంగాణాలో ప్రసిద్ధిమైన రచయితలు, కవులు భాగ్యరెడ్డి వర్మ, మాడపాటి హనుమంతరావు, కాళోజి, సురవరం ప్రతాపరెడ్డి, మగ్దూం మొహియుద్దీన్, వట్టికోట అల్వారుస్వామి, దాశరథి కృష్ణమాచార్య, దాశరథి రంగాచార్య వీరందరి మీద ఉర్దూ గజళ్ళ ప్రభావం వుంది. మరో కారణం కబీర్ కలం, కాగితం తీసుకుని స్వయంగా రాయలేదు. ఆయన నోటివెంట ఆశువుగా వెలువడిన దోహాలను ఇతరులు రాశారు. పైగా ఆయన ఒకే ప్రాంతంలో ఉండి చెప్పలేదు. వివిధ గ్రామాలు పర్యటిస్తూ అనేక యాసలు, మాండలికాల భాషీయుల మధ్య తిరుగుతూ చెప్పాడు. కనుక శ్రోతలు తమ స్థానిక పదాల మిశ్రణం చేశారు. లిపిబద్ధమయ్యే సరికి మిశ్రమం జరగడానికి అవకాశం లభించింది. చదవగానే అతి సామాన్యంగా కన్పించటం కబీర్ భాషలోని విశేషం. కానీ వ్యాఖ్యానించటం కష్టం. నేత పనివాడిగా తనకు కలిగిన అనుభవాలను, హిందువులలో అగ్రవర్ణ ముల వారిచే, సంప్రదాయ వాదులైన మహ్మదీయులచే పీడింపబడిన వ్యక్తిగా తాను పొందిన అనుభవము లన్నిటినీ విశ్వజనీనమైన కవితగా మార్చి హృదయ స్పర్శిగా వెలార్చాడు. ఆయన వ్యక్తిగత నిరసన వేలాది మూగజీవుల వాణికి దర్పణం పడుతుంది. అనేక బాణీలు జానపద గేయాల నుండి స్వీకరించాడు. కబీర్ దోహా, సాఖీ, శబద్, రమైనీ వంటి సాధారణ ఛందములనే వాడాడు. వాటిని చౌపాయీ లంటారు. రెండు పంక్తుల ద్విపదలను దోహాలుగా చెబుతారు. ఆ రెండు పంక్తుల్లో సారం ఎంతో ఉంటుంది. గానం చేయడానికి వీలుగా పదావళిని పెద్దవిగా రాశాడు. నారాయణరెడ్డిగారు కబీర్ సూక్తిలోనే ఎక్కువ గజల్స్ రాశారు. సంక్షిప్తతే కాక గజల్‌కు భావార్థ స్పష్టిని కలిగించారు. వస్తువుకు పరిమళం తీసుకువచ్చారు. పై పై మెరుగులతో వున్న సమాజంలో అంతర్గతంగా దాగివున్న చీకటిని టార్చిలైటు వేసి చూపించారు. శ్రుతి లేకుండా ఒక్క వాక్యాన్ని కూడా ఆయన సృష్టించలేదు. వాక్యం రసాత్మకం కావ్యం అనే ఆలంకారిక సూక్తిని నిక్కచ్చిగా పాటించారు. అందుకే ఆయన శిల్పించిన **గులాబీపువ్వు** అనే గజల్‌ను విందాం. *'గులాబీపువ్వు చూడగనే బలేగా మురిసిపోబోకు, కనపడని ముళ్ళు ఎన్నెన్నో– ఓ మనసా! మరిచిపోబోకు. మహలులో కాపురాలున్నా మజాగా తిండి తింటున్నా కునుకు కరువైన బ్రతుకులను – ఓ మనసా మరిచిపోబోకు. వలచిచూస్తే వసంతాలు అలిగిచూస్తే అగాధాలు కనులకెంతెంత పడునుందో – ఓ మనసా! మరిచిపోబోకు. చెట్టు పూచిందా ఉల్లాసం చేను పడిందా సంతోషం, మట్టిలో ఎంత విలువుందో – ఓ మనసా! మరిచిపోబోకు. నింగిలో తాను కొలువుంది నేలపై జాలిపడుతుంది, మబ్బుకెంత మనసుందో – ఓ మనసా! మరిచిపోబోకు. పగటి కలలుండి ఏం లాభం? ప్రగతికే ఎంత అవరోధం. క్షణం చేజారితే అంతే – ఓ మనసా! మరిచిపోబోకు. మంచుమలపైన నీవుంది పొంచి ఒకలోయ చూస్తుంది. సినారె మాట లోతెంతో – ఓ మనసా! మరిచిపోబోకు'* (సినారె గజళ్ళు). గజల్ గురించి సినారె స్వయంగా ఇలా చెప్పారు. 'ఉర్దూభాషలో గజల్ ఒక కమనీయ కవితాలహరి, ఒక గులాబీల గుచ్ఛం. ఒక మత్తకోకిల రసాత్తకూజితం, సరసభావన, చమత్కార ఖేలన, ఇంపూ, కుదింపూ గజల్ జీవగుణాలు. అది జోల పాడుతుంది – జ్వాల రేపుతుంది. గజల్లో ఒకే విషయాన్ని చెప్పాలన్న



సినారెతో ఈ వ్యాసరచయిత

నిర్బంధం లేదు. భావం ఏ చరణానికి ఆ చరణం విడిగా ఉండొచ్చు. గజల్ పల్లవిని 'మత్లా' అంటారు. చివరి చరణాన్ని 'మక్రా' అంటారు. పల్లవి చివర ఉన్న పదం, ప్రతి చరణం చివర అంత్యప్రాసను రూపొందిస్తుంది. కొన్నిట్లో అంత్యప్రాసకు ముందు మరో ప్రాసపదం ఉంటుంది. వీటిని రదీఫ్ ఖాఫియాలంటారు. చివరి చరణంలో కవి నామముద్ర ఉంటుంది. దీనిని 'తఖల్లుస్' అంటారు. నా తఖల్లుస్ 'సినారె', గజలంటే అనేకార్థాలుగా స్థూలంగా 'ప్రియురాలితో సల్లాపం' ప్రాయికంగా ఇది శృంగారపరం, కొన్నిటిలో తాత్విక స్పర్శలూ ఉంటాయి. కానీ నా గజళ్లలో ప్రణయానికి బదులు మానవీయ దృక్పథాన్నీ ప్రగతి శీలాన్నీ మెత్తని అధిక్షేపాన్నీ ప్రవేశపెట్టాను. పదం నాదంగా, భావం రాగంగా, అనుభూతి స్వరరీతిగా గుండెతో నేను పలికించినవి గజళ్లు. ఆయన తన కవిత్వం గురించి ఇతరుల కంటే బాగా చెప్పారు. కారణం తెలుగులో కవితా విమర్శ రావాల్సినంత బలంగా రాలేదు.

**నారాయణరెడ్డిగారితో సాన్నిహిత్యం**

1995లో నారాయణరెడ్డిగారు ఒకసారి లంచ్‌కి పిలిచారు, ముచ్చట్లతో కాలక్షేపం చేయటం ఎందుకని ఆయన జీవిత గమనాన్ని గురించి అడిగాను, ఆయన నాకు ఇలా చెప్పారు. *'నేను టైమ్‌టేబుల్ నిక్కచ్చిగా పాటిస్తాను. ఉదయాన్నే మార్నింగ్‌వాక్ చేయటం, డైలీ పేపర్లన్నీ చదవడం, ఆఫీసుకు వెళ్ళడం, లంచ్‌కి రావడం కొంత విశ్రాంతి, మళ్ళీ ఆవిష్కరించే పుస్తకం చదివి సభలకు వెళ్ళడం, నాకిష్టమైన పుస్తకాలు చదువుకోవడం, పీఠికలు రాయడం, ఏదైనా కవిత నచ్చితే ఆ కవికి ఫోన్ చేసి అభినందించటం ఇలా రోజంతా సాహిత్యాత్మకంగానే సాగిపోతుంది'* అని చెప్పారు. ఆయనకు కులతత్వం లేదు. అయితే ఏ కవికైనా తమ సామాజిక వర్గంవారు అంకితం తీసుకోవడం ద్వారా, గ్రంథాలు ముద్రించటం ద్వారా సహాయ పడుతూనే ఉంటారు. అది మామూలు పద్ధతుల్లోనే కొనసాగింది కాని పనిగట్టుకొని కాదు అని ఆయన ఉద్దేశం. ఆయన నా కవిత్వాన్ని ఇష్టపడతారు. నేనేదైనా ఆయన కవిత మీద విమర్శ పెడితే "కొన్ని కవితలు పేలిపోతాయి. కొన్ని కవితలు తూలుతాయి. కొన్ని కవితలు జ్వలిస్తాయి" అని చమత్కారంగా అంటారు. ఆయన విమర్శను స్వీకరిస్తారు కాని, విమర్శను అధిగమించాలని చూస్తారు. సమకాలీన చరిత్రను కవి లిఖించాలి కదా అంటే మానవ స్వభావ విశ్లేషణకు కాలం ఏమిటి? అంటారు ఆయన. చిన్నప్పుడు దళిత

వాడల్లో దళితులు పాడే పాటల్లో బాణీలు ఏరుకొనేవాణ్ణిని, నా పాటల్లోని శ్రుతి అక్కడదే అని చెప్పారు. చిన్నప్పుడు దళిత పల్లెల్లో తిరుగుతున్నప్పుడు, అంటు తగులుద్దేమోనని అమ్మ చిన్న బంగారపు సూది కాల్చి అంగిటికి అంటించిందని, మా అమ్మవాళ్ళకు అంటు వుండేదని నేను దాన్ని అధిగమించానని ఆయన నాతో చెప్పారు.

'నాకు మానవులందరూ సమానమేనని' అన్నారు. "మీరు ఎందరినో అణగదొక్కి పైకి వచ్చారని అనుకొంటారు అంటే – అదేమి లేదు. నాలో పోటీతత్వం ఉంది. కానీ నా నిరంతర కృషి, పట్టుదల, కార్యాచరణే నా ఎదుగుదలకు మూల సూత్రం అన్నారు. కొన్ని అభిప్రాయాల్లో ఆయనకు నాకు భేదాలు ఉన్నా మా స్నేహం ఆయన మరణించే వరకు సాగింది. మూడు నాలుగు రోజులకు కవితనొకటి రాయటం ఆయనకు అలవాటు. ఆయనతో పాటు నావి చాలాసార్లు పత్రికల్లో వచ్చేవి. అభినందించేవారు. కవిత ఏదో పత్రికకు పంపడం, దాన్ని అచ్చులో చూడటం ఆయనకు ఇష్టం. బాల్యంలో మౌఖిక సాంప్రదాయం నుండి వచ్చిన ఆయన అక్షరం ముద్రణకు ఎక్కువ ఇష్టపడ్డారు. ఆయన హిందూ, ఉర్దూ, ఇంగ్లీషు సాహిత్యాలు బాగా చదువుతారు. ఆయన విశ్వంభర కూడా జయశంకర్ ప్రసాద్‌గారి హిందీ కావ్యం కామయాని కావ్య స్ఫూర్తితో రాసిందే. హిందీ, ఉర్దూ కవిత్వాలన్ని మూలరూపాలే ఆయన ఎక్కువ చదువుతారు. ఆయన వాటిని తెలుగులోకి తెచ్చేటప్పుడు స్వీయ గంధాన్ని అద్ది పరిమళింపచేస్తారు. ఇక ఆయన పాటలకు వస్తే కృష్ణశాస్త్రి, శ్రీశ్రీ, మల్లాది, దాశరథి ప్రభావం ఆ పాటల మీద బలంగా ఉంది. శ్రీశ్రీని ఆయన కొత్త గొంతులో పలికారు కాని ఆయన అభ్యుదయ కవిత్వం అంతటిలోను శ్రీశ్రీ నిండివున్నాడు. లయ, శ్రుతి, పదబంధాలు, గమనం, గమకం శ్రీశ్రీ నుంచి ఆయన తీసుకున్నారు. కారంచేడు, చుండూరు దురాగతాలు జరిగినప్పుడు మీరు ఎందుకు రాయలేదు అని నేనడిగితే 'మీరు రాస్తున్నారుగా, అన్ని వస్తువులను అందరూ రాయలేరు' అన్నారు. ఏది ఏమైనా సినారె కవిత్వం, పాట, మాట తెలుగు సాహిత్య సంపదకు చేర్పు, వన్నె. లిఖిత సాహిత్య సంప్రదాయానికి దళిత సాహిత్యోద్యమ ప్రజ్వలనానికి అంతర్గతంగా ఆయన స్ఫూర్తి ఉంది. మౌఖిక జాతులన్నీ తమ భావాలను లిఖిత సంప్రదాయాల్లోకి తెచ్చుకోవడం ఈనాటి చారిత్రక సందర్భం. ప్రపంచంలో ఉన్న అభ్యుదయ భావాలన్నింటినీ తెలుగు నుడికారంలోకి, తెలుగు పలుకుబడిలోకి తెచ్చుకోవాలనే తపనకు సినారె ఒక ప్రతీక. చరిత్ర కవులుంటారు. చరిత్ర కవుల మాటలతో పరిమళిస్తుంది. అందుకే సినారె మనతో మాట్లాడుతూనే ఉంటారు. మనకు మానవతా కవితాగానం వినిపిస్తూనే ఉంటారు.

**సినారె కవిత్వ జీవన దృశ్యం**

**సినారె** సామాజిక జీవన వ్యవస్థని అక్షరాల్లో పొదిగిన కవి. మనిషిని మనిషి తత్వాన్ని, సమాజాన్ని సమాజ తత్వాన్ని, ప్రకృతిని ప్రకృతి తత్వాన్ని అక్షరాల్లో పొదిగిన మహాశిల్పి. నిశ్శబ్దంలో నుంచి తీసుకొచ్చిన ఆత్మీయత, ఆవేదన, జీవన ఘర్షణ, జీవితాన్వేషణ, విలువల విధ్వంసనను తన కవితా సామర్థ్యంతో ప్రపంచం ముందుకు ఆకృతులుగా తీసుకొచ్చినవాడు. ఆయన రచించిన మథనం, విశ్వంభర, మట్టిమనిషి ఆకాశం– చరిత్రలో నిలువదగిన గ్రంథాలు. మథనం అనుక్రమణికలో మననం, జ్వలనం, ఉద్గమనం, ఉన్మీలనం అని పేర్కొనడంలోనే ఆయన కవితాభివ్యక్తిలోని తీక్షణత మనకు అర్థమౌతుంది. కవిత్వం అంటే మాటల పొందిక కాదు. మాటల్ని పువ్వులు చేయగలగాలి, మాటల్ని ఈటెలు చేయగలగాలి, మాటల్ని మంటలు చేయగలగాలి. అప్పుడే కవిత్వం పండుతుంది. సినారె తన కవిత్వానికి శృతిని పేర్చుకున్నాడు. ముఖ్యంగా త్యాగరాజ కీర్తనలు, క్షేత్రయ్య పదాలు, యక్షగానాలు, దరువులు వంటి దేశీయ రచనల్ని ఆయన క్షుణ్ణంగా చదివాడు. అంతేకాకుండా పాల్కురికి సోమన్న పండితారాధ్య చరిత్రలో పేర్కొన్న తుమ్మెద పదాలు, వెన్నెల పదాలు, ప్రభాత పదాలు, శంకర పదాలు, గొబ్బిపదాలు, నన్నయ్యకు ముందువున్న దేశీయ కవితా సంపద అంతా నన్నయ కవిత్వం రాకముందే ఉన్న తెలుగువారి సాహితీ సంపద అని ఆయనే తన 'ఆధునికాంధ్ర కవిత్వం, సాంప్రదాయములు ప్రయోగములు' అనే గ్రంథంలో పేర్కొన్నాడు. అయితే సినారె అటు దేశీ కవిత్వాన్ని ఇటు మార్గ కవిత్వాన్ని తన కవిత్వంలో ఇముడ్చుకున్నాడు. అందుకే తెలుగు పదాలు, తత్సమ పదాలు సమతుల్యంగాను, అర్థమంతంగాను ఆయన కవిత్వంలో సమన్వయించబడ్డాయి. అందుకే ఆయన మథనంలో ఇలా అంటాడు. "*మౌనంగా ఉంటూనే మాట్లాడాలని వుంది. పార్లిపడే వెల్లువతో పోట్లాడాలని వుంది. కన్నీళ్ళను సుతిమెత్తని వెన్నీళ్ళుగ మార్చుకునీ కొడిగట్టిన గాయాలను కడిగేయాలని వుంది. పూలుసరే; వాటి అనుభవాలు సరే; మరి యిప్పుడు పదగెత్తే ముళ్ళమధ్య అడుగేయాలని వుంది. పిడికెడంత విలువుంటే కడలియంత ఆమోదం; మంచితనం మంటల్లో మరణించాలని వుంది. ఇపుడున్నది ఇవలిగట్టు ఎక్కడుంది ఆవలిగట్టు ఏవేవో తుఫానుల్లో జీవించాలని వుంది. ఇన్నాళ్ళుగ బిగుసుకు పోతున్న పాపమెవ్వరిదని పిడుగు గొంతుతో అడిగేయాలని వుంది*" (సినారె సమగ్ర సాహిత్యం). సహజంగా కవిత్వం సమాజ సంఘర్షణ నుండి ఉద్భవిస్తుంది. వ్యక్తుల్లో రెండు రకాలు వుంటారు. తాము వుండే నాటికి వుండే సమాజంతో రాజీపడే వాళ్ళు, తాము వుండే సమాజాన్ని ప్రశ్నించేవాళ్ళు వుంటారు. మూడో రకం మనుషులు అయితే తాము వున్న సమాజాన్ని మార్చే ప్రయత్నం చేస్తారు. ఈ మూడోరకం మనిషే సినారె. ఎక్కువ మంది కవులు సమాజానికి సందేశాన్ని ఇస్తారు. అంటే సందేశం నామ మాత్రంగా వున్నా నిస్సారంగావున్నా సమాజం స్వీకరించదు. సందేశం నా జీవితానికి ఉపయోగపడుతుందనే భావన కలగాలి. సందేశం అర్థమయ్యేటట్లు వుండాలి. అది పదేపదే చదివేకొద్దీ కొత్త భావాలు తీసుకురావాలి. ఇలాంటి భావాలు వ్యక్తం చేసిన కవులు వేమన, గురజాడ, పోతులూరి వీరబ్రహ్మం, నాజర్, జాషువా వంటి తెలుగు కవులు. ఇటువంటి భావాలు వ్యక్తం చేసిన వాళ్ళలో ఉర్దూలో కబీరు ప్రసిద్ధుడు. నారాయణరెడ్డి గారి కవిత్వం మీద కబీరు ప్రభావం బలంగా వుంది. ఒకసారి కబీరు ఏమన్నాడో చూద్దాం. '*చున్ చున్ కంకడ్ మహల్ బనాయా, లోగ్ కహే ఘర్ మేరా నా ఘర్ మేరా, నా ఘర్ తేరా, చిడియా రైన్ బసేరా*' ఒక్కొక్క రాతి ముక్కను ఏరి కూర్చి భవనం నిర్మిస్తారు. ఈ ఇల్లు ఈ భవంతి నాది అంటారు. ఆ భవనంలో నివసిస్తూ తమను తాము గొప్పవారమనుకుంటారు. ఏ ఇల్లూ నీది కాదు ఎందుకంటే అశాశ్వతమైన ఈ సంపదను, భోగ భాగ్యాలను నమ్ముకుని లక్ష్యాన్ని మరిచిపోతున్నాడు మనిషి, ఎంతో కష్టపడి కట్టుకున్న భవనాన్ని ఏదో ఒకనాటికి విడిచి వెళ్ళక తప్పదు.

మరణించిన పిదప ఏ సంపదా, ఇల్లూ అతని వెంట వెళ్ళదు. పక్షి గూడును ఖాళీ చేసి పోయినట్లు మనిషి తిరిగి రానిలోకానికి పయన మౌతాడు.

**సినారె మనోవైజ్ఞానిక దృష్టి**

ఆంగ్ల సాహిత్యంలో ఎక్కువమంది కవులు కవితా విమర్శకులుగా కూడా వున్నారు. ముఖ్యంగా వర్డ్స్‌వర్త్, మిల్, రస్కిన్ ఇలాంటివారు. వీరంతా కవిత్వం అంటే ఆవేశం నుండి జనించేది, ప్రకృతి వీక్షణ నుండి జనించేది. మనోవీక్షణ నుండి జనించేది అని విశ్లేషించారు. కొంతమంది విమర్శకులు కవిత్వం అంటే అక్షరబద్ధమైన అనుభూతి అని, కొంతమంది ప్రబలమైన అనుభూతుల మహా ప్రవాహమే కవిత్వమని ఇలా కవిత్వానికి ఎన్నో నిర్వచనాలు ఇచ్చారు.

నారాయణరెడ్డిగారు కవిత్వానికి ఒక మనోవైజ్ఞానిక ప్రబోధం వుండాలని ఆలోచించాడు. కవిత్వానికి ఒక ప్రవాహశీలత వుండాలని, కవిత్వం సౌందర్యంతో కూడిన లయబద్ధమైన సృష్టి అని, కవిత్వానికి సృజనం, ఔచిత్యం ప్రధానమని ఆయన భావించాడు. అందుకని మనిషి తనకు ఎదురొచ్చే అనేక కష్టాల్ని నష్టాల్ని ఎదుర్కొంటూ వెళ్ళాలనే ఆయన కవితా సందేశం. ఈ భావాన్ని వ్యక్తీకరిస్తూ ఇలా కవిత్వీకరించాడు. *"క్షణాలను రాజేసుకుంటూ, ఆశయాలను ఎగదోసుకుంటూ బతుకుతున్న మనిషికి, గుహలో పోగొట్టుకున్న గుండె కోసం రాత్రంతా వెతుకుతున్న మనిషికి ప్రతి మిణుగురు పురుగు లక్ష మెగావాట్ల వెలుగు. ఎదురొస్తాయి కోరలెత్తి ఉదయాన్ని కరిచే చీకట్లు, జడిపిస్తాయి మదమెక్కి సంకల్పాన్ని చీల్చే బుల్లెట్లు, మనిషి తప్పుకుంటాడా? కాదు – తట్టుకుంటాడు. చీకట్ల బుల్లెట్లు చేసే చిల్లులనూ, నెత్తుటి వెల్లువనూ ఉదయిస్తుంది. ఆ నెత్తురే గడ్డకట్టి ఉషా శిశువుగా, ఎదిగొస్తుంది ఆ శిశువు రక్తాక్షి ఉదయ భానువులా"* (సినారె సమగ్ర సాహిత్యం, వాల్యూం–15).

సినారె తన కవిత్వంలో మానసిక వ్యవస్థలకు అద్దం పడతారు. మనస్సులు భిన్నమైనవి. ప్రతి మనిషి కొన్ని సామాజిక వ్యవస్థల్లో జన్మిస్తాడు. ప్రతి మనిషికి కొన్ని నిర్దిష్ట అభిప్రాయాలుంటాయి. సమాజానికి, తనకు జరిగే ఘర్షణలో, తనకి, తనకి జరిగే ఘర్షణలో నిత్యం రాజీపడేవాళ్లు ఎక్కువ. అందుకే వాళ్ళ ముఖంలో వికాసం ఉండదు. ఎందుకంటే నేను రాజీపడుతున్నాననే అభద్రత, కానీ ఘర్షణ నుంచి నూత్న చైతన్యాన్ని పొందేవాళ్లు, కొత్త పుంతలు తొక్కేవాళ్లు జీవితాన్ని సానుకూలం చేసుకోగలిగినవాళ్ళు ఎదుటివాళ్లను మెప్పించగలిగిన వాళ్లు, ఎదుటివాళ్లపై విజయం సాధించగలిగినవాళ్ళు ఎదుటివాళ్ళ హృదయాన్ని గెలుచుకోగలిగినవాళ్ళు ఉజ్వలంగా ముందుకు నడుస్తారు. ఇలా నడవటానికి మానసిక మననం ఉపకరిస్తుంది. అదే సినారె ఇక్కడ మనకు అందిస్తున్న చైతన్య జ్వాల. అందుకే ఆయన ఇలా అంటాడు. *"లోతులను ముట్టే విలోకనం నీకుంటే – కన్నీటి బొట్టులో కడలి వున్నది చూడు. దిక్కులను కొలిచేటి దృక్పథం నీకుంటే – పొడి యిసుక కణములో పుడమి వున్నది చూడు. భాష నర్పించే పిపాసయే నీకుంటే – బోసినవ్వుల్లో వడబోసి వున్నది చూడు. గమ్యమేదన్న జిజ్ఞాసయే నీకుంటే – ప్రతి మైలురాయిపై వ్రాసివున్నది చూడు. గుర్తింపు లేదనే ఆర్తియే నీకుంటే – గుండెలో గాయాలదండ వున్నది చూడు. కరుగుతున్నాననే కలతయే నీకుంటే – మందు టెండను మంచుకొండ వున్నది చూడు. మృత్యువేదన్న అన్వేషణం నీకుంటే – ప్రతిరోజు నీడలా పక్కనున్నది చూడు. దైవమేదన్న సోదా గుణం నీకుంటె – నాస్తికుని వాక్కులో నక్కివున్నది చూడు"* (సినారె సమగ్ర సాహిత్యం, వాల్యూం–15). కన్నీటిబొట్టులో కడలి వున్నది చూడు అనే మాట కవియొక్క సామర్థ్యానికి గుర్తు. మానసిక శాస్త్ర ప్రకారం మనల్ని మనం అంతర్గతంగా చూసుకోగలిగిన శక్తి మనకు కావాలి. ఆ శక్తి మనిషిని నిరంతర ప్రజ్వలనమూర్తిగా మారుస్తుంది. ముఖ్యంగా ప్రతి మనిషికి ఎంతోకొంత కల్పనా శక్తి కావాలి. సృజనాత్మక శక్తి కావాలి. విచ్చుకొనే గుణం కావాలి. ఉదయించే చైతన్యం కావాలి. ఈ గుణాలన్నీ కూడా కవిత్వ పఠనం వల్ల వస్తాయి. సినారె నాకు కవితా మిత్రుడు కావడం వల్ల సుమారు ఒక 5 సంవత్సరాలు ప్రతి సోమవారం కవితల గురించి మాట్లాడుకునేవాళ్లం. ఆయనకు నా కవిత్వం అంటే ఇష్టం. అణగారిన ప్రజల గుండె వేదనలు నేను వినిపించేవాణ్ని ఆయన స్పందించేవాడు. ఇద్దరం సంస్కృతాలంకార శాస్త్రం చదువుకోవడం వల్ల సంభాషణలో మా మాటలు కలిశాయి. ఆయన మీద శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి ప్రభావం ఎక్కువగా వుండేది. ఉపమాన, ఉపమేయం కవిత్వంలో వుండాలనేది ఆయన ఆలోచన. చెప్పే విషయాన్ని సున్నితంగా చెప్పాలనేదే ఆయన భావన. కానీ భావంలో తీవ్రత వుండాలని నారాయణరెడ్డిగారు అంటారు. అందుకు ఆయన భరతుని నాట్యశాస్త్రాన్ని ఉటంకిస్తూ వుంటారు.

'*మృదులలితపదార్థం గూఢశబ్దార్థహీనం/బుధజనసుఖయోగ్యం బుద్ధిమన్నృత్యయోగ్యం/బహురసకృతమార్గం సంధిసంధానయుక్తం/ సభవతి శుభకార్యం నాటక ప్రేక్షకానామ్.*' ఏ కావ్యమైనా అది మృదుల పదార్థంతో కూడుకొని వుండాలి. ఇతివృత్తం సౌందర్యపూరితమై వుండాలనేది భరతుని ఉద్దేశం. చాలామంది కవులుఒట్టి శబ్దముల *తోనే గలగలలాడుతారు.* కానీ అర్థమంతమైన శబ్దాలు వుంటేనే కవిత్వానికి అందం. అయితే నారాయణరెడ్డిగారు తీవ్రమైన భావాలు కవితలో వ్రాశారు. ఆయనతో చర్చలు చేసేటప్పుడు 'మీరు తీసుకునే అవార్డులు, పదవులు మీ కవితా ఔచిత్యాన్ని దెబ్బతీస్తున్నాయేమో' అంటే, లేదు! నేను శ్రీనాథుని లాంటి వాడిని. వాటివల్ల నా వ్యక్తిత్వానికి భంగం కలగనీయను అనేవారు. నిజానికి ఆయన అవార్డులు, ఆయన పదవులు ఆయన కవిత్వాన్ని లోతుగా చూడడానికి ఎంతోకొంత అడ్డం వచ్చినవని చెప్పక తప్పదు. ఎందుకంటే ఆయన సినిమా పాటలు వ్రాసే దశకు వచ్చిన తరువాత లోతుగా, గంభీరంగా, అలంకారయుతంగా, రసబంధంగా వ్రాసిన గ్రంథాలు మరుగున పడిపోయాయి. సినిమా పాటల్లో కూడా ఆయన సాహిత్య విలువలు కాపాడుతూనే వెళ్ళారు. అయినప్పటికి కూడా సినిమా దృశ్యం, సంగీతం, గీతంతో కలిసి వుంటుంది కాబట్టి పాట త్వరగా ఆకట్టుకుంటుంది. కాబట్టి విస్తృతమైన శ్రోతల్లోకి పాట వెళ్ళిపోతుంది. నిజానికి సుద్దాల హనుమంతు, గూడ అంజయ్య, నాజర్, గద్దర్, వంగపండు వంటి వారి పాటల్లో ఎంతో కవిత్వం వుంది. వచన కవిత్వం కంటె కూడా బలమైన కవిత్వం వారిలో వుంటుంది. ఈ పాటల్లో వున్న కవిత్వాన్ని శృతి మింగేస్తుంది. నిజానికి నారాయణరెడ్డిగారు అస్పృశ్యవాడల నుంచే శృతులను ఏరుకున్నానని నాతో చెప్పాడు. జానపదులు అంటే ఎవరు? తెలంగాణా జానపదులు అంటే దళితులే కదా!

నారాయణరెడ్డి బ్రాహ్మణాధిపత్యాన్ని ఎదిరించకుండానే ఒక శూద్ర కవిగా బ్రాహ్మణులను అధిగమించడానికి చూశాడు. ఆయనకు కులం లేదు. కానీ ఆధిపత్యాన్ని ఆయన సహించడు. నేను అంతే. నాకు కులం లేదు. ఏ ఆధిపత్యాన్ని నేను సహించను. అయితే ఆయన చెప్పే పద్ధతి వేరు, నేను చెప్పే పద్ధతి వేరు. ముఖ్యంగా నారాయణరెడ్డి గారు దళిత కవులతో చాలా మందితో మిత్రుత్వం నేర్పాడు. అభిమానించాడు. ఆయన నవయుగ చక్రవర్తి జాషువా అభిమాని. 'ఆయన కవిచక్రవర్తి, నేను కవిరాజును' అనేవాడు. బోయి భీమన్నకు మిత్రుడు, సహచరుడు. కొలకలూరి ఇనాక్ గారు కూడా సాహితీ మిత్రుడే. అలాగే యెండూరి సుధాకర్, శిఖామణి వంటి దళిత కవులకు గురువు. ఎంతో మంది స్త్రీవాద కవులు, వామపక్ష వాద కవులు ఆయనతో అభినందనలు పొందారు. ఇప్పుడు నడుస్తున్న స్త్రీవాద, దళితవాద యుగానికి బ్రాహ్మణాధిపత్యం నుంచి ద్వారాలు తెరిచింది శూద్రకవులే. అయితే శూద్రకవులకు కూడా కులాధిపత్య భావాలు వుంటాయి. వారిని తమ కులం వారు ప్రోత్సహిస్తారు. బిరుదులు ఇస్తారు. పదవులు ఇస్తారు. అయితే కొందరు నిరాకరిస్తారు. కొందరు వాటిని స్వీకరించి ఇతరులకు సహాయకారులుగా వుండాలని అనుకుంటారు. ఈ రెండో వర్గానికి చెందినవారే నారాయణరెడ్డిగారు.

**సినారె కవితా సందేశం**

నారాయణరెడ్డిగారితో ముప్పైఏళ్ళ సాహితీ అనుబంధం ఉన్నవాడిగా ఆయన కవిత్వ తత్వాన్ని ఈనాటి సమాజానికి చెప్పటం నా బాధ్యత. ఆయన వామపక్ష భావాలకు సంబంధించి ఈ కవితను చూడండి.

***"ఇవాళ నేను ఎర్ర నెత్తురు తొడుక్కున్నాను. తెల్లని ఆశయాలనూ, పచ్చని ప్రణాళికలనూ జల్లులుగా పుక్కిలించే నల్లని చీకట్ల మధ్య ఎర్రనెత్తురు తొడుక్కున్నాను. వచ్చిన చీకటికిది గోరీ. విచ్చిన వేకువకిది దారి. ఇవిగో వేయి వెలుగురేకులు యువశక్తుల చేతుల పిడిబాకులు. ఈ రేకుల పిడిబాకులు హొరెత్తించే చైతన్యోర్మికల మధ్య ఎర్రనెత్తురు తొడుక్కున్నాను. ఇవాళ నేను విధినీ నిధినీ విశ్వసించను. అరుపులకూ కొరడా, చరుపులకూ విహ్వలించను. జనం నా జెండా. జాగృతి నా ఎజెండా. ఎత్తిన పిడికిళ్ళే సవాళ్ళు, ఎలుగెత్తిన మూగనోళ్ళే ఎర్రని పిలుపుల ఆనవాళ్ళు"*** (సినారె సమగ్ర సాహిత్యం, వాల్యూం-15). నారాయణరెడ్డిగారిలో వామపక్ష భావాలు న్నాయి. మరోపక్షంతోను సంబంధాలుంటాయి. అయితే ఒకదానికి ఒకదానికి కలవనివ్వడు ఆయన. ఆయన నిరంతర కవితాసృజనం చేయటం వలన ఒక వాఙ్మయ సర్వస్వాన్ని సృష్టించుకోగలిగాడు. ఆయన కవిత్వంలో దేశభక్తి, ప్రకృతితత్వం, సంఘసంస్కరణ, తిరుగుబాటు, మనోవిశ్లేషణ, మానవతావాదం, స్నేహం, ప్రేమ ఇవన్నీ ఉంటాయి. ముఖ్యంగా మానవ సంబంధాల ప్రవాహశీలతే సినారె కవిత్వం. ఆయన జీవితంలో క్రమశిక్షణగా వుంటారు. రోజు మొత్తాన్ని అధ్యయనం, అభివ్యక్తి, రాత, సృజనం, సంభాషణలుగా మలచుకుని ఒక సాహితీ వ్యక్తిత్వాన్ని లోకానికి అందించారు. అందుకే ఆయన లేని లోటు మనకు కనిపిస్తుంది. ఆ లోటును పూరించాల్సిన బాధ్యతను మనం వహించి ఈ తెలుగు కవితా యుగ ప్రస్థానాన్ని ముందుకు తీసుకువెళదాం...

## జై టెలుగు టల్లీ...!

- చైతన్య ప్రసాద్

తెలుగెక్కడుందిరా తెలుగోడా...!
నీ తెలుగు తెల్లారె తెలుగోడా...!

అమ్మనే ఈజిప్టు మమ్మీని చేసావు
నాన్ననే డాడీకి డమ్మీని చేసావు
నీ బిడ్డ అఆలు దిద్దనే లేదు
తన భాష చదవడం రాయడం రాదు
తెలుగునే వెలి వేసె మన బడులు కూడా
తెలుగు మాట్లాడితే పగులుద్ది దౌడ

తెలుగెక్కడుందిరా తెలుగోడా...?
నీ తెలుగు తెల్లారె తెలుగోడా...!

లేత మనసుల్లోన నీతులే ముద్రించు
శతకాలు అటకెక్కి చెద పట్టినాయి
బతుకు పుటలను తెరచి వ్యాఖ్యానమొనరించు
మన తెలుగు సామెతలు మంట గలిసాయి
రామాయణం లేదు...భారతం లేదు
భాగవత పద్యాల్లో ఒకటైన రాదు

కథలు చెప్పే బామ్మ అమ్మమ్మలేరి?
కదలరే టీవీల చుట్టూత చేరి...!

మమ్మీకి ఎల్ కే జి ర్యాంకులే ముఖ్యం
డాడీకి లైఫులో విజయమే లక్ష్యం

తెలుగెక్కడుందిరా తెలుగోడా...?
నీ తెలుగు తెల్లారె తెలుగోడా...!

మువ్వన్నె జెండాను తెగ ఊపుతున్నావు
దాన్ని చేసిన తెలుగువాడెవడో తెలుసా?
వెండి తెర హీరోలు వీరులంటున్నావు
నిజ జీవితపు తెలుగు హీరోలు తెలుసా?
గుడి గుడీ గుంచాలు...కోతి కొమ్మచ్చి
ఏళ్ళు గడిచెను తెలుగు ఆటలే చచ్చి
పసివాళ్ళ చేతులకు సెల్ ఫోనులిచ్చి
పెంచావు వీడియో గేమ్సుపై పిచ్చి

పోటీకి సయ్యంది నీ తెలుగు మేధ
ఉనికినే మరచింది అది అసలు బాధ

తెలుగెక్కడుందిరా తెలుగోడా...?
నీ తెలుగు తెల్లారె తెలుగోడా...!

కూడు పెట్టని భాష 'భాష ' కాదన్నావు
డాలర్లు తెచ్చేది అసలు చదువన్నావు
తెలుగు పండగలన్ని మొక్కుబడి చేసావు
కార్పొరేట్ పండగల ఉచ్చులో పడ్డావు
గ్లోబునే గెలిచాము చూడమన్నావు
తల్లి వేరును మటుకు తెగ నరికినావు
తెలుగు మొనగాణ్ణి అని తొడ చరిచినావు
తల్లి పేరడిగితే తెల్లబోయావు

నీ పిల్లలకు ఒక్క తెలుగు పేరుందా?
సెంటిమెంటల్ స్టంటు చాలు నీ బొందా!

తెలుగెక్కడుందిరా తెలుగోడా...?
నీ తెలుగు తెల్లారె తెలుగోడా...!

(సామాజిక మాధ్యమాలనుంచి-మప్పిదాలతో)

-ఓలేటి శ్రీనివాసభాను
94405 67151

# ఒక జ్ఞాపకంలో ఆ ఇద్దరూ..



తాతా మనవడు చిత్రం 40వ వార్షికోత్సవం సందర్భంగా దాసరి-సినారె

**సినారె-దాసరినారాయణరావుల కలయిక బహుళ ప్రాచుర్యం పొందిన అనేక గీతాలకు ఊపిరి పోసింది. దాసరి దర్శకత్వంలో వెలువడిన సుమారు 100 చిత్రాల్లో సినారె పాటలు రాశారు. వాటిలో దాదాపు నలభై సినిమాల్లో సినారెది 'సింగిల్ కార్డ్'. ఒకరి వెంట ఒకరు వెళ్ళిపోయిన ఆ ఇద్దరు ప్రతిభావంతులూ కలిసి సృష్టించిన అద్భుతాలు అనేకం.**

ఒకరు ప్రాథమికంగా కవి. కథా కావ్యాలతో వాసికెక్కి కావ్య సృష్టితో 'విశ్వంభరుడి'గా జ్ఞానపీఠ సత్కారాన్ని పొందారు. ప్రాచీన, ప్రబంధ సాహిత్యాల ప్రభావంతో సమాసభూయిష్టమైన సంక్లిష్ట వ్యక్తీకరణ నుంచి సమకాలీన సమాజ స్థాయికి దిగివచ్చి, సామాన్యుడికి చేరువకావడం అదో పరిణామ క్రమం. అందుకు దోహదం చేసిన ఉపకరణం 'పాట'. ఆ పాట తెలుగు చలన చిత్ర రంగంలో సినారె ప్రవేశానికి దోహదం చేసింది. ఆయన కలం నుంచి, ఆలోచనల బలం నుంచి ఆణిముత్యాల్లాంటి పాటలెన్నో వచ్చాయి.

ఇక మరొకరు ప్రాథమికంగా నటుడు. పొట్ట గడవడానికి పొద్దుగూకే వరకూ శ్రమిస్తూ, నటన మీద ఆసక్తితో నాటక రంగంలో కృషి చేసిన కళాకారుడు. వెండి తెర నుంచి వచ్చిన పిలుపు మేరకు ఆయన రంగం మారింది. తీరా వెళ్తే పూలబాటలు ఎదురుకాలేదు. పరిస్థితులు సానుకూలంగా లేవు. ప్రతికూలతలోనే ఆయన లోని ప్రతిభ రాటుదేలింది. సంభాషణలు, దర్శకత్వ విభాగాల్లో సాగించిన కృషి తనదైన ముద్రను నెలకొల్పే దిశగా దారులు వేసింది. దాసరి నారాయణరావును 'దర్శక రత్న' స్థాయికి చేర్చింది.

ఒకరి వెంట ఒకరు వెళ్ళిపోయిన ఆ ఇద్దరు ప్రతిభావంతులూ కలిసి సృష్టించిన అద్భుతాలు అనేకం. వాటిలో కొన్నిటి ప్రస్తావనతో ఈ జ్ఞాపకం!

పాలగుమ్మి పద్మరాజువద్ద సంభాషణల శాఖలో, అదే సమయంలో భీమ్‌సింగ్, బి.ఎస్ నారాయణ, బి.వి.ప్రసాద్, నందన రావు లాంటి దర్శకుల వద్ద దర్శకత్వ శాఖలోనూ పనిచేస్తున్న రోజుల్లో దాసరి నారాయణరావు మంచి భవిష్యత్తు ఉన్న ప్రతిభావంతుడిగా పేరు తెచ్చుకొన్నారు. ఆయన 'మేనకోడలు' చిత్రానికి సహాయదర్శకుడిగా పనిచేసినప్పుడు ఆ చిత్రానికి సంగీత దర్శకుడిగా పనిచేసిన ఘంటసాల ఆ సినిమా కథను, సన్నివేశాలను దాసరి నారాయణరావు తనకు వివరించిన తీరును చూసి మంచి దర్శకుడు కాగల లక్షణాలు ఉన్నాయని మెచ్చుకొన్నారట. అప్పుడే దాసరి నారాయణరావుకు సినారె, దాశరథి లాంటి పాటల రచయితలతో కూడా పరిచయమయింది. ఆయన 'ఒకే కుటుంబం' సినిమాకు సహకార దర్శకుడిగా పనిచేసినప్పుడు సన్నివేశానికి అనుగుణంగా "శిల్పాలు శిథిలమైనా.." అనే చిన్న సాకీని కూడా రాశారు. అది ఘంటసాల పాడారు.

దాసరి సొంత ముద్ర కోసం తపిస్తున్న రోజులవి. అప్పుడు ఆయన 'తాత మనవడు' చిత్ర కథను తయారు చేసుకొన్నారు. నిర్మాత కె. రాఘవ భాగస్వామ్యంలో నిర్మించిన చిత్రాలకు తాను సహాయదర్శకుడిగా పనిచేసిన పరిచయాన్ని పురస్కరించుకొని, రాఘవకు 'తాత మనవడు' కథను దాసరి వినిపించారు. రాఘవకు కథ నచ్చింది. తన సొంత సంస్థ ప్రతాప్ ఆర్ట్ ప్రొడక్షన్స్ పతాకం పై దాసరిని దర్శకుడిగా పెట్టి చిత్రం నిర్మించాలని రాఘవ నిశ్చయించుకొన్నారు. పెట్టుబడి కోసం పంపిణీదారులకు కథ వినిపించారు. కథ బాగుంది కానీ దర్శకుడిని మార్చమంటూ పంపిణీదారులు షరతులు పెట్టారు. కొత్త దర్శకుడికి బదులు పేరున్న దర్శకుడిని పెట్టుకోమన్నారు. రాఘవ అంగీకరించ లేదట. పంపిణీ దారుడిని మార్చుకోడానికైనా సిద్ధమని, దర్శకుడిని మార్చే ప్రసక్తి లేదని తేల్చి చెప్పారట. మొత్తానికి దాసరి నారాయణరావు దర్శకుడిగా 'తాత మనవడు' పట్టాలకెక్కింది. అప్పుడు రంగంలోకి వచ్చారు

సినారె. ఆయనకు దాసరి నారాయణరావు సన్నివేశాలను వివరించి పాటలు రాయించుకొన్నారు. వాటిలో మొదటిది 'ఈనాడే బాబూ నీ పుట్టిన రోజు..', రెండోది 'అనుబంధం ఆత్మీయత అంతా ఒక బూటకం..'. రెండో పాట బాగా ప్రాచుర్యం పొందింది. ప్రేక్షకుల హృదయాలకు హత్తుకొనేలా చిత్రించిన దాసరికి, స్వరాలు సమకూర్చిన రమేశ్ నాయుడుకు, గాయకుడు రామకృష్ణకు గొప్ప పేరు తీసుకువచ్చింది. అదిగో అలా ఆరంభమైన సినారె-దాసరి నారాయణరావుల కలయిక ఆ తర్వాతి కాలంలో బహుళ ప్రాచుర్యం పొందిన అనేక గీతాలకు ఊపిరి పోసింది. 'తాత మనవడు' చిత్రం నలభయ్యేళ్ళు పూర్తి చేసుకొన్న సందర్భంగా దాసరి ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనం లో దాసరి ప్రత్యేకంగా సినారె గురించి పేర్కొన్నారు. తన దర్శకత్వంలో వెలువడిన సుమారు నూరు చిత్రాల్లో సినారె పాటలు రాశారని, వాటిలో దాదాపు నలభై సినిమాల్లో సినారెది 'సింగిల్ కార్డ్' అని దాసరి గుర్తుచేసుకొన్నారు.

దాసరి దర్శకుడిగా పరిచయమైన మొదట్లో వచ్చిన 'రాధమ్మ పెళ్లి' చిత్రంలో 'పారే గోదావరిలా..', 'తల్లీ గోదారికే..', 'ఆడది కోరుకొనే వరాలు ..' లాంటి చక్కని పాటలు రాశారు సినారె. ఆ అనుబంధంతో సినారె దాసరి దర్శకత్వంలో వచ్చిన 'తూర్పు పడమర' చిత్రంలో నటించారు. ఓ సన్నివేశంలో హాస్యనటుడు నాగేశ్‌తో కలిసి నిజజీవిత పాత్రలో కాసేపు కనిపించి, "ఎవడయ్య ఎవడు వాడు..ఇంకెవడయ్య తెలుగు వాడు" అనే గేయాన్ని ఆలపించి, చమక్కులు పండించారు కూడా!

'తూర్పు పడమర' లో సినారె కలం వైవిధ్యాన్ని పండించింది. "స్వరములు ఏడైనా రాగాలెన్నో..", "తూర్పూ పడమర ఎదురెదురు.." లాంటి పాటల్లో తాత్త్వికతను ప్రబోధించి, "శివరంజనీ..నవ రాగిణీ.."గీతంలో ' స్వర సుర ఝురీ తరంగాలు' పొంగించి, 'రాశీకృత నవ రసమయ జీవన రాగచంద్రికలు' కురిపించి, 'లలిత లావణ్య భయద సౌందర్య కలిత చండిక'ను ఆవిష్కరించారు సినారె. ఇక్కడ దాసరి నారాయణరావు కవికి కల్పించిన వెసులుబాటు గురించి చెప్పుకోవాలి. తేలిక మాటల్లో ఉండాలనే నిబంధన విధించకుండా సినారె విశ్వరూపాన్ని ప్రదర్శించే అవకాశాన్ని దాసరి ఇచ్చారు. అంతకు మునుపు "స్వాగతం సుస్వాగతం.." (శ్రీకృష్ణ పాండవీయం'), "సరిలేరు నీకెవ్వరూ.." (కంచుకోట), 'చరణ కింకిణులు..' (చెల్లెలి కాపురం) లాంటి పాటల్లో లాగ "శివరంజనీ..." పాట కూడా సినారె ప్రతిభకు గీటురాయి లాగా నిలిచి, సినిమా పాటకు కావ్యగౌరవ స్థానాన్ని సంపాదించినట్లయిది. దాసరి-సినారెల కలయికలో ఇలాంటి మెరుపు 'శివరంజని' చిత్రం లోని "అభినవ తారవో.."పాటలో మరోసారి కనిపించింది.

ఒక రకమైన తాత్త్వికతతో కూడిన పాటలకు ఆత్రేయను ఎంచుకొనే రోజుల్లో 'దేవదాసు మళ్ళీ పుట్టాడు' చిత్రంలోని "ఎవరికి ఎవరు.. చివరికి ఎవరు.."లాంటి గీతాన్ని సినారె చేత రాయించారు దాసరి. దాసరి పునరాగమనానికి నాంది పలికిన 'ఒసే రాములమ్మ' చిత్రంలో "కడవ మీద కడవ పెట్టి.." పాటలో రాములమ్మ సోయగాలను సినారె వర్ణించిన తీరు అద్భుతం. ఈ ఇద్దరు ప్రతిభావంతుల్లో మరో సారూప్యం కనిపిస్తుంది. ఇద్దరి జన్మదినాలూ ప్రత్యేకమైనవే. సినారె తిథుల ప్రకారం 'వ్యాస (గురు) పూర్ణిమ' నాడు జన్మిస్తే, ఇంగ్లిష్ క్యాలండర్ ప్రకారం త్యాగరాజ స్వామి జన్మించిన మే నాలుగో తేదీనాడే దాసరి పుట్టిన రోజు కావడం విశేషం. అ

కవిత

# కొత్తదారి

- గుర్రాల రమణయ్య
99639 21943

బువ్వపెట్టే అమ్మకే
దూప తీర్చలేనప్పుడు
కొడుకు గుండె క్షోభ వానై కురవదు
దేవుడు కరుణించడు!
అడుగడుగున నదులున్నా
దేశం ఒక నటనాలయమై
ఊసనవెల్లి రంగులే కాని
అభివృద్ధి మరీచిక మాత్రం
ఫ్యాక్టరీలకి వరాలిచ్చే అక్షయ పాత్రయిపోతుంది
ఆనకట్టల ప్రాజెక్టులకి
రైతుపట్ల దయకన్నా
కార్మికుడి పైన ప్రేమ మిన్న
నేలతల్లి గుండెల్లో నెర్రెలు
విరిగిన కలలై రైతుకన్నుల్లో
కూలుతున్న ఆశల కోటలై
నిరాశల ఎండిన తోటలై
ఎటు చూసినా ఎడారి బాటలే
కన్నీట మొలచిన కంపకోటలే
ఇంకా ఎన్నాళ్ళీ తండ్లాట
ఉరితాడును విసిరికొట్టు
పురుగుల మందు పారేయ్
చేనుకు చేవనిచ్చే
చెరువు పూడికతీసి పదును పెట్టు
చేనుబావిలో మట్టితీసి
మదుపు చెయ్యి
నీ పంటను అమ్మటానికి
నువ్వే ఓ మార్కెట్ అయిపో
నీ పైన నీకు నమ్మకమంటే
జీవితం నీ ముందు గులామూ
ప్రపంచం నీకు చేస్తుంది సలాము

-సంకేపల్లి నాగేంద్రశర్మ
9441797650

# జన్మభూమితో సాహితీ విశ్వంభరుని బంధం

**డా.** సినారెతో నాకున్న అనుబంధం దాదాపు నాలుగు దశాబ్దాల నాటిది. ఎందుకంటే ఆయన పూర్వ కరీంనగర్ జిల్లా పరిధిలోని రాజన్న-సిరిసిల్లా జిల్లా – వేములవాడ మండల ప్రాంతం హన్మాజీ పేట వాస్తవ్యుడు కావడం. వేములవాడకు హన్మాజీపేటకు 10కిలో మీటర్ల దూరమే. ఎన్ని పనులున్నప్పటికీనీ ప్రతిఏటా జనవరి 10న హన్మాజీపేటకు వచ్చి తన మాతాపిత లకు,(మధ్యలో చనిపోయిన భార్య సుశీలతో సహా) శ్రాద్ధర్మలు చేసి వెడుతుంటారు. చాలా ఏళ్ళనుండి ఈ తంతు సాగుతోంది. ఈ తంతు ఆయన చనిపోయే కాలానికి (2015)రెండేళ్ళ ముందుతో ముగిసింది. హన్మాజీపేటలోనే ఆయన తల్లితండ్రులు, భార్య సుశీల సమాధులున్నాయి. 1997లో సినారె రాజ్యసభ సభ్యుడయ్యాక మొదటిసారి హన్మాజీపేటకు వచ్చినపుడు, ఊరు ఊరంతాకదిలి ఘన స్వాగతం పలికింది. పెద్దసభ ఏర్పాటుచేయగా, వేలాది వుంది సమీప గ్రామాల ప్రజలు హాజరయ్యారు.

డా.సినారె వేములవాడ వస్తున్నారంటే, పూర్వ కరీంనగర్ జిల్లాలోనే సందడి కనబడేది. ఎంతోమంది సాహితీవేత్తలు ఆయన్ని సాకల్యంగా హన్మాజీపేటకు వచ్చి కలుస్తుండేవారు. వేములవాడ పట్టణంలో నవ సాహితీ, సాంస్కృతిక చైతన్యం వెల్లివిరుస్తుండేది. సినారె రాక – ముందస్తు సంక్రాంతి సంబరాలను తెస్తుండేదని ఇక్కడివారు ఇప్పటికినీ చెబుతుంటారు. సినారె రాకతో వేములవాడ లోని ఆయన చిరకాల మిత్రుడైన ఆరేటి శంకరయ్య బీడీల కార్ఖానా కళకళలాడుతూ కనిపించేది. బీడీల కార్ఖాన యజమాని ఆరేటి శంకరయ్య షష్టిపూర్తికి డా.నారాయణరెడ్డిగారే ముఖ్యఅతిథిగా హాజరై, శుభాకాంక్షలు తెలిపారు. సినారెని సన్నిహితులు, కవులు, ఇతర రంగాల ప్రముఖులు ఎంతోమంది వచ్చి కలుస్తుండేవారు. ముఖ్యంగా వేములవాడ ప్రముఖులు ఆయన వెంట వుండేవారు. స్థానిక కవి చొప్పకట్ల చంద్రమౌళి వేములవాడ మాజీ సర్పంచ్ ప్రతాప చంద్ర మౌళి రాజకీయ నాయకులు రేగులపాటి పాపారావు, నసీర్, పాత రమేష్, దివాకర్రావు, నరాల పోచెట్టి, నృత్య కళానికేతన్ వ్యవస్థాపకులు ఎల్లపోచెట్టిలు వెంట వుండేవారు. డా. సినారె వెంట హన్మాజీపేట నాయకులు తీగల రవీందర్‌గౌడ్(మాజీ జడ్పి ఛైర్మన్) బాడీగార్డులా వెన్నంటి వుంటు, ఆయున యోగక్షేమాలు చూస్తుండేవారు. రవీందర్ గౌడ్ నాన్న హన్మాజీపేట తొలి సర్పంచ్ స్వర్గీయ తీగల నారాయణ గౌడ్‌తో 1970–80లలోనే సినారెకి దగ్గరి సంబంధాలున్నాయి. సినారెగారు వేములవాడకు ఏ అధికార పర్యటనకు వచ్చినా, నన్ను పిలిపించుకొని ఆత్మీయంగా మాట్లాడే వారు. ఒకింత గర్వంగా భావించేవాడిని. ఇక్కడి విశేషాలను నన్ను అడిగి తెలుసుకొనేవారు. నేనప్పుడు ఒక దినపత్రిక విలేఖరిగా పనిచేస్తున్నాను.

1997లో రాజ్యసభ సభ్యునిగావున్న కాలంలో వేములవాడ దేవస్థానంలో ప్రతిఏటా ఐదురోజులు జరిగే త్యాగరాజ ఉత్సవాలకు



ఆహ్వానితుడిగా విచ్చేసేవారు. ఒకటి రెండు సార్లు ఆయన త్యాగరాజ ఉత్సవాలను జ్యోతి వెలిగించి లాంఛనంగా ప్రారంభించారు. డా. సినారె కవిగా వున్న కాలంలో వేములవాడకు అక్కినేనిని, గుమ్మడి వేంకటేశ్వరరావులను తీసుకొని వచ్చారు. సాహితీ సభలకు హాజర య్యారు. డా. సినారె రాజ్యసభ సభ్యులైన తర్వాత ఆయన వెంట వచ్చే వారి సంఖ్య పెరిగిపోయింది. రాజకీయనాయకులు, సాహితీ వేత్తలు, ప్రభుత్వాధికారులు, సన్నిహితులు ఎంతో మంది వచ్చి కలిసి పోతుండేవారు. వేములవాడ దేవస్థానం వారి అతిథి గృహాల లోనే ఆయనకు బస ఏర్పాటు చేయబడుతుండేది. మాజీ ఎమ్మెల్యే వచ్చిడి మోహనరెడ్డి ఆలయ ఛైర్మన్‌గా వున్నపుడు వేములవాడ దేవస్థానం వారి ఆధ్వర్యంలో జరిగిన మూడు రోజుల సాహితీ ఉత్సవాలను డా.సినారె ప్రారంభించి, ఇక్కడే బసచేసి ఎంతో మంది జిల్లా కవులను ఆత్మీయంగా సత్కరించారు.

రాజ్యసభ నిధులతో వేములవాడ, సిరిసిల్లా కోరుట్లలో ఆయన పేరిట ఆడిటోరియాలు వెలిశాయి. కరీంనగర్‌లో బోయినపల్లి వేంకటరామారావుగారి సారస్వత జ్యోతి మిత్రమండలివారి సినారె సాహితీ సదన్ భవన నిర్మాణాలకు ఎనిమిది లక్షల రూపాయల ఆర్థిక సాయం గావించారు. ఇలా ఆయన చేతుల మీదుగా ఎన్నెన్నో సాంస్కృతిక భవనాలకు ఆర్థిక సాయం లభించింది. డా.సినారె రాజ్యసభ సభ్యులు కాకముందు హన్మాజీపేట గ్రామంలోని తన ఇంటిలో కొంత భాగాన్ని గ్రామ పంచాయతీ వారికి దానంగా ఇవ్వడమే కాకుండా, అందులో సుమారు మూడు వేల పుస్తకాలను సమకూర్చి లైబ్రరీని ఏర్పాటు చేయించారు. జన్మనిచ్చిన గ్రామం పట్ల ఆయనకున్న ప్రేమ అలాంటిది.

హన్మాజీపేట నక్కవాగు, తల్లి మూలవాగు, పక్కనుండే వెళ్ళే గంజివాగుల్లో డా.సినారె కవిత్వం పరవళ్ళు తొక్కింది. కోలాటాలు, జానపదాలు, బతుకమ్మపాటలంటే ఆయనకు పరమాన్నంతో సమానం. పల్లెబాణీలను ఆయన తన పాటల్లో అల్లి, పండించారు. అత్తమడుగు వాగులోన అనే పాట లింగంపల్లిదగ్గరి వున్న ఒక ప్రవాహపు పేరునే పాటగా మలిచారు. ఒగ్గు కళాకారుడు, హన్మాజీ పేట వాస్తవ్యులైన మిద్దెరాములు, కథాకారుడు గూడూరి సీతారాం, కవి కనపర్తి లక్ష్మీనరసయ్య, రైతు ఆదిరెడ్డి వీరికి సన్నిహిత బాల్యమిత్రులు. 2009లో వేములవాడలో పెద్దఎత్తున జరిగిన మిద్దెరాములు ఒగ్గుకథా జీవిత స్వర్ణోత్సవాలకు సినారే హాజరై, ఒగ్గుకథాసామ్రాట్ బిరుదునిచ్చి సత్కరించారు.

**జననం-విద్యాభ్యాసం:** డా.సినారె 29-7-1931న ఆషాఢ పూర్ణిమ నాడు సింగిరెడ్డి బుచ్చమ్మ, మల్లారెడ్డి అనే పుణ్యదంపతులకు హన్మాజీ పేటలో జన్మించారు. మామిడిపల్లి, బొల్లారం, బండపల్లి, మల్లారం తదితర గ్రామాలకు హన్మాజీపేట కేంద్రం. సామాన్య రైతు కుటుంబంలో జన్మించిన సినారె చిన్నతనానే పల్లె, ప్రకృతి సోయగాలను ఆస్వాదించాడు. హన్మాజీపేటలోనే ప్రాథమిక విద్యాభ్యాసం చేశారు. వేములవాడకు తరుచుగా వచ్చి, గుడిలోచెప్పే మామిడిపల్లి సాంబకవి హరికథలను, యక్షగానాలను, చౌటినరయ్య పురాణాలను వంట పట్టించుకుండేవారు. తదుపరి సిరిసిల్లాలో మాధ్యమిక విద్యను, కరీంనగర్లో హైస్కూల్, హైదరాబాద్ చాదర్ఘాట్ కాలేజీలో ఇంటర్, ఉస్మానియా ఆర్ట్స్ కాలేజీలో బిఏ వరకు ఉర్దూమీడియంలో చదువుకున్నారు. 1954లో ఎంఏ తెలుగు పూర్తిచేశారు. 1954లో సికిందరాబాద్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీలో తెలుగు పార్ట్‌టైం లెక్చరర్‌గా నియామకమయ్యారు. 1963లో రీడర్‌గా పదోన్నతి పొంది, 1976నుండి పూర్తి స్థాయి ఆచార్యులుగా నియామకమై, ఉస్మానియా విశ్వవిద్యాలయంలో రిటైరయ్యేవరకు పని చేశారు. కరీంనగర్ హైస్కూల్లో వారు చదివేటప్పుడు తెలుగు అధ్యాపకుడైన ప్రముఖ పండితులు దూపాటి వేంకటరమణాచార్యుల వద్ద ఛందస్సు నేర్చుకుని పద్యకవిత్వ రచనా విధానం గూర్చి అవగాహన పెంచుకున్నారు.

సినారె ఆచార్యత్వంలో వందలాదిమంది విద్యార్థులు శిష్య సాహితీవేత్తలుగా ఎదిగారు. 35మంది వరకు పిహెచ్‌డీలు, ఎంఫిల్ వంటి సిద్ధాంత పరిశోధనలు చేసి, ఉన్నతపదవుల్లోకి వెళ్ళి ప్రసిద్ధులై పోయారు. అలాంటివారిలో డా.గోపి, ఎండూరి సుధాకర్, డా.శిఖామణి వంటి వారున్నారు. డా. సినారె రాసిన విశ్వగీతి కావ్యాన్ని కరీంనగర్ బాల్యమిత్రులు డా.ముద్దసాని రాంరెడ్డి తన సైకిల్ అమ్మి ముద్రించారు. అలా సినారె ఎదగడానికి ఎందరెందరో మిత్రులు, వదాన్యులు సహకరిస్తు వచ్చారు. సినారే రచనలు 17ఏళ్ళ వయస్సు నుండే రావడం మొదలుపెట్టాయి. 1962లో గులేబకావళి కథ హీరో ఎన్టీఆర్ చలువతో సినీ రంగ ప్రవేశం చేసి నేటి వరకు మూడువేల వరకు పైగా సినీ గీతాలు రాశారు. ప్రపంచ వ్యాప్తంగా చాలా దేశాలలో ఆయన సాహితీ పర్యటనలు జరిపారు. 75 దాటి పుస్తకాలు రాశారు. ప్రతి ఏటా తన జన్మదినం నాడు ఒక పుస్తకాన్ని ఆవిష్కరించే ఆచారం ఆయనకు వుంది. ఆయన సొంతంగా తెలుగులో రాసిన గజళ్ళను పాడి భళా! అనిపించుకున్నారు. అలాగే తాను రాసిన ప్రపంచపదులను గానం చేయగా, అవి రెండు ఆడియో క్యాసెట్లుగా విడుదలయ్యాయి. సినారె గజల్ పాటలకు సమ్మోహితుడైన గజల్ శ్రీనివాస్, సినారె మానస పుత్రునిగా ఎదిగి, సినారె గజళ్ళు పాడుతూ గజల్ శ్రీనివాస్‌గా ప్రసిద్ధిగాంచారు.

సినారె రాసిన పుస్తకాలు సప్తతి పూర్తి చేసుకున్న సందర్భంగా 18 సంపుటాలుగా వచ్చాయి. ఇందులో రెండు సంపుటాలు ఆయన సొంత జిల్లాయైన కరీంనగర్, సిరిసిల్లాలలో 2001లో విడుదలయ్యాయి. 1981లో ఆయన రాష్ట్ర అధికార భాషా సంఘం చైర్మన్‌గా పనిచేశారు. తదుపరి ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయానికి, తెలుగు విశ్వవిద్యాలయాలకు ఉపకులపతిగా వరుసగా మూడేళ్ళచొప్పున పూర్తిస్థాయిలో సమర్థవంతంగా పనిచేశారు. రాష్ట్ర సాంస్కృతిక మండలి చైర్మన్‌గా, సలహాదారుడిగా, ఆరేళ్ళపాటు రాజ్యసభ సభ్యులుగా పనిచేశారు. డా.సినారె అజాతశత్రువు. ఇన్ని పదవులను అలంకరించినా, ఆయన ఏ పార్టీలోను, ఏ సాహితీ ఇజాలలోని చేరకపోవడం విశేషం. అన్ని పార్టీలు, ప్రభుత్వాలతో ఆయన సన్నిహితంగా వుండటం ప్రత్యేకతలేనని చెప్పవచ్చును. గత ఇరవై ముప్పై ఏళ్ళ నుండి జరిగే ప్రభుత్వ, ప్రభుత్వేతర కార్యక్రమాలు సినారె లేకుండా జరగటం అరుదు. డా.సినారె రాసిన కావ్యాలపై విశ్వవిద్యాలయాల స్థాయిలో అనేక సాహితీ పరిశోధనలు జరిగాయి. ఎంతోమంది ఔత్సాహికులు పిహెచ్‌డిలు, ఎంఫిల్స్ పొందారు. ఆయన రాసిన విశ్వంభర దీర్ఘకవిత్వానికి 1988లో భారతీయ జ్ఞానపీఠ పురస్కారం లభించింది.

డా.సినారె రాసిన విశ్వగీతి, నాగార్జున సాగరం, కర్పూర వసంతరాయలు, మంటలు మానవుడు, విశ్వనాథ నాయకుడు, విశ్వంభర, గజల్స్, ప్రపంచపదులు, నవ్వని పువ్వు, అజంతా సుందరి, రామప్ప, ఆధునికాంధ్ర కవిత్వం, సంప్రదాయాలు, యాత్రాకథనాలు, రుతుచక్రం తదితర కావ్యాలు ఆయన సాహితీ వ్యక్తిత్వాన్ని సముజ్జ్వలంగా ఆవిష్కరించాయి. రాష్ట్రంలోనే కాక, దేశమంతటా, విదేశాలలో ఆయనకు జరిగినన్నీ సన్మానాలు మరేకవికి జరగలేదేమో. సినారె పేరిట జ్ఞానపీఠ పురస్కారం పొందిన సందర్భాన్ని పురస్కరించుకుని కరీంనగర్ సాహితీ గౌతమి వారు 1990నుండి ప్రతిఏటా సినారె వచన కవితా పురస్కారాన్ని ఇస్తున్నారు. ఎంపికైన కవికి నగదు పురస్కారాన్ని అందజేస్తు, సినారె సాహిత్యానికి తగిన గౌరవం, గుర్తింపు తెచ్చారు. ఇంతవరకు 25మందికి పైగా ఈపురస్కారాలను అందుకున్నారు. ఈపురస్కార సభలకు సినారె చాలాసార్లు స్వయంగా విచ్చేసి, అవార్డు పొందిన కవిని సత్కరించారు. 2005లో సిరిసిల్లలో జరిగిన తెలంగాణా తొలితరం కథారచయిత గూడూరి సీతారాం సాహితీ స్వర్ణోత్సవాలలో పాల్గొన్నారు.

2014 లో సినారె 83వ జయంతి వేడుకలు హైదరాబాద్ రవీంద్రభారతిలో అట్టహాసంగా జరిగాయి. నింగికెగిరిన చెట్టు అనెడి వచన కవితా కావ్యావిష్కరణ సిఎం కె.చంద్రశేఖర్రావు చేతిన జరిగింది.

సినారె కవిత్వం, సినారె వ్యక్తిత్వం అజరామరం. ఆయన అజాత శత్రువు. వారికి నా నివాళి.

# జాతీయ భాషా? లేక జాతిని అణిచివేసే భాషా?

ప్రపంచంలోనే హిందీ నాల్గవ అతి ఎక్కువ భాషీయులు కలిగిన భాష. ప్రపంచవ్యాప్తంగా 50 కోట్ల మంది ఈ భాషను మాతృభాషగా కలిగి ఉన్నారని ఒక అంచనా. ద్రావిడ, టర్కీ, పారశీక, అరబ్బీ, పోర్చుగీసు, ఆంగ్ల భాషల ప్రభావం ఈ భాష మీద చాలా ఎక్కువగా ఉంది.

**చిన్న చరిత్ర**

హిందీ సంస్కృత భాష నుండి నేరుగా పుట్టిందన్న సంగతి జగమెరిగిన విషయం. ఏడవ శతాబ్దికి అపభ్రంశం నుండి ఉద్భవించి, పదవ శతాబ్దికి భాషగా నిలదొక్కుకుందంటారు. ఢిల్లీ ప్రాంతంలో మాట్లాడే ఖడీబోలీని ఆధారం చేసుకుని ప్రస్తుత ప్రామాణిక హిందీని అభివృద్ధి చేసుకున్నారు.

**హిందీ జాతీయ భాషా?**

మన రాజ్యాంగం హిందీని అధికార భాషగా మాత్రమే ప్రకటించింది, ఐతే ఏ భాషనూ జాతీయ భాషగా ప్రకటించలేదు. 343వ అధికరణం ప్రకారం భారతదేశ ప్రభుత్వ అధికార భాష దేవనాగరి లిపిలో హిందీ, మరియు ఆంగ్ల భాష. కానీ మన దేశంలో 60 శాతం కన్నా ఎక్కువ మంది మాతృభాష హిందీ కాదు. భారతదేశ అధికార భాషగా 1950లో హిందీ ప్రకటన జరిగినప్పుడు పదిహేనేళ్ళ పాటు ఆంగ్లాన్ని వాడాలని మెల్లిగా ఆంగ్ల వాడకం తగ్గిస్తూ హిందీని అధికార భాషగా స్థిరపరచాలనేది రాజ్యాంగకర్తల అభిలాష. ఐతే రాష్ట్రాలు తమ సొంత జాబితాను అధికార భాషలుగా గుర్తించవచ్చు. ఆ విధంగా రాజ్యాంగ గుర్తింపును 22 భాషలు పొందాయి.

**హిందీని జాతీయ భాష చేయాలనే విఫల ప్రయత్నాలు**

హిందీ జాతీయ భాష అనే అపోహ చాలా మందిలో ఉంది. రాజ్యాంగంలో అలాంటి మాట ఎక్కడా లేకపోయినా, ఎన్నో న్యాయస్థానాలు పలు తీర్పుల్లో స్పష్టం చేసినా, హిందీ జాతీయ భాష అనే అపోహ రోజు రోజుకీ పెరిగిపోతోంది.

భారత రాజ్యాంగ నిర్మాణ సమయంలోనే హిందీని జాతీయ భాషగా ప్రకటించేందుకు ఉత్తరభారత నాయకులు కుతంత్రం పన్నారు. మొత్తం దేశం హిందీ మాట్లాడదు, హిందీ భాష అందరికీ తెలీదు అన్న కారణంచేత రాజ్యాంగకర్తలు ఆ ప్రయత్నాలను దాటవేసారు. ఐనప్పటికీ హిందీ అత్యధికంగా మాట్లాడబడే భాష కావున అధికార భాషగా గుర్తింపబడింది. పదిహేనేళ్ళ పిమ్మట పూర్తి స్థాయి ఆంగ్లాన్ని ఆక్రమించి అధికార భాషగా హిందీ ఏర్పరచాల్సిన సమయానికి లాల్ బహదూర్ శాస్త్రి ప్రధానమంత్రిగా ఉన్నారు. ఆనాడు కేంద్రం-రాష్ట్రాల మధ్య సంభాషణలు-ఉత్తరప్రత్యుత్తరాలు హిందీలో మాత్రమే జరగాలని హుకుం జారీ చేసారు. హిందీని పాఠశాలల్లో తప్పనిసరి కూడా చేసారు. హిందీని జాతీయ భాషగా ప్రకటించడం ఖాయం అనుకుంటున్న సమయంలో హిందీ మాట్లాడని ప్రాంతాల వాళ్ళ నుండి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. తమిళనాడులో అల్లర్లు జరిగి డిఎంకె సభ్యులు ఇద్దరితో సహా అరవై ఆరు మంది ప్రాణాలు కోల్పోయారు. అక్కడితో ఆ ప్రయత్నాలు ఆగిపోయాయి.

**హిందీని జాతీయ భాష చేయాలనే వాదన**

హిందీని జాతీయ భాష చేయాలని ఎన్నో వాదనలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా భారతదేశవాసుల్లో ఏకత్వపు భావనను తెచ్చి జాతీయత భావాన్ని హిందీ పెంపొందిస్తుందన్నది. రెండో వాదన మహాత్మా గాంధీ ఆత్మకథలో హిందుస్తానీ భాషకు గాంధీ గారిచ్చిన కితాబు. ఈ హిందుస్తానీ హిందీ-ఉర్దూ భాషల కలయిక భాష.

**హిందీని పెంపొందించేందుకు యత్నాలు**

హిందీ భాషను ప్రోత్సహించేందుకు, జాతీయ భాషగా అమలు పరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఎన్నో ప్రయత్నాలు చేస్తూనే ఉంది. 1918లో దక్షిణ భారత హిందీ ప్రచార సభను చెన్నైలో ఏర్పాటు చేసి హిందీ భాషను ప్రోత్సహిద్దామని ప్రయత్నించారు. బెంగుళూరు, ముంబై, కోల్‌కత్తా, గౌహతి, భోపాల్, ఢిల్లీ, తిరువనంతపురం, మరియు ఘజియాబాద్ లోని ప్రాంతీయ హిందీ అమలు కేంద్రాలను ఏర్పాటు చేసి వాటి ద్వారా కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో హిందీ అమలుపై నిఘా ఉంచారు. ఈ ప్రాంతీయ కేంద్రాల నుండి ఎలాంటి పై స్థాయి వత్తిడిని కేంద్ర ప్రభుత్వం నిన్న మొన్నటి దాకా చేయలేదు. అయితే 2014 లో గృహ మంత్రిత్వ శాఖ వాళ్ళు తమ అధీనంలో ఉన్న అన్ని శాఖల సిబ్బంది ఆంగ్లానికి బదులుగా హిందీ వాడటానికి ప్రాధాన్యతనివ్వాలని సూచించింది. ట్విటర్, ఫేస్‌బుక్ లాంటి సామాజిక వాహికల్లో కూడా హిందీనే వాడాలని నిర్దేశించింది. ప్రతి కచేరీలో హిందీని అత్యధికంగా వాడిన అధికారులకు 2000, 1200, 600 ల నగదు బహుమతులను ప్రకటించారు.

**ఇటీవలి వివాదాంశాలు**

* ఈ మధ్యనే రాష్ట్రపతి సీబీఎస్ఈ, కేంద్రీయ విద్యాలయాల్లో హిందీని తప్పనిసరి చేస్తూ ఇచ్చిన ఉత్తరువులు హిందీయేతర రాష్ట్రాలలో పెద్ద దుమారం రేపాయి.

* ఏప్రిల్ 2017లో బిహు పండుగ సందర్భంగా అస్సాంలో హిందీలో పాట పాడుతున్న గాయకుడు జుబీన్ గర్గ్ తన పాటను నిరసనల వలన మధ్యలోనే ఆపేయాల్సి వచ్చింది.

* ఉత్తరప్రదేశ్ ఎన్నికలలో ఇటీవల గెలుపొందిన బీజేపీ మంత్రుల ప్రమాణ స్వీకారం వివాదాంశమయింది. తాత్కాలిక స్పీకర్ ఫతేహ్ బహాదుర్ 403గురిలో 319 మంది శాసన సభ సభ్యుల చేత ప్రమాణ స్వీకారం చేయిస్తున్నపుడు, 13గురు బీజేపీ సభ్యులు సంస్కృతంలో ప్రమాణ స్వీకారం చేయగా, ఇద్దరు ఎంఎల్ఏలు ఉర్దూలో చేయాలనుకున్నారు. ఐతే అహ్మద్ అనే ఎంఎల్ఏ చేసిన ప్రమాణ స్వీకారాన్ని బహాదుర్ నిర్వీర్యం చేసి తిరిగి హిందీలో ప్రమాణ స్వీకారం చేయించారు. విచిత్రమైన విషయమేమిటంటే ఉత్తరప్రదేశ్ లో అధికార భాషగా చెలామణి ఔతున్న హిందీ ఉర్దూ భాషలలో- ఉర్దూలో శాసనసభ్యులు ప్రమాణ స్వీకారం చేయటం కుదరదు. కానీ సంస్కృతంలో చేయవచ్చు.

-డా॥మధురాంతకం నరేంద్ర
98662 43659

# ఇద్దరమ్మల కథలు









**రెండువేర్వేరు సామాజిక భూమికలున్నా యీ పుస్తకాలలోని వ్యక్తులిద్దరూ గొప్ప స్వాభిమానమున్న నాగరిక స్త్రీలు. గొప్ప వ్యక్తిత్వాలున్న వాళ్ళు. 'మనసున మల్లెల మాలలు' వొకప్పటి మనుషుల్లోని నైతిక విలువల్ని విశదీకరిస్తూ మన తెలుగు వాళ్ళు - లేకపోతే యీకాలపు ప్రజలందరి జీవన గతిని బేరీజువేసి చూపెడుతుంది. 'వెలుగుదారులలో' జీవనపోరాటం చేస్తున్న స్త్రీలందరికీ స్ఫూర్తిగా వుంటుంది. యీ యిద్దరు స్త్రీ మూర్తులూ మన వ్యవస్థకున్న రెండు బలమైన పార్శ్వాలను పరిచయం చేసారు.**

**అ**మ్మనుడి పాఠకులకు యీనెల యిద్దరు గొప్ప అమ్మల్ని పరిచయంచేసే అవకాశం దొరుకుతోంది నాకిప్పుడు. వొకరిది జీవితకథ, ఆమె కూతురు రాసింది. యింకొకరిది ఆత్మకథ. ఆమె తానే రాసుకున్నారు.

వొకజాతి సంస్కృతీ, నాగరికత స్త్రీలజీవితాల్లో వ్యక్తమైనంతగా పురుషుల బతుకుల్లో వెల్లడి కాదు.

భిన్న ధృవాల్లాంటి జీవితాలు గడిపిన యీ యిద్దరు స్త్రీల జీవితాలు మన ముందుతరం తెలుగు జాతి చరిత్రకంతా గొప్ప వ్యాఖ్యానాల్లాంటివి.

జనవరి నెలలో బరంపురం వెళ్ళినప్పుడు వికాసం సమావేశ సమయంలో అక్కడి సాహితీ మిత్రుల్ని కవి మిత్రులు విజయ చంద్ర గారు పరిచయం చేస్తూ యీమె రెండు "బయోగ్రఫీలు" రాశారు. అని వో భద్రమహిళను చూపెట్టారు. నేను వులిక్కిపడి "జీవితకథలా?" అని ప్రశ్నించాను. ఆమె పేరు కోకాసావిత్రి. ఆ మరునాడు ఆమె తానురాసిన ఆ రెండు జీవిత కథల పుస్తకాల్ని నాకు బహుమానంగా యిచ్చారు. అందులో మొదటిది బరంపురానికి చెందిన ప్రముఖ వైద్యుడి జీవితం, రెండవది సావిత్రిగారి అమ్మ జీవితం...

వొక కూతురు తన అమ్మ జీవిత కథను రాయడం చాలా అరుదు. బహుశా యీ కోవలో యిదే మొదటి పుస్తకమేమో! ఆ పుస్తకం రాసినప్పుడు కూతురు వయస్సు 56, ఆ తల్లి వయస్సు తొమ్మిదిపదుల్ని దాటుతోంది. తాను పుట్టకముందు దాదాపు 35 సంవత్సరాల జీవితాన్ని అక్షరీకరించాలి. యెలా సాధ్యం? బహుశా ఆమె తన తల్లి అప్పుడప్పుడూ చెప్పిన జ్ఞాపకాలనంతా వొక పద్ధతి ప్రకారం గుదిగుచ్చి వుండాలి. లేకపోతే జీవిత కథ రాయడం కోసం అన్ని విషయాలు తిరిగి తెలుసుకొని నమోదు చేసుకుంటూ వెళ్ళాలి. యీ పుస్తకం చదువుతున్నప్పుడు రచయిత్రి యీ రెండు పద్ధతులనూ, ఎప్పుడు ఏది బాగుంటుందో, యెప్పుడేది సౌలభ్యమో, అప్పుడుదాన్ని అనుసరిస్తూ రాసినట్టు తెలుస్తుంది.

సావిత్రిగారి అమ్మగారి పేరు నాగరత్న. యింట్లో అందరూ ముద్దుగా పిలిచే పేరు నాగయ్య. నాగరత్న సాదాసీదా గృహిణి. పదహైదేళ్ళకే పెళ్ళిచేసుకొని, తొమ్మిది మంది పిల్లల్ని కని, వాళ్ళ చదువు సంధ్యల్ని తనదైన మార్గంలో అభివృద్ధి చేసి, వాళ్ళందరికీ పెళ్ళిళ్ళు చేసి, అమ్మమ్మగా నాన్నమ్మగా, చివరకు మునిమనవల పెళ్ళిళ్ళు సైతం చేసి, నిండయిన జీవితాన్ని గడిపిన స్త్రీ. ఆమె రాజకీయ నాయకురాలు కాదు. కవయిత్రిగాదు. వుద్యోగాలు చేయలేదు. ఆమెపేరు యెప్పుడూ గానీ యే వార్తాపత్రికలోనూ వచ్చే అవకాశం లేదు. అటువంటి సాధారణ మహిళ జీవితంలో అద్భుతాలేముంటాయి? వొక జీవిత చరిత్ర రాయదగినంత సామాగ్రి అందులో ఏముంది? కూతురికి అందులో తొమ్మిదవ సంతానంగా పుట్టిన వ్యక్తికి తన తల్లి గొప్ప వీరమాతగా కనిపించడంలో ఆశ్చర్యమేమీలేదు. అయితే అ తల్లి జీవిత కథ యితరులకేం రుచిస్తుంది!

జీవితకథలూ, ఆత్మకథలూ రాయడం సులభంగాదు. తాను యెవరి జీవితం పుస్తకంగా రాస్తున్నారో ఆవ్యక్తి ఆ రచయితకు

గొప్ప వీరుడుగా, శూరుడుగానే కనిపిస్తాడు. అది తన ఆత్మీయ జీవితమైతే యిక చెప్పనే అక్కర్లేదు. కానీ అటువంటి పొగడ్తలకు పాఠకులు లొంగరు. పైగా అటువంటి జీవిత కథలకు విముఖుడై పోతాడు. ప్రతివ్యక్తీ తనను గొప్ప కథానాయకుడిగానే భావిస్తాడు. స్వోత్కర్షకూ, పరనిందకూ పూనుకునే ఆత్మకథలు చలామణీగావు. యీ రెండురకాల ప్రక్రియల విజయం ఆ రాస్తున్న వ్యక్తి స్వభావం పైనా, కంఠస్వరంపైనా ఆధారపడివుంటుంది. తెలుగులో కాశీయాత్రల చరిత్ర (ఏనుగుల వీరాస్వామి) హంపినుంచి హరప్పాదాకా( తిరుమల రామచంద్ర) శతపత్రము( గడియారం రామకృష్ణశర్మ) అనుభవాలూ జ్ఞాపకాలు ( శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి) వంటి గొప్ప ఆత్మకథలు తక్కువగావటానికి కారణమదే!

కోకాసావిత్రి తన తల్లి జీవితకథను కేవలం వొక స్త్రీగా మాత్రమే గాకుండా, ఆ కాలపు సాంఘిక చరిత్రగా రాయడంచేతే ఆ జీవిత కథకు సాహిత్య గౌరవం వచ్చింది. నాగరత్నమనే స్త్రీ పుట్టినప్పటి నుంచీ జేజెమ్మగా మారిన వృద్ధాప్యం కేవలం యింటిదీపంగా మాత్రమే జీవించిన వ్యక్తి. వొక గృహిణి జీవితకథ ఆ కాలపు సామాజిక చరిత్రగా మారడమే ఈ రచనలో ప్రత్యేకం.

యేడు మంది సంతానంలో వొకరీతిగా పుట్టిన స్త్రీకి ఆరోజుల్లో – 1920 ప్రాంతాల్లో చదువులెంత బాగా వంటబట్టినా, చదువులపైన ఆమెకెంత అక్కరున్నా, పైకి చదివే అవకాశాలుండేవి గావు. పదహైదేళ్ళకే పెళ్ళి. స్వంత మేనమామతోనే వివాహం, వెంటనే యేడాది రెండేళ్ళలో వరసగా తొమ్మిదిమంది పిల్లలు. భర్త రైల్వేలో స్టేషన్ మాస్టరు. తరచూ బదిలీలు, పిఠాపురంనుంచే జీవితం, బెంగాలుకూ, తరువాత ఒరిస్సాకు లాక్కెళ్ళిపోయింది. చివరకు బరంపురంలో కుదురుకున్నారు. ఆ వూరి భౌగోళిక పటాన్ని పరిచయం చేయడానికన్నట్లుగా పదేపదే అద్దె యిండ్లు మారారు. అక్కడే పిల్లలందరూ చదివారు. పెద్దా చిన్నా వుద్యోగాలు సంపాదించు కున్నారు. వాళ్ళ పెళ్ళిళ్ళయ్యాయి. యింటి పెద్ద కాలం చేశాడు. గృహిణి యిప్పుడు తొంభై సంవత్సరాల ముదివగ్గుగా మారింది. యెక్కడో కొండల్లో పుట్టి, సముద్రం కేసి సాగి నదిలా సహజమైన జీవితం, అయితే యీ ప్రయాణపు పొడవునా సాగిన జీవన గతులనంతా రచయిత్రి అలవోకగా పరిచయం చేస్తారు.

1930 ప్రాంతాల్లో పిఠాపురంలాంటి చిన్నపాటి బస్తీలో చదులెలావుండేవి? ఆ రోజుల్లో పెండ్లిండ్లెలా జరిగేవి? మధ్యతరగతి గృహస్థులు యెంత సంప్రదాయబద్ధంగా జీవించేవాళ్ళు? బెంగాల్ లో వుండే సంత్రగచ్చి వంటి చిన్న రైల్వే స్టేషను క్వార్టర్సులో బురద పాములతోబాటు సహజీవనం ఎలా చేసేవాళ్ళు? నవ మాసాలు మోశాకా స్త్రీలు ప్రసవసమయంలో యెలా తట్టుకొనేవాళ్ళు? చిన్న పిల్లలకు తల్లులెలాంటి ఆహారం పెట్టేవాళ్ళు? బరంపురంవంటి వూళ్ళో తెలుగు చదువులెలా సాగేవి? అప్పట్లో పెండ్లిళ్ళెలా కుదిర్చేవాళ్ళు? పెళ్లి యేర్పాట్లు యెలాసాగేవి? యిటువంటి అనేకానేక ప్రశ్నలకు ఈ పుస్తకంలో ఆసక్తి కరమైన సమాధానాలు దొరుకుతాయి.

తను పుట్టినప్పటినుంచి జరిగిన సంగతుల్ని తల్లి కూతురుకు యింత సవివరంగా చెప్పగలగడం సులభమైన పనికాదు. ఆ సంగతుల నింత సావధానంగా రాయడమూ సులభతరంగాదు. వివిధ సందర్భాల్లో ఆయాస్త్రీలు కట్టుకున్న చీరల రకాలూ, వాటి రంగుల తోబాటూ గుర్తుంచుకోవడం ఆషామాషీగాదు. అది కల్పితమైనా కావాలి, లేకపోతే చీరల పట్ల స్త్రీలకున్న మోజయినా కారణమవ్వాలి.

బంధుప్రేమలూ, చిన్నచిన్న మనస్పర్థలూ, పెద్ద పెద్ద తగాదాలూ యెవరి జీవితంలోనయినా వుండేవుంటాయి. అయితే అందరినీ వుదారంగా మన్నించి గౌరవించే వ్యక్తిత్వం గొప్పదని యీ పుస్తకం నిరూపిస్తుంది. బరంపురం, ఛత్రపురం, గోపాలపురం, కుర్దాగేటు వంటి ప్రదేశాల్లో అప్పుడూ,యిప్పుడూ తెలుగెంత ప్రాచుర్యంలో వుందో యీ పుస్తకం చదివితే అర్థమవుతుంది. కటక్, భువనేశ్వర్‌లలో గూడా తెలుగు హరికథలు, వుత్సవాలూ యెంత తరచుగా జరిగేవో తెలుస్తుంది.

ఆ రోజుల్లో రేడియోలూ, పోస్టలుశాఖ జన జీవితంలో ముఖ్య మైన భాగాల్లా వుండేవి. రైలు ప్రయాణాల్లో రిజర్వేష న్లుండేవికావు. యిండ్లచుట్టూ అన్నిరకాల పండ్లూ దొరికేవి. పల్లెటూళ్ళలో వుండే చిన్న చిన్న వైద్యులే సమయానికి ఆదుకునేవాళ్ళు, చదువులో రిజర్వేషన్లు రావడంతో నాగరత్నం గారి చిన్న పిల్లలకు మాత్రం కోరుకున్న చదువు చదివే అవకాశం పోయింది. అప్పట్లో రాజకీయా లపైనా, రాజకీయ నాయకులపైన గౌరవముండేది. తెలుగువాళ్ళే యెక్కువగా వున్న బరంపురం ప్రాంతాల్లో ఆంధ్రావాళ్ళు, ఒరిస్సా వాళ్ళూ అనే తేడా క్రమంగా మొదలవడమూ, స్పష్టంగా కనబడ సాగింది. పెళ్ళిళ్ళకోసం తెలుగువాళ్లంతా క్రమంగా తిరుపతికి రావడమూ అప్పుడే ప్రారంభమయ్యింది. సినిమా బలమైన మాధ్య మంగా మారిపోయింది. చదువుకున్న వాళ్ళకి మంచి ప్రభుత్వ ఉద్యోగాలు 1940 – 70 ప్రాంతాలలో సులభంగా వచ్చేవి.

కోకా సావిత్రిగారి పుస్తకం బరంపురం ప్రాంతపు మంచి వ్యావహారిక తెలుగు భాషనూ పరిచయం చేస్తుంది. కళింగాంధ్ర రచయితలూ,"వచ్చేసెరు" "పుట్టేసెరు" "వచ్చెరు" "వెళ్ళెరు" అని రాస్తారు. బరంపురం ప్రాంతంలో గూడా ఆయాక్రియల్ని పలుకు తున్నారని తెలిసింది.

దాదాపు ముప్పయేళ్ళక్రితం కులాతీత మతాతీత సమాజమొకటి యేర్పడబోతోందన్న ప్రగాఢ విశ్వాసం వుండేది. అదొక భ్రమ అని యిప్పుడు తేలిపోయింది. కులసంఘాలకూ, కులతత్వానికీ యిప్పుడు కాలమైపోయింది. కులాతీత సమాజస్థాపనకూ, కులతత్వానికి యిప్పుడు కాలమైపోయింది. కులాతీత సమాజస్థాపనకు కులమూలాలను తెలుసుకోవడం అనివార్యమని అప్పుడు భావించారు. కుల స్వభావాల అధ్యయన మెంత అవసరమో, కులాల గోడల్ని పగలగొట్టడం గూడా అంతే అవసరమని ఆలస్యంగా గుర్తించాము. కోకా సావిత్రిగారి పుస్తకం చదువుతున్నప్పుడు బహుశా వాళ్ళు బ్రాహ్మణులై వుంటారని ముందుగా తోచింది. నాగరత్నంగారికి "వేయిపడగలు" యిష్టమన్నప్పుడు ఆ మాట మరింత గట్టిపడింది. అయితే ఆకుటుంబంవాళ్ళు మాంసాహారులని తెలిశాకా సందేహం వచ్చింది. చివరకు వెలమ లని తెలిసింది. కానీ "నాగరత్నం" గారి కుటుంబం మరే యితర అగ్రకులానికి చెందిన వాళ్ళయినా వాళ్ళ జీవితాల్లో పెద్ద మార్పేమీ వుండే అవకాశం లేదు.

మొత్తానికి కోకా సావిత్రిగారి పుస్తకాన్ని అగ్రకులానికి చెందిన వొక మధ్యతరగతి మహిళ జీవితకథగా యిప్పుడు గుర్తించక తప్పడంలేదు. యీ జీవిత కథకు రచయిత్రి "మనసున మల్లెల మాలలు" అని పేరుపెట్టారు. దేవులపల్లి కృష్ణశాస్త్రిగారి సినిమా

పాటలాగే యిది మధురమైన జ్ఞాపకాల్ని పూపే పూల మాలికే!

-- -- --

రెండవ పుస్తకం నంబూరి పరిపూర్ణ గారి ఆత్మకథ. ఆమె యెనభై ఆరేళ్ళ వయస్సులో రాసిన ఆత్మకథ యిది.

నాగరత్నంగారి జీవితం సాధన, పట్టుదల అయితే పరిపూర్ణగారి జీవితం సాహసమూ, పోరాటమూ!

12వ శతాబ్దంలో రామానుజాచార్యుడు. అన్ని కులాలనూ వైష్ణవులుగా మార్చినప్పుడు, అలా మారిన కాపువర్గాలవాళ్ళను సాతానులని పిలిచినట్టే, మాల, మాదిగలను దాసరులని వ్యవహరించ సాగారు. నంబూరు పరిపూర్ణగారు మాల వైష్ణవ కుటుంబంలో పుట్టారు. అయితే అదేకాలంలో రాయలసీమలో వున్నంతగా దళితులు మరీ అంత దుర్భరమైన దారిద్ర్యంలో లేరు. పరిపూర్ణగారి తండ్రి నంబూరి లక్ష్మయ్య వుపాధ్యాయుడిగా పనిచేస్తూ నాటకాల్లో వేషాలు గూడ వేస్తూవుండేవారు. ఆ కుంటుంబంలో చాలా మంది కవులు, నాటక రచయితలు వుండేవారు. పరిపూర్ణగారి తల్లి లక్ష్మమ్మగారు కూడా భర్తకు సహాయ వుపాధ్యాయురాలిగా వుండేవారు. ఆరుమంది సంతానంలో పరిపూర్ణగారు అయిదవ బిడ్డ. బందారి గూడెం అనే ఆ మాలపల్లిలో పాతిక, ముప్పయి ఎకరాల భూములుండే కుటుం బాలు ఆరుండేవట. లక్ష్మయ్యగారు కట్టించుకున్న యిల్లు తాటాకుల పూరిల్లే అయినా, విశాలంగా సౌకర్యంగా వుండేదట.

మొదటి నుంచి పరిపూర్ణగారిది కమ్యూనిస్టు పార్టీకి అంకితమైన కుటుంబం. బాల్యంలో బడిలో 1941లో భక్త ప్రహ్లాద సినిమాలో చిన్న ప్రహ్లాదుని పాత్రకు యెన్నిక చేసుకున్నారు. చిత్రపు నారాయణ మూర్తి దర్శకత్వం వహించిన ఆ చిత్రంలో నటించడంకోసం మదరాసు వెళ్ళడం, అక్కడ ప్రసిద్ధ నటీనటులను కలవడం, పరిపూర్ణ గారి చిన్ననాటి ముచ్చట. కులాధిక్యత బాగా వుండే చిత్ర పరిశ్రమలో కులవివక్షను ఆమె చిన్నతనంలోనే గుర్తించాల్సి వచ్చింది.

చదువుకోసం పరిపూర్ణగారు మళ్ళీ మదరాసుకెళ్ళారు. కమ్యూ నిస్టు నాయకుడైన దర్శి చెంచయ్యగారనే వైశ్యుడు ఆయన భార్య సుభద్రమ్మగారూ పరిపూర్ణగారిని ఆ సమయంలో బాగా ఆదరించారు. అప్పుడామె చదువుకున్న శారదా బాలికోన్నతపాఠశాలలో ప్రతి తరగతి లోనూ, తెలుగు విద్యార్థినులకు ప్రత్యేకంగా వొక సెక్షన్ వుండేది.

అప్పటి మదరాసు రేడియోస్టేషన్‌లో తెలుగు ప్రసారాలు విరివిగా ప్రసారమయ్యేవి. ప్రొడక్షన్ యెగ్జిక్యూటివ్‌గా వుండిన బాలాంత్రపు రజనీకాంతారావు గారు పరిపూర్ణ గారిని చాలా నాటకాల్లో ప్రధాన పాత్రనిచ్చి ప్రోత్సహించారు. అప్పుడే ప్రముఖ కవి జాషువ తో గూడా ఆమెకు పరిచయం కలిగింది.

1944లో పరిపూర్ణగారు తన తల్లితోపాటు రాజమండ్రిలోని కమ్యూనిస్టు పార్టీ కార్యాలయానికి మకాం మార్చారు. ప్రముఖ నవలారచయిత మహీధర రామ్మోహనరావు గారి కుటుంబంతో పరి చయం కలిగింది. అప్పుడు వో పత్రికలో సీరియల్‌గా ప్రచురించ బడిన “వేయిపడగలు” కులవ్యవస్థనూ, మతాధిపత్యాన్ని ప్రోత్సహిస్తూ అభ్యుదయ నిరోధకంగావుందని విమర్శించిన మహీధర రామ్మోహన రావుగారి ప్రభావాన్ని పరిపూర్ణగారు గుర్తుచేసుకుంటారు. అప్పుడే చలం రచనల్ని జాగ్రత్తగా చదివారు. “డిటెన్షన్” ప్రక్రియను రద్దు చేయించడం కోసం జరిగిన విద్యార్థుల పోరాటంలో ఆమెది ముఖ్య పాత్ర. క్రమంగా కమ్యూనిస్టు నాయకుందరూ ఆమెను మంచి కార్యకర్తగా గుర్తించారు.

యింటర్మీడియేట్ చదువులు పరిపూర్ణగారిని కాకినాడ పి.ఆర్ కాలేజీకి చేర్చాయి. బ్రహ్మసమాజాన్ని పరిచయం చేశాయి. అప్పటి పి.ఆర్ కాలేజీ విద్యార్థి ఫెడరేషన్ కార్యక్రమాల స్థావరం, పరిపూర్ణగారు జిల్లా ఫెడరేషన్ కార్యవర్గ సభ్యురాలుగా యెన్నికయ్యారు. అక్కడే ఆమెకు అనాటి ప్రముఖ కమ్యూనిస్టు యువనాయకుడు దాసరి నాగ భూషణరావు గారు పరిచయమయ్యారు. విద్యార్థులంతా ఆరాధించే విద్యార్థి నాయకుడ్ని పెళ్ళాడ్డమూ, కుల అంతరాలను తగ్గించే వర్ణాం తర వివాహానికి పూనుకోవడం ఆమెకు చాలా గొప్పగా తోచింది. వాళ్ళ పెళ్లి దాసరి నాగభూషణరావు గారు అజ్ఞాతంలో వున్నప్పుడే జరిగింది. పోలీసులూ, విచారణలూ, జైళ్ళు, తెలిసివచ్చాయి. అది కమ్యూనిస్టుపార్టీ నిషేధానికి గురైన కాలం కార్యకర్తలు చాలా మంది అరెస్టులవుతూ తీవ్ర శిక్షలకు గురికావడం జరుగుతున్న సమయం. ప్రజానాట్యమండలి వాళ్ళందరి లాగే పరిపూర్ణగారు కూడా మదరా సుకు మకాం మార్చేశారు. వాళ్ళ నాటకాల్లో వేషాలు కూడా వేశారు. అప్పటికే ఆమెకు ముగ్గురు పిల్లలు పుట్టారు. పార్టీకార్యకలాపాల్లో మునిగిన దాసరి నాగభూషణరావు గారు పిల్లల్ని, భార్యనూ పోషించాల్సిన బాధ్యత నెప్పుడూ పట్టించుకోలేదు. ఆయన తన పిల్లల్ని గూడా దగ్గరకి రానిచ్చేవారు గాదు. కమ్యూనిస్టు దృక్పథమూ, అభ్యుదయ వాదమూ గూడా పార్టీలో అంతగా మమేకమైన వ్యక్తిలో అంతర్గతంగా కులవివక్షను పోగొట్టలేక పోవడం వొక విస్పష్టమైన సామాజికసత్యం. దాసరిగారికి తమపెళ్ళి కంటే అయిదేళ్ళ ముందే మరోపెళ్ళి జరిగిందనీ, అయితే అది అప్పుడు కలిసి రాలేదనీ ఆలస్యంగా తెలిసింది. క్రమంగా ఆయన తన తొలి వివాహపు భార్యకు దగ్గరై, పరిపూర్ణగారితో దూరం కాసాగారు

కష్టాలు పెరిగేకొద్దీ పరిపూర్ణగారిలో పట్టుదలా పెరిగింది. ‘బాలవిహార్’లో వుపాధ్యాయురాలిగా వుద్యోగం దొరికింది. ఆమె తల్లి, తండ్రి, తోబుట్టినవాళ్లూ వాళ్ళకు వీలయినంతగా తోడ్పాటు నందించారు. వుద్యోగంలో కష్టపడి పనిచేస్తూ ఆమె మహిళా సోషల్ ఎడ్యుకేషన్‌లో ఆర్గనైజర్ అనే పదవికి చేరారు. అప్పటి రాజధాని హైదరాబాదుకు చేరి 1989 లో మహిళా సంక్షేమశాఖలో ఉన్నతో ద్యోగినిగా ఆమె పదవీ విరమణ చేశారు.

పరిపూర్ణగారు పిల్లల్ని బాగా చదివించాలనుకున్నారు. అందుకు తగినట్లుగా వాళ్ళూ కష్టపడి స్వయం శక్తితో యెదిగి వచ్చారు. పెద్దబ్బాయి దాసరి అమరేంద్ర ‘బెల్’ కంపెనీలో పెద్ద ఉద్యోగం చేసి రిటయిరయ్యారు. రెండో అబ్బాయి శైలేంద్ర ఎం.బీ.యె చదివి పెద్ద వుద్యోగాలు చేసి తన అరవైయవ సంవత్సరంలో పదవీ విరమణ చేశారు. వీళిద్దరి కంటే పెద్ద, మొదటి సంతానం, దాసరి శిరీష బ్యాంకులో వుద్యోగం చేసి పదవీ విరమణ చేసి తర్వాత హైదరా బాదులో “ఆలంబన” అనే స్వచ్ఛంద సంస్థను పెట్టి సామాజిక సేవలో నిమగ్నమయ్యారు.

పరిపూర్ణగారి కుటుంబానికంతా తొలినుంచీ సంస్కృతి సాహి త్యాలపట్ల మక్కువ ఎక్కువ. అమరేంద్రగారు,. శిరీషగారు, రచయిత

*(తరువాయి 40 వపేజీ చూడండి)*




# 3. మానవీయత- మనిషిలోని శాస్త్రీయత

ఒకసారి బుద్ధుని దగ్గరకు వచ్చి 'భగవాన్! మీరు సర్వజ్ఞులని విన్నాం. అందుకే మీదగ్గరకు వచ్చాం' అంటారు కొందరు.

'నేను సర్వజ్ఞుణ్ణికాను. ఈ ప్రపంచంలో 'సర్వజ్ఞుడు' అనేవాడు ఉండదు' అని చెప్తాడు.

**అందుకే .... ఆయన కారణ సమూహవాదాన్ని ప్రవచించాడు. ఈ కారణ సమూహవాదం- అటు కర్తల్ని, సృష్టికర్తల్ని ప్రక్కకు తోసేస్తుంది. జ్ఞానానికి సమాజాన్ని, ప్రపంచ సృష్టికి పరిణామాన్ని ముందుకు తీసుకొస్తుంది.**

అందులో భాగంగా బుద్ధుడు కర్తకు కాకుండా 'కర్మ'కు పెద్దపీట వేశాడు. భౌతికంగా ఆలోచిస్తే బుద్ధుడు చెప్పిన 'కర్మ' ప్రాకృతిక సహజ లక్షణం. 'కర్మ'ల్ని బట్టే కార్యాలు ఉంటాయి.

ఈ కర్మగురించి మాట్లాడుకోబోయేముందు కొన్ని విషయాల గురించి చెప్పుకోవాలి. అలా చెప్పుకుంటే 'కర్మ' అనేది తేలిగ్గా అవగతం అవుతుంది.

ఉదాహరణకి-

బోర్లించిన కుండమీద నీళ్ళు నిలుస్తాయా? నిలువవు కదా! అదే సరిగ నిలబెట్టిన కుండలో నిలుస్తాయా? నిలుస్తాయి. ఎందుకని?

బోర్లించిన కుండ ఎత్తైన దిబ్బలాంటిది. సరిగా నిలబెట్టిన కుండ లోతైన గుంటలాంటిది. నీళ్ళు గుంటలోనే ఎందుకు స్థిరంగా ఉంటాయి?

అంటే...

నీరు ఏర్పడటానికి కారణమైన అణువుల బంధం (హైడ్రోజన్, ఆక్సిజన్) ఘనపదార్థాలంత బలమైంది కాదు. వాయుపదార్థాలంత బలహీనమైంది కాదు. కాబట్టి అది అస్థిర బంధం.

మనపైన వేలమీటర్ల ఎత్తులో ఉన్నగాలి అంతా మన మీద తన పీడనాన్ని(వత్తిడిని) కల్గిస్తుంది. అలాగే నీటి మీద కూడా కల్గిస్తుంది. కాబట్టి పీడనం వల్ల, పైనుండి వచ్చిన వత్తిడివల్ల అస్థిరమైన నీరు కదిలి పల్లానికి పోతుంది.

నీరే కాదు, గాలికూడా అంతే...

పీడన వ్యత్యాసాల వల్లే గాలి కదులుతుంది. అధిక పీడనం నుండి అల్పపీడనానికి వచ్చిపడుతుంది.

నీటి మీద పీడనం లేకపోతే నీరు ప్రవహించదు.

'నీరు పల్లమెరుగు' అంటారు. కానీ, పీడనం లేకపోతే నీరు పల్లానికి రాదు.

సెలైన్ బాటిల్ పైన సూదితో బెజ్జం పెట్టేది ఇందుకే.... బైటగాలి సీసాలోకి వెళ్ళి దానిలోని ద్రవాన్ని క్రిందకి నెదుతుంది. అప్పుడు నీరు బాటిల్ నుండి బైటకు వస్తుంది.

మీ దగ్గర వాటర్ బాటిల్ ఉందికదా!

దాన్నిండా నీరు తీసుకోండి. మూత గట్టిగా బిగించండి. దాని క్రింద సూదితో బెజ్జం కొట్టండి. నీరు కారుతుందా? లేదా? ఒక్క బొట్టుకూడా కారదు. ఇప్పుడు బాటిల్ పైన మూతను విప్పండి. విప్పగానే బైటగాలి దానిలోకి పోతుంది. అప్పుడు ఆ బెజ్జం నుండి నీరు కారతాయి.

అందుకే.... దిబ్బలాంటి వస్తువుమీద నీరు పోస్తే గాలి పీడనం వల్ల అన్ని వైపులకు కారిపోతాయి. గుంటలాంటి వస్తువులో గాలి పీడనం పనిచేసినా అటు ఇటూ చెదిరి పోవు కాబట్టి నీరు స్థిరంగా ఉంటాయి.

ఇది ఒక భౌతిక నియమం. సత్యం.

ఆదిమానవుడైనా, ఆధునిక మానవుడైనా 'ద్రోణి'లాంటి వస్తువు లోనే ద్రవాల్ని నిలువబెట్టగలడు.

సముద్రాలు, చెరువులు, గుంటలు....అన్నీ ద్రోణులే. మనం మొదట్లో చెప్పుకున్న ఆకు దొనెలు, సొరకాయ బూరలు, మనిషి పుర్రెలు అన్నీ 'ద్రోణు'లే కాబట్టి వాటిలో నీరు తెచ్చుకోగలిగాడు.

కాబట్టి ఆ తర్వాత, తాను సొంతగా తయారు చేసే 'కుండ' కూడా 'ద్రోణి' లాగానో, దొన్నె ఆకారంలోనో ఉండాలి. అలాగే తయారు చేయాలి తప్ప, పిడకలాగానో, పుడకలాగానో, ముద్ద లాగానో, చలిమిడి సుద్దలాగానో కుండను తయారు చేస్తే నీరు నిలువ జేయలేం- అనే అవగాహనే 'కుండ నిర్మాణంలో' కీలకం అవుతుంది.

'దొనెలాంటి వస్తునిర్మాణమే నీటి నిలుపుదలకు సాధనం' అనేది ప్రాకృతిక ధర్మం. అదే ప్రకృతిలోని 'కర్మ'.

'కర్మ' అనేది స్వాభావిక ధర్మం. సహజ ధర్మం. ఈ ధర్మాల్ని బట్టే లేదా 'కర్మ'ల్ని బట్టే కర్తృత్వాలుంటాయి. కర్తలూ ఉంటారు. కర్మలకు భిన్నమైన కర్తలూ ఉంటారు. కర్తృత్వాలుండవు.

అంటే...ప్రాకృతిక స్వాభావిక ధర్మానికి భిన్నంగా ఏ 'కర్తా' ఏ 'కర్తృత్వాన్ని' నెరపలేడు. అంటే 'కర్తనే' నిర్దేశించే ధర్మం ఉంటుందన్నమాట. కుమ్మరి-కుండను చేస్తాడు. నిజమే. కానీ, కుమ్మరి కంటే, అతను తయారు చేసిన కుండ కంటే ముందే నీరు, మట్టి ఉంటాయి కదా! నీరు, మట్టి లేకుండా కుమ్మరి కుండను చేయగలడా?



అలాగే ఒక వేళ దేవుడే సృష్టికర్త అనుకుంటే అతనికంటే ముందే సృష్టికి మూలమైన ధర్మాలు, పదార్థాలు ఉంటాయి గదా! అప్పుడు ఈ సృష్టికి మూలం ఆ పదార్థాలో లేక ధర్మాలో అవుతాయి గాని, దేవుడు కాలేడుగదా?

ఎలాచూసినా దేవుని ఉనికి తర్కానికి నిలబడదు. కేవలం నమ్మకానికే నిలబడుతుంది.

ఇలా బుద్ధుడు తన కర్మ సిద్ధాంతం ద్వారా, సృష్టికర్తను, కర్తల్ని త్రోసిపారేశాడు.

ఈ జీవసృష్టిలో జీవం, జీవులకు అవయవాలు, జ్ఞానం అన్నీ ప్రాకృతిక అనుభవం నుండి పొంది పుచ్చుకున్నవే.

ఇలా చూస్తే....

**మానవ సహజ 'కర్మ' బలం ఏమిటి?**

ఈ సృష్టిలో ఒక్కొక్క జీవికి ఒక్కొక్క ధర్మం ఉంది. ఒక్కొక్క స్వభావం ఉంది. ఒక్కొక్క స్థాయి పరిజ్ఞానం ఉంది. ఇవ్వన్నీ ఈ సృష్టిలోని భౌతిక, రసాయనిక నియమాలకి భిన్నమైనవి కావు.

గుర్తుంచుకోవడం, జ్ఞాపకం పెట్టుకోవడం కేవలం మానవ గుణమో, లేదా ఇతర జీవుల గుణమో కాదు. అది ఈ విశ్వ లక్ష ణాల్లో ఒక లక్షణం. గత కాలపు అనుభవాల్ని 'కార్బన్' అనే ధాతువు నిక్షిప్తం చేస్తుంది. 'సిలాకాన్' కూడా కొద్దిగా ఆపని చేస్తుంది. మాటల్ని నిక్షిప్తం చేసే టేప్‌లు, కాంతిని నిక్షిప్తంచేసే ఫోటో ఫిల్మ్‌లు, గ్రామ్‌ఫోన్ రికార్డులు – ఇవ్వన్నీ కార్బన్ వస్తువులే. కంప్యూటర్ చిప్‌ల నిర్మాణానికి –ఈ నిక్షిప్త ప్రక్రియ జ్ఞాపకానికి, జ్ఞానానికీ మూలం.

అంటే– ప్రాకృతిక ధర్మానికి భిన్నమైన ధర్మాలేవీ ఈ విశ్వంలో ఉండవు. అవి కొన్ని ఒకచోట ఉండొచ్చు. ఇంకొన్ని మరోచోట ఉండొచ్చు.

జ్ఞానం లాగనే–

నిరంతరం సంఘర్షిస్తూ కలసి ఒక సంఘంగా ఉండడం కూడా ఈ విశ్వనిర్మాణ ప్రధాన లక్షణం. గ్రహ నక్షత్రాలు స్వతంత్రంగా ఉంటూనే కొన్ని కొన్ని కలసి కూటములుగా, మరలా ఈ కూటములు కలసి ఒక మహాకూటమిగా..ఇలా అన్నీ ఒక క్రమ నిర్మాణంలో కొనసాగడం ఈ విశ్వనిర్మాణ విశిష్ట ప్రక్రియ. ఇలా, ఒకేధర్మాలు ఎక్కువగా ఉన్నవి కలసి ఒక వలయంలో ఉంటాయి. ఒక సమూహంగా ఉంటాయి. అదే జీవుల్లో అయితే, ఇచ్చిపుచ్చు కోడాలూ, ఒకరి పని ఒకరు పంచుకోడాలు ఉంటాయి. వైరుధ్యాలతో ఉంటూ, స్వతంత్రతని ప్రదర్శిస్తూ, సహజీవనం సాగించడం జీవుల ప్రాథమిక లక్షణం. ప్రాకృతిక లక్షణం.

ఈ లక్షణం వల్లే ఏక కణజీవులు బహుకణజీవులుగా మారాయి.

బహుకణజీవుల్లో సమూహాలూ, సమాజాలూ ఏర్పడ్డాయి. సమాజాలుగా ఏర్పడ్డ జీవుల్లో సహజీవనం సాగించడం మరింత బలీయంగా ఉంటుంది. ఈ సహజీవనం బాగా బలపడి మానవ సమాజంగా మారింది. ఈ మొత్తం సామాజిక నిర్మాణంలో 'కలసి జీవించడం' అనేది ఒక్కటే ప్రధానంగా ఉంటుంది.

ఈ 'సహజీవనం' అనేది జీవుల స్వాభావిక లక్షణం.

మనిషి జీవుల్లో జీవే అయినా, జంతువు కాదు. పశువు కాదు.

మరి, మనిషి ఎందుకయ్యాడు? ఎప్పుడయ్యాడు?

మనిషి కోతినుండి వచ్చాడు. తోకలేని చింపాజీలనుండి వచ్చాడు. చింపాజీల తర్వాత ఆస్ట్రలోపిథికస్‌లు ఉన్నాయి. అవి అన్నీ మనిషి పూర్వీకులే. కానీ వాటి తర్వాత వచ్చిన వర్గాన్ని **హోమో ఎబిలిస్** అంటారు. హోమో అంటే 'మానవ' అని అర్థం. అంతకు ముందు వాటిని 'వానరాలే' అంటారు. మరి వీటినే ఎందుకు మానవ (హోమో) అన్నారు–? అంటే..

అంతకు ముందున్న జీవులు సమూహాలుగా ఉన్నప్పటికీ, ఒక

దాన్ని మరొకటి అంటిపెట్టుకునే ఉన్నప్పటికి, ఆదుకునేది కాదు.

ఏదైనా ప్రమాదవశానో, మరో జంతువు దాడి చేయడంవల్లో తీవ్రంగా దెబ్బతింటే మిగిలిన సమూహంలో, జీవులు దానిగురించి పట్టించుకోవు. దానికి ఆధారంగా నిలబడవు. ఆహారాన్ని తెచ్చిపెట్టవు. తల్లి జీవులు పిల్లలకి కొంత కాలం ఆహారాన్ని తెచ్చిపెడతాయి తప్ప, అవి పెద్దయ్యాక ఏ జీవీ మరో జీవికి ఆహారం తెచ్చిపెట్టదు. అంటే తమ శ్రమను పంచవు.

ఇలా అసహాయ జీవుల్ని ఆదుకోవడం, వాటికి సహాయం అందించడం, తమ శ్రమను పంచడం వంటి సామాజిక బాధ్యతను తీసుకున్న మొదటి జీవుల్ని 'హోమో' అంటారు. అలాంటి జాతి 20 లక్షల సం॥రాల క్రితం ఆఫ్రికాలో కెన్యా దేశంలో అవతరించింది.

ఇలాంటి సహాయాన్నే మనం 'మానవీయత' అంటాం. అలాంటి సమూహాన్నే మానవులు అంటాం. అంటే..మానవుని స్వాభావిక లక్షణం 'మానవీయత' అన్నమాట.

**ప్రపంచంలో ఎందరెందరో తత్త్వవేత్తలు 'మానవుడు పుట్టుకతో పశువు' అన్నారు. కానీ మనిషి పుట్టుకతో మానవీయుడు. దయ, ప్రేమ, కరుణ, మానవుని సహజ ధర్మాలు. కాబట్టి మానవుడు మంచి పనులు చేసినప్పుడే సంతోష పడతాడు. దుఃఖరహితుడవుతాడు. తన సహజగుణాలైన దయ, ప్రేమ, కరుణ, జాలి మొదలైన గుణాలకి భిన్నంగా వ్యవహరిస్తే దుఃఖంలో పడిమునిగిపోతాడు. మనిషి దుః ఖం నుండి బైటపడాలంటే అతనిని స్వాభావికంగా దుఃఖం నుండి దూరంచేసే మానవీయపనులే చేయాలి. అంటే కుశల కర్మలు చేయాలి. మంచి పనులు చేయాలి- అని మొదటి సారిగా మానవుని సహజ కర్మల స్వభావాన్ని గుర్తెరిగి ఎరుక పరచినవాడు బుద్ధుడే. నీరూ, గాలీ అల్పపీడనాలవైపు కదలడం ఎంతటి స్వాభావికమో- 'మంచిగా' బ్రతకడం మనుషులకు అంతే స్వాభావికం అనే సత్యావిష్కరణచేసినవాడు బుద్ధుడు.**

అందుకే....

మానవ కర్మలన్నీ ఈ స్వాభావిక కర్మకి అనుబంధంగానే ఉండాలి. ఉంటాయి. ఎప్పుడైనా, అలా లేకపోతే... ఆ కర్మలు మనల్ని దుఃఖానికి లోనుచేస్తాయి. స్వభావానికి విరుద్ధంగా జరిగినప్పుడు పుట్టే రసాయనిక మార్పులు దుఃఖాన్ని రేపుతాయి.

అందుకే..... దానం చేసినవాడు పొందిన ఆనందం, దొంగ తనం చేసిన వాడు పొందలేడు. ప్రాణం పోసినవాడు పొందిన సంతోషం ప్రాణం తీసినవాడు పొందలేడు.

మానవుని స్వాభావిక లక్షణాల్ని ఇంత శాస్త్రీయంగా ఆవిష్క రించిన బుద్ధుని భావజాలం, ఆయన చెప్పిన ప్రబోధాలు ఇన్నేళ్ళైనా నిటారుగా నిలబడే ఉన్నాయంటే కారణం ఒకటే.

ఆయన ఆవిష్కరించిన 'ధర్మం'లోని శాస్త్రీయ అంశం ఏమిటంటే 'మనసు'. మనసు ఏర్పడ్డ జీవులు మానవులే. మంచీ చెడూ, కీర్తి, అపకీర్తి.... ఇలాంటి వాటిని పట్టించుకొనే కేంద్రం, పట్టించుకుని తదనుగుణంగా స్పందించేది మనలో ఉన్న మనస్సు మాత్రమే. 'మనిషిని, మనస్సుని' కేంద్రంగా చేసుకొని తన మొత్తం సిద్ధాంతాన్ని రూపొందించుకున్నాడు బుద్ధుడు. ఆయన స్వాభావిక ధర్మానికి భిన్నంగా, మనిషికి దూరంగా, మనసులోతులు చూడకుండా ఏ ప్రబోధం చేయలేదు. అందుకే మనోవైజ్ఞానిక శాస్త్రానికి ఆద్యుడయ్యాడు.

అ

కవిత

## అమృతభాష

-వల్లూరుపల్లి లక్ష్మి

**వం**దేమాతరమ్మంటూ నినదించి,
దాస్య శృంఖలాలు ఛేదించి,
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సాధించి,
షష్టిపూర్తి సంబరాలు జరుపుకున్నాం!

పరాయిభాష ఆంగ్లానికి పట్టంకట్టి
ఆంగ్లమాధ్యమాలలో విద్యను వెలగబెట్టి,
తెలుగును పూర్తిగా ప్రక్కకు తొలగద్రోచి,
మాతృభాషను చేశాము మృతభాషగా!

ఆంగ్లపదాలతో కమ్మని తెలుగును నింపి
అదో విచిత్ర సంకరభాషగ చేశాము!
అదే నాగరికత అన్న అపోహతో
ఆత్మవంచన చేసుకుంటున్నాం!

చిన్నాపెద్దా ప్రతిఒక్కరం
ఆలోచించవలసిన అవసరమిది!
ఆత్మగౌరవ రక్షణ సమయమిది!

భాగవతం అధ్యయనం చేసిన ఆంగ్లదొర
బ్రౌన్‌మహాశయుడు ఆదర్శం మనకు!
జవం జీవం మనభాషకు అందించి
మందార మకరందాల మన భాషను
అమృత భాషగ తీర్చిదిద్దుకుందాం!

## మెక్సికోలో ప్రాంతీయ భాషలను కాపాడుతున్న మహిళలు

గేబ్రియేలా బదిలో మెక్సికోలో నివసిస్తున్న యువతి. ఆమె గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మెరిదా, యుకతాన్ లాంటి ప్రాంతాలకు ఒక పదేళ్ళ క్రితం వెళ్ళినపుడు అక్కడి పిల్లలు ప్రాంతీయ మాయన్ భాషలో మాట్లాడేందుకు సిగ్గుపడటాన్ని గమనించింది. తరువాత ఆమెకు అర్థమయింది ఏమిటంటే భవిష్యత్తుపై భయం, సమాజంలో వెంకబడిపోతామనే భయంతో అక్కడి పిల్లల తల్లిదండ్రులు పిల్లలకు మాయన్ లాంటి ప్రాంతీయ భాషలను అమ్మనుడులను నేర్పించడం మానేసారని తెలిసింది.

మెక్సికోలో కనుమరుగవుతున్న 68 ప్రాంతీయ అమ్మనుడులను కాపాడేందుకు బదిలో ఒక స్వచ్ఛంద సంస్థను నడుపుతున్నారు. "68 voces" పేరుతో ఒక వలగూడు ద్వారా దృశ్యశ్రవ్యకాలను రూపొందించి ప్రచురిస్తోంది. ఇవి ఆ అచ్చంగా అమ్మనుడులలో ప్రాంతీయ ప్రజల గొంతుకలను నిక్షిప్తం చేసుకుని ఉన్నాయి. ఈ నాలుగేళ్ళలో గేబ్రియేలా 68 లో 20 భాషలను నిక్షిప్తం చేసుకోవడం పూర్తి చేసుకున్నారు. ఈ ఏడాది చివరికి మరో 15 భాషలను నిక్షిప్తం చేయడం ఈమె ధ్యేయం. ఈమె కృషి వలన ఇప్పుడు పిల్లలు అమ్మనుడిలో చదువును ఇష్టపడుతున్నారు.



అ

2015లో డెట్రాయిట్(అమెరికా)లో జరిగిన 'తానా' సభల సందర్భంగా వారి తరఫున డెట్రాయిట్ తెలుగు సాహితీసంఘం(డి.టి.ఎస్.సి) నిర్వహించిన రచనల పోటీలో మొదటిబహుమతి పొందిన రచన.

# తెలుగు సాహిత్యం లో స్త్రీ పాత్రల స్వభావ పరిణామం

-చెరుకుపల్లి లావణ్య



*"పుట్టింది వైజాగ్‌లో, పెరిగింది ఏలూరులో. చదివింది వ్యవసాయ పరిశోధన శాస్త్రం. భారతీయ నూనె గింజల పరిశోధనాసంస్థలో ప్రధాన శాస్త్రవేత్తగా, "ఏమీ లేని చోట ఆముదమే మహావృక్షమని" నమ్మి, గత ఇరవై ఏళ్ళుగా ఆముదం పంటలో కొంతవరకు అభివృద్ధి సాధించడం ఒక ఎత్తు అయితే, ఊహ తెలిసినప్పటి నుంచి, పుస్తక ప్రపంచంలో బ్రతికినా, ఏనాడూ కలం పట్టుకోక పోయినా, మొదటి ప్రయత్నంగా చేసిన ఈ సమీక్షకి మొదటి బహుమతి రావడం మరొక ఎత్తు. మరిచిపోయిన చాల మంచి రచనలు, స్త్రీ పాత్రలు, రచయితలు, రచయిత్రులు, ఈ సమీక్ష పంపిన క్షణం నుంచి గుర్తు వచ్చినప్పుడల్లా-ఈ సమీక్ష అసంపూర్ణంగా అనిపిస్తోంది"-రచయిత్రి*

**ఈ** వ్యాస రచన పోటీ గురించి తెలియగానే, అప్పుడప్పుడే పుస్తక ప్రపంచం లోకి తొంగి చూసి చింగీజ్ ఐతొమాతొవ్ "జమిల్య", మాక్సిం గోర్కి "అమ్మ" దగ్గర నుంచి మొదలు పెట్టి, రంగనాయకమ్మ పుస్తకాలలో మునిగి తేలి, కాలక్షేపానికి సులోచనారాణి .. ఏవీ వదిలిపెట్టకుండా చివరికి చలం "రాజేశ్వరి"తో మైదానాల్లో విహరించిన రోజుల లోంచి నాకు అర్థమైన, తెలిసిన "స్త్రీ", అప్పటికి ఇప్పటికి అలాగే ఉందా అని ఆలోచిస్తే...కాలానికి అనువుగా మారని మనిషి ఉంటాడా?

ఏ కథలోనో గుర్తు లేదు కాని, రంగనాయకమ్మ కథలో ఒక పాత్ర -స్కూల్ లో ఒక పోటీ "స్త్రీకి విద్య అవసరమా కాదా" అన్న డిబేట్‌లో "స్త్రీ గాలి పీల్చడం అవసరమా కాదా" అని ఆవేశంగా మాట్లాడిన ఒక సన్నివేశం నా కళ్ళ ముందు మెదులుతూ వుంటుంది. ఆమె మాట్లాడటం ఆపగానే, చాల మంది గబగబా గాలి పీల్చడం మొదలు పెట్టిన ఆ దృశ్యం ఊహించుకుని చాలసేపు నవ్వినా, ఎన్నో ప్రశ్నలు లేవనెత్తిన ఒక సాహిత్య ప్రక్రియగా ఇప్పటికీకి సజీవంగా వుంది.

ఏ కళ అయినా, సమకాలీన సమాజం మీద అవగాహన పెంచడానికో, లోటుపాట్లని కళాకారుడి దృష్టిలో నుంచి భూతద్దం పెట్టడమో, ధిక్కార స్వరం వినిపించడానికో లేదా ముందు చూపుతో ఉహించ గలగడమో ..ఇవేమీ కాకపోతే కళ కళ కోసమే అన్నట్లుగా, కళనే జీవితంగా మార్చుకున్న సంగీత, నాట్య, చిత్రకారులకి భిన్నంగా సాహిత్యం ఎప్పుడూ ప్రజలకి దూరంగా మనలేదు. పాఠకులని దృష్టిలో పెట్టుకుని, కొన్ని పరిమితులకి లోబడి, తమదైన శైలిలో "ఒక కొత్త ప్రపంచాన్ని" సృష్టిస్తూనే ఉన్నారు రచయితలు. ఆ కొత్త ప్రపంచంలో "పాత్రలు", మరీ ముఖ్యంగా స్త్రీ పాత్రల స్వభావాన్ని అధ్యయనం చేయాలంటే ఒక జీవిత కాలం సరిపోదు.

**మొదటి దశ**

స్త్రీ పాత్రలలో మార్పుల గురించిన చర్చకి ప్రామాణికం నాకు ఎప్పటికీ వాల్మీకి సృష్టించిన సీతే! సీత అంటే-వినయం, విధేయత, భర్త ఆజ్ఞలకి కట్టుబడి, కష్ట సుఖాలలో తోడూ నీడగా నిలిచే ఆదర్శ వనిత. అవమానాన్ని తట్టుకోలేక అగ్నిపరీక్ష చేసుకున్న అభిమానవతి. అటువంటి సీత పాత్ర నుంచి ఇప్పటివరకు ఎన్నో స్త్రీ పాత్రలు కాలానికి అనుగుణంగా, మారుతూ వస్తూనే వున్నయి. కాని, ప్రాథమికంగా స్త్రీ పాత్రలకి ఉండాల్సిన లక్షణాలూ, పరిమితులని దృష్టిలో పెట్టుకునే మొదట్లో సాహిత్యం సాగింది. దీనికి భిన్నంగా, వితంతు ఉద్ధరణ ఒక ఉద్యమంలాగ వెల్లువెత్తుతున్న సమయంలో, 1892 లో గురజాడ అప్పారావు ప్రాణం పోసిన మధురవాణి -తెలివి తేటలు, చురుకుతనంతో పాటు, సమయానుకూలంగా వ్యవహరిస్తూ, అందరిని తన కనుసన్నలలో నడిపిస్తూ, కథని ఒక కొలిక్కి తెచ్చిన "జాణ" గా చిత్రీకరించినా, నిజానికి భవిష్యత్ "స్త్రీ"గా, చిరస్మరణీయంగా నిలిచిపోవాల్సిన పాత్ర. ఆదర్శం ముసుగులో సీత, అమాయకత్వం లో "బుచ్చెమ్మ" కష్టాలు పాలవుతారు కాని, లోకం పోకడలు తెలిసిన స్త్రీగా "మధుర వాణి" ఎప్పటికీకి ఓడిపోదు.

**రెండవ దశ**

ఇంక, అభ్యుదయ సాహిత్యం విషయానికి వస్తే- స్వతంత్ర పోరాట స్ఫూర్తితో, నాలుగు గోడలు దాటి బయటికి వచ్చి, స్త్రీలు కూడా తమ వంతు సాయం చేస్తూ, చైతన్యం ఊపిరి పోసుకుంటున్న వేళ, రాజకీయ నేపథ్యంలో, ఉప్పల లక్ష్మణరావు - ఒక వింత ప్రయోగంతో "అతడు-ఆమె" లని ఆవిష్కరించేరు. "ఆమె" నిజాయితీతో, తన మనసులోని ప్రతి ఆలోచనలని, మనతో పంచుకుంటూ, పదును పెట్టుకుంటూ "శాంతం"గ మన కళ్ళముందే రూపు దిద్దుకుంటుంది. రాజకీయ విశ్లేషణలు చేయగలిగిన ఆధునిక వనిత. చదువుకుని, తనకంటూ ఒక వ్యక్తిత్వాన్ని ఏర్పరచుకుని, సమాజం గురించిన అవగాహనతో పెరిగిన "శాంతం" బహుశః ఈ తరానికి ప్రతీకగా నిలుస్తుంది. అప్పటికి నవ్వుకున్నా, ఇప్పటికీ ఆలోచించదగ్గ విషయం -శాంతం అతడిని ముద్దు పెట్టుకున్న తర్వాత, ఎంతో భయపడి, వైద్యం చదువుకుంటున్న తన స్నేహితురాలిని పిలిచి "ముద్దు పెట్టుకోవడం వల్ల ఏమన్నా అవుతుందా" అని అడుగుతుంది. అంతటి అజ్ఞానమా అనిపిస్తుంది కాని ఇప్పటికీ కొన్ని విషయాలు బహిరం

గంగా మాట్లాడు కోవడమే నిషేధం అయిన సమాజం. అందులో స్త్రీకి వున్న లక్ష్మణరేఖలు, పరిమితులు, ఆంక్షలు లెక్కలేనన్ని.

ఇలాంటి పరిస్థితుల్లో చలం ఒక ప్రళయ వేగంతో, మెరుపు లాగ, తనదైన శైలిలో "స్త్రీ" పాత్రలని తెలుగు సాహిత్య లోకంలో మెరిపించేడు. మనసులకి హత్తుకునే శైలితో, ఏ ముసుగులు లేకుండా నిర్భయంగా సంచరించగల "స్త్రీ" పాత్రలని తెలుగు పాఠకులు విస్మయంతో, భయంతోనే, ఆదరించాల్సి వచ్చింది. ఎందుకంటే ఆ పాత్రలలో ఒక నిజాయితీ, సంఘాన్ని పట్టించుకోని లెక్క లేనితనం. ఎన్నో శతాబ్దాలుగా నిర్మించుకున్న ముసుగులు, విలువలు ప్రశ్నించకుండానే తొలగి పోయి, స్త్రీ పాత్రలు సహజత్వంలో కొత్త అందాన్ని సొంతం చేసుకున్నాయి. నాకు తెలిసి స్త్రీ పాత్రలకన్నా చలం వ్యక్తిత్వం, ఏ విషయాన్నైనా -స్త్రీ, అందం, ప్రేమ, శృంగారం, మానవ సంబంధాలు, లైంగిక విషయాలు, బిడ్డల శిక్షణ మొదలైన ఏ అంశంలోనైనా -సూటిగా, స్పష్టంగా, మనసుకి నచ్చే విధంగా చేయాలని నమ్మిన చలం సిద్ధాంతంలో నుంచి పుట్టుకొచ్చినవి "స్త్రీ" పాత్రలు. సంఘంలోని ఏ కట్టుబాట్లూ ఆ పాత్రలని ఆపలేక పోయాయి. ఆదర్శం, డబ్బు, హోదా, పేరు, ప్రతిష్టలు ఇవ్వనిది, ఇవ్వలేనిది – మనసుని కదిలించి, నిలవనీయని మానవ సంబంధాలకి ప్రాధాన్యత ఇవ్వడం చలం "మైదానం" లోని రాజేశ్వరికే సాధ్యం అయ్యింది.

ఇటువంటి స్త్రీ పాత్రలు అవసరమా? సంఘం కట్టుబాట్లు, నీతి నియమాలు ఏమవ్వాలి అని ఘర్షణ పడి, చలాన్ని వెలి వేసి, మీసాలు మెలివేసిన పురుషుల కోసం, "పాత విలువలు నశించాయి. కొత్త విలువలు ఇంకా పుట్టలేదు" అని హెచ్చరిక జారీ చేశాడు. స్త్రీ సమస్యలని, బాధలని, కన్నీళ్ళని తనవిగా చేసుకుని, తనదైన శైలిలో, మెరుపు దాడి చేసాడు. అచేతనంగా, గుడ్డిగా, ముసుగులో బ్రతుకుతున్న సమాజానికి చిన్నా చితకా దెబ్బలు పనికి రావని, మూలాలని కదిలించ గలిగే స్త్రీ పాత్రలు అవసరమని భావించేడా? లేక తన అంతర్మథనంలోనుంచి పుట్టిన అశాంతిని తాను మింగి, "భావ స్వేచ్ఛని" తన సాహిత్యంలో చిందించేడా? రెండోదే నిజమని, తనని వెలివేసే కొద్దీ, తన పంథా మీద మరింత నమ్మకం కలిగి, వెనక్కి తిరిగి రాలేదని నా ఆలోచన. కాకపోతే, మనసుతో బ్రతికి, పై పై మెరుగులని కాదని, అంతర్ముఖంగా ప్రయాణించే ఎందరో చలం అభిమానులకి, చలం "స్త్రీ" పాత్రలన్నీ నిత్య నూతనంగా, కాలాతీత వ్యక్తుల లాగ వెలిగి పోవడంలో ఆశ్చర్యం లేదు.

**మూడవ దశ**

ఇదే సమయంలో ఎందరో రచయితలు కొడవటిగంటి కుటుంబరావు, త్రిపురనేని గోపీచంద్, బుచ్చిబాబు, ఎన్నో అద్భుతమైన స్త్రీ పాత్రలని-సహజ సిద్ధంగా ప్రవర్తించే పాత్రలని, మనకి తారసపడే పాత్రలని -నిలబెట్టి, మెప్పించేరు. కాకపోతే ఎవరూ సమాజానికి విరుద్ధంగా ఎదిరించేవి కాకపోయినా, మెత్తగా, సుతిమెత్తగా సమాజాన్ని ప్రశ్నించే స్త్రీ పాత్రలు ఉంటూనే ఉన్నాయి. గోపీచంద్ ఎన్నో వైవిధ్యమైన స్త్రీ పాత్రలలో "ఉషారాణి", శమంతకమణి – సమాజం గీసిన గీతలో కాకుండా తమకంటూ ఒక పంథాని ఎన్నుకోవడంలో చొరవ, తెగువ, ఆ దారి అంతు తేల్చుకునేంత వరకు చేసిన సాహసాలు, ప్రయోగాత్మకంగా పుట్టిన పాత్రలాగ అనిపిస్తాయి. పొగలేని నిప్పు అనే బుచ్చిబాబు కథలో వివాహేతర బంధంలో కూడా కల్లా కపటం లేని స్వచ్ఛమైన స్నేహ బంధాన్ని ప్రేమ మోహంలో బంధించి, ఆ బంధానికి నిత్య యవ్వనంగా, ఆకర్షణ కలిగిస్తో, నాగమణి అనే స్త్రీ పాత్ర మరణించే దాక ఆస్వాదించడం ఒక అందమైన అనుభవం. చలం రాజేశ్వరి ప్రేమ ప్రకృతిలో మమేకమై, సుడిగాలిలా విహరిస్తే , బుచ్చిబాబు "నాగమణి" ప్రేమ ఇంటి వెనక దడి పక్క మల్లె పొద సాక్షిగా మలయ మారుతం లాగా, పరిణితి చెందిన ప్రేమని సాక్షాత్కారం చేస్తుంది.

**రచయిత్రుల పాత్రలు**

రచయిత్రులలో స్త్రీ పాత్రలని వైవిధ్యంగా, కలకాలం నిలబెట్టిన వారిలో, రంగనాయకమ్మ నిస్సందేహంగా ముందు ఉంటారు. వేశ్యరికాన్ని నిర్మూలించాలంటే విటుల సమస్యని కూడా తీర్చాలని చాటి చెప్పిన "అంధకారం" లోని "రాజేశ్వరి (?)", బహుశా ఏ కాలానికైనా అన్వయిస్తుంది. పాత్రలని నిజాయితీగా తన పంథాలో నడిపించడంలో చలం తర్వాత రంగనాయకమ్మ అందిపుచ్చుకున్నారు. లోక జ్ఞానం కలిగి, ధైర్యం, తెగువ, సమాజం పట్ల ఒక అవగాహన, సున్నితత్వం, నిజాయితీతో, నిబద్ధతతో మనల్ని అలవోకగా తమతో పాటే తీసుకుని వెళ్తాయి ఆ పాత్రలు. మొదట్లో ఏ భావజాలానికీ కట్టుబడని స్త్రీ పాత్రలు ప్రజాస్వామ్య బద్ధంగా నడిచాయి. మరీ ముఖ్యంగా "స్వీట్ హోం" లో విమల హాస్యాన్ని, కోపాన్ని సమపాళ్ళలో మేళవించి అమాయకుడైన బుచ్చిబాబుని సమయానుకూలంగా ఇష్టపడుతూ, తిట్టుకుంటూ, సంసారాన్ని చక్కపెడుతూనే, చెల్లెలి కాపురాన్ని నిలబెట్టిన తీరు మరిచి పోలేనిది. ఆ తర్వాత, కమ్యూనిస్టు భావజాలంతో రాసిన, జానకి విముక్తిలో "సత్యం-శాంత" అన్ని విషయాలని చర్చించుకుంటూ, స్నేహితుల్లాగా, సహజీవనం చేసిన ఆ జంట "కొత్త తరానికి" నాంది పలికింది. సత్యం లాంటి వాడు కావాలి అనుకోగానే -ముందు మనం "శాంత" అవ్వాలి కదా అన్నది అప్పట్లో ప్రాచుర్యం పొందిన భావన.

రంగనాయకమ్మ కన్నా ముందు "శ్రీదేవి" రాసిన "కాలాతీత వ్యక్తులు" లో "ఇందిర" -నవల పేరుని సార్థకం చేసిన పాత్ర. మధురవాణి తర్వాత, అంతటి శక్తివంతమైన పాత్ర. ఏదో ఒక తెలియని ఆకర్షణ -అందుకే అందరు వదిలి వెళ్ళాలని అనుకున్నా, వదలలేరు. అలాగని ఇష్ట పడలేరు. ముగింపుకి వచ్చేసరికి "ఇందిర" ని ఇష్టపడని పాఠకుడు వుండరు. "పెళ్లి అంటే ఇద్దరం కలిసి ఒకే దిశలో చూడడం కాదు. వేరే దిశలలో చూస్తూ కూడా, కలిసి ఎలా పయనించాలో ఆలోచించుకోవాలని" చెప్పిన ఇందిర సూత్రం ఏ కాలపు జంటలకైనా ఆదర్శమే!

ఆధునిక సాహిత్యంలో కుటుంబ కథా నేపథ్యంలో మధ్య లేదా కాస్త ఎగువ తరగతి వర్గంలో నుంచి కొంచెం అహం, పట్టుదల, స్వాభిమానం మూర్తీభవించిన స్త్రీ పాత్రలని సినిమా కథానాయికలకి పోటీగా యుద్ధనపూడి సులోచనారాణి, మాదిరెడ్డి సులోచన, ఆ. కౌసల్యా దేవి, మాలతి చందూర్ లాంటి ఎందరో రచయిత్రులు ప్రాణం పోసారు. నా దృష్టిలో వాసి కన్న రాసిలో మిన్న అయినా, పాఠక లోకాన్ని తమ గుప్పెట్లో తెచ్చుకున్నాయి. పాత్రల చిత్రీకరణ మూస పోసినట్లు వున్నా, కథనంలో చదివించే గుణం వల్ల, సాహిత్యం కొంతవరకు ఊపిరి పీల్చుకుంది.

**ఆధునిక దశ**

చివరగా వచ్చిన ఆధునిక తరం స్త్రీ అందం, చురుకుతనం, తెలివితేటలు కలబోసి, కథానాయకులకే సవాల్ విసరగల "వెన్నెల్లో ఆడపిల్ల" (వీరేంద్రనాథ్) లాంటి పాత్రలతో అప్పుడప్పుడే తెలుగు సాహిత్యలోకంలోకి అడుగుపెడుతున్న యువతని ఆకర్షించగలిగేయి. బహుశా ఆ తర్వాత ఎందరో సాహిత్యలోకంలోకి అడుగుపెట్టినా, ప్రస్తుతమున్న పోటీ ప్రపంచంలో, ఉద్యోగ విజయాలు, పరీక్షల పుస్తకాలలో, మునిగి, సాహిత్యాన్ని ఆనందించేవారు తక్కువ అయ్యారు. అంతర్జాలం ద్వారా మరెందరో కొత్త ప్రయోగాలతొ దూసుకెళ్తూనే వున్నారు. చలం పాత్రల తర్వాత కొంత వరకు అంతర్జాల సాహితీ లోకంలో ఒక కలకలాన్ని రేపింది - కల్పన రెంటాల రాసిన "తనహాయి". ప్రేమ అంటే ఒక వయసుకే పరిమితం కాదని, ఎప్పుడైన, ఎవరితోనైనా, ఏ క్షణంలొ నైనా పుట్టవచ్చునని, ఒక వివాహిత స్త్రీ నిజాయితీతో తన వాదనను భర్తకి అర్థం అయ్యేలా చర్చించడం ఒక సాహసమైన చర్యే!. అనుమాన పడినందుకే అగ్ని పరీక్ష చేసుకున్న సీత దగ్గర నుంచి, అనుమానం కాదు నిజంగానే ప్రేమించేను అని చెప్పగలిగిన కల్హార దాక, స్త్రీ పాత్రలు ఒక సాహసోపేతమైన మార్గంలో పయనించి, తమకంటూ ఒక బాధ్యతా యుతమైన గమ్యాన్ని నిర్దేశించుకున్నారు.

ఎంత చెప్పుకుంటూ పోయినా, చెప్పవలసింది ఇంకా మిగిలే వుంటుంది. ఈ వ్యాసాన్ని సంగ్రహంగా ముగించాలంటే, ఏ పాత్ర నైన అజరామరంగా తీర్చి దిద్దాలంటే, రచయిత/ రచయిత్రి లకు తమ కంటూ ఒక పంథా, కొన్ని నమ్మిన సిద్ధాంతాలు, విలువలు లేక పోతే, అవి చరిత్రలో "అనామకంగా" మిగిలిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు తెలుగు సాహిత్యంలో "మాణిక్యాలుగా" ఎన్నదగిన పాత్రలని సృష్టించిన కథకులు, కొన్ని తరాలకి ప్రాపంచిక దృక్పథాన్ని, మానవ సంబంధాలని అర్థం చేసుకునే సున్నితత్వం, భావుకత అందించి చరితార్థులయ్యారు. ఇది ఇక్కడితో ఆగిపోకుండా, రేపటి తరానికి, స్వచ్ఛమైన "సాహిత్య పరిమళాలు" అందించడంలో మన రచయితలందరూ కలిసి పని చేయాలని కోరుకుంటున్నాను.

కవిత

## ఆసరా

- కరణం కళ్యాణ్‌కృష్ణకుమార్
9848428978

**వా**త్సల్యం నింపుకున్న పొత్తిళ్ళలో అఆలు పలికించి
చిందే బోసినవ్వుకు చిటికలేసి ఇఈలు నేర్పించి
ముచ్చటగా మురిపాల ఉగ్గుతో ఉఊల ఊపిరూది
స్వచ్ఛంగా అచ్చమైన అక్షరాలు నేర్పినదీ అమ్మభాష

చనుబాలు చేపుతూనే అచ్చులన్నింటిని
ఊయలూపుతూనే హల్లునుడికారాలని
హావభావాలతో హ్రస్వ దీర్ఘాలనీ
అభిమన్యుని చేసి నేర్పినదీ తల్లిభాష

అలతి అలతి పదాలతో జానపదముల జోకొట్టి
చందమామ పిలుపులతో పదాల వెన్నెల పట్టి
పలుకుతేనె చిలికి పోషించిన రాజభాష
ఒంపు సొంపులున్న రాయంచభాష

రామచక్కని రాగాలు లాలిపోస్తూ
గుణగణాల గుణింతాల జీర్ణంచేసి
నడతకు అడుగులు నేర్పిన నేర్పరిభాష
సుస్వరాల సమ్మిళిత సొగసుభాష .. మన తెలుగుభాష...

పొరుగింటి కూర రుచిమరిగిన ఓ మనిషీ..!
తడబడక అడుగులేయాలంటే అమ్మ ఆసరా కావలిసిందే..
ఆకాశహర్మ్యాలకైనా మట్టిపునాది పడాల్సిందే
ఎగిరే విహంగానికైనా బలమైన రెక్కలుండాల్సిందే
నీడనొసగు మహావృక్షానికైనా విత్తు నాటాల్సిందే...
ఏ భాషవైపు లంఘించాలన్నా అమ్మనుడిని నేర్వాల్సిందే...!
అమ్మనోటి తీపి పలుకులు వల్లె వేయాల్సిందే..!



-చలసాని నరేంద్ర
98495 69050

# జీఎస్టీ అమలుతో చారిత్రక పన్నుల యుగం ప్రారంభం !



**స్వతంత్ర భారత దేశంలో అతిపెద్ద పన్నుల సంస్కరణగా భావించే వస్తు, సేవాపన్ను (జీఎస్టీ) చట్టాన్ని అమలు ప్రారంభం కావడంతో ఒక చారిత్రక పరిణామం చోటుచేసుకొంటున్నదని చెప్పగలము. బహుశా నరేంద్రమోడీ ప్రభుత్వం గత మూడేళ్ళల్లో ఈ చట్టం కోసం చేసినంత కసరత్తు మరే అంశం పైన చేసినట్లు లేదు. రాజకీయ భేదాభిప్రాయాలతో సంబంధం లేకుండా అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో కలసి ఏకాభిప్రాయ సాధన ద్వారా చేసిన భారీకసరత్తు కావడం గమనార్హం.**

**యూ**పీఏ హయాంలో ప్రణబ్ ముఖర్జీ ఆర్థికమంత్రిగా ఉన్న సమయంలోనే జీఎస్టీ బిల్లుకు అంకురార్పణ జరిగింది. దాదాపు దశాబ్దకాలపు తర్జనభర్జనల అనంతరం, ఆయనే రాష్ట్రపతిగా పదవి విరమణ చేయనున్న సమయంలో ఈ పన్ను అమలును లాంఛనంగా ఆవిష్కరించడం గమనార్హం. భారత దేశ చరిత్రలో మరోసారి స్వాతంత్ర్య వేడుకలను తలపించేలా జీఎస్టీ ఆవిష్కరణ మహోత్సవాల పట్ల నరేంద్ర మోడీ ప్రభుత్వం విశేషమైన ప్రాధాన్యత కల్పిస్తున్నది.

దేశాభివృద్ధిలో మైలురాయిగా నిలిచే ఈ విప్లవాత్మక వస్తు-సేవల పన్ను విధానాన్ని ఘనంగా ఆవిష్కరించేందుకు చారిత్రక పార్లమెంట్ సెంట్రల్‌హాల్ వేదికగా మారింది. భారతదేశ స్వాతంత్ర్యం అర్ధరాత్రి వచ్చినట్లు ఈ పన్ను అమలు సహితం అర్ధరాత్రి ప్రారంభం కావడం ప్రాధాన్యత సంతరింప చేసుకొంది. జీఎస్టీ విధానం అమల్లోకి వచ్చినట్లు సంకేత సూచకంగా అర్ధరాత్రి జేగంట మోగిస్తారు.

ఇది పరోక్ష పన్నుల విధానంలో ఓ చారిత్రక మలుపు. " ఒకే దేశం – ఒకే విపణి" అన్న కల కార్యరూపం దాలుస్తున్నది. జీఎస్‌టీ అనేది కేవలం పన్ను సంస్కరణ మాత్రమే కాదు. దేశ వ్యాపార ముఖచిత్రాన్ని సమూలంగా మార్చే ఓ విధాన ప్రక్రియ.

ప్రస్తుతం దేశంలో ఒకొక్క రాష్ట్రంలో ఒకొక్క పన్ను విధానం ఉన్నది. జీఎస్టీ అమలుతో విభిన్న పన్ను రేట్లతో సామాన్యుడి నడ్డి విరుస్తున్న శకానికి స్వస్తి పలికి నవ శకానికి నాందిపలికే దిశగా నరేంద్ర మోదీ ప్రభుత్వం వేస్తున్న అతిపెద్ద విప్లవాత్మక అడుగుగా దీనిని పేర్కొనవచ్చు. ఇప్పుడు దేశంలో ఏ మూలకు వెళ్లినా ఒకేరకమైన పన్ను అమలులోకి వచ్చినట్లయింది.

ప్రస్తుతం ఏ రాష్ట్రంలో వస్తువులను విక్రయిస్తున్నారో/సేవలు అందిస్తున్నారో అక్కడే పన్నులు చెల్లించాలి. జీఎస్‌టీ అమల్లోకి వచ్చాక వ్యాపారానికి రాష్ట్రాల మధ్య అడ్డుగోడలు తొలగిపోతాయి. వస్తువును తయారు చేసే రాష్ట్రంతో పోలిస్తే ఆ వస్తువు అమ్మకాలు జరిగే రాష్ట్రానికి ఎక్కువ ఆదాయం సమకూరుతుంది.

### ఒకే రకమైన పన్నుల మదింపు

ప్రస్తుత విధానంలో పన్నుల విధింపు వివిధ రకాలుగా ఉంది. ఉదాహరణకు సెంట్రల్ ఎక్సైజ్ పన్ను విధానంలో తయారీపై పన్ను విధిస్తారు. విక్రయాలపై విలువ ఆధారిత పన్ను (వ్యాట్)ను, సేవలపై సేవా పన్నును విధిస్తున్నారు.

ప్రస్తుతం కార్యకలాపాలు నిర్వహించే ప్రతి రాష్ట్రంలోనూ కంపెనీలు ఎక్కడికక్కడ నమోదు చేసుకోవాల్సిన పరిస్థితి ఉంది. జీఎస్‌టీ విధానంలో ఒక రాష్ట్రంలో నమోదు చేసుకుంటే చాలు, దేశంలో ఏ ప్రాంతానికైనా వస్తువుల సరఫరా/సేవలు అందించే వీలు కంపెనీలకు ఉండబోతోంది.

అలాగే ఇప్పుడు ఇతర పరోక్ష పన్నుల మాదిరి సెంట్రల్ ఎక్సైజ్ కింద చేసే పన్ను చెల్లింపులకు ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ సదుపాయం

లేదు. జీఎస్‌టీలో పరోక్ష పన్నులంటినీ ఒకే పన్ను విధానం కిందకు తీసుకొస్తుండటంతో ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ విషయంలో వ్యత్యాసాలు తొలగిపోబోతున్నాయి.

సెంట్రల్ ఎక్సైజ్, సేవా పన్ను, వ్యాట్, వినోదపు పన్ను ఇలా పలు రకాల పన్నులకు వేర్వేరు పద్దులను నిర్వహించాల్సిన పరిస్థితి ముమ్ముందు ఉండదు. అలాగే ఒకటే లావాదేవీపై సేవా పన్ను, వ్యాట్ ఇలా పలు రకాల పన్నులను చెల్లించాల్సిన పరిస్థితి తొలగిపోయి ఇలాంటి లావాదేవీలన్నింటికీ ఒక్కటే పన్ను విధానం రాబోతోంది.

**జీఎస్టీ వల్ల ప్రస్తుతం పలు సమస్యలు ఉత్పన్నం కావడం అనివార్యం అని అంగీకరిస్తూనే స్వల్పకాలిక సవాళ్లను ఎదుర్కొనేందుకు అందరూ సిద్ధంగా ఉండాలని ఈ సందర్భంగా ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ పిలుపిచ్చారు. పన్ను ఎగవేతను అడ్డుకునేందుకు జీఎస్టీ సమర్థవంతంగా పనిచేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. జీఎస్టీ వల్ల ఆదాయాలు పెరుగుతాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఖర్చు చేసే సామర్థ్యం కూడా పెరుగుతుందని ఆయన వివరించారు.**

కొత్తగా ప్రవేశపెట్టే జీఎస్టీ పన్ను విధానం వల్ల జీడీపీపై పాజిటివ్ ప్రభావం ఉంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. నేడు భారత దేశం 7 శాతానికి పైగా వృద్ధి రేటుతో దూసుకుపోతూ, ప్రపంచ దేశాల్లో భారత్ బలమైన ఆర్థిక శక్తిగా ఎదుగుతున్నది. ఓపక్కనైనా ఆర్థిక రథం ఆపసోపాలు పడుతున్న వేళ మన అడుగు మాత్రం ముందుకే పడుతోంది. ప్రధాని మోదీ సారథ్యంలోని ప్రభుత్వం ఎప్పటికప్పుడు వినూత్న సంస్కరణలకు తెరతీస్తూ ప్రపంచ మదుపర్లను తనవైపు ఆకట్టుకుంటోంది. ఇందులో భాగమే జీఎస్‌టీ.

ప్రస్తుతం రాష్ట్రాలు విధిస్తున్న వ్యాట్ విధానం వల్ల వస్తువుల ధరల ఒక్కో రాష్ట్రంలో ఒక్కోలా ఉంటున్నాయి. అలాగే పన్ను విధింపు ప్రక్రియ కూడా వేర్వేరుగా ఉంది. గుర్తింపు లేని డీలర్ల నుంచి చేసే కొనుగోళ్లపై ప్రస్తుతం ఎలాంటి ప్రత్యక్ష పన్నులు విధించడం లేదు. భవిష్యత్‌లో ఇలా చేసే అన్ని రకాల కొనుగోళ్లపై పన్నులు చెల్లించాల్సి ఉంటుంది.

అయితే ఈతరహా కొనుగోళ్లపై ఇన్‌పుట్ ట్యాక్స్ క్రెడిట్ రూపంలో చెల్లించిన పన్ను మొత్తాన్ని తిరిగి పొందే వీలుంటుంది. జీఎస్‌టీలో పన్ను రీఫండ్‌లను దరఖాస్తు సమర్పించిన 60 రోజుల్లో చెల్లిస్తారు. ప్రస్తుతం నిర్దిష్ట కాలపరిమితి లేదు. అంటే కంపెనీలు/ వ్యాపార సంస్థలు ఆర్థిక ప్రణాళిక విషయంలో మరింత సమర్థంగా వ్యవహరించే వీలును జీఎస్‌టీ కల్పించనుందన్నమాట.

జీఎస్‌టీలో దేశవ్యాప్తంగా వస్తువుల సరఫరా రాక/పోకలను ఎలక్ట్రానిక్ పద్ధతిలో పర్యవేక్షిస్తారు (క్రాస్ చెకింగ్). పన్ను ఎగవేతలకు ఈ పరిణామంతో అడ్డుకట్ట పడుతుంది. జీఎస్‌టీ విధానం వల్ల తగ్గే ధరను వినియోగదారులకు బదిలీ చేసే విధంగా ప్రభుత్వం ఇప్పటికే జీఎస్‌టీ చట్టంలో నిబంధనలను పొందుపరిచింది. ఈ చర్య వల్ల వ్యాపారులు ధర తగ్గింపు ప్రయోజనాన్ని తప్పనిసరిగా వినియోగదారులకు బదిలీ చేయాల్సిన పరిస్థితి ఉంటుంది.

జీఎస్‌టీ అమలయ్యాక పన్ను విధింపు పద్ధతి, వ్యాపార ప్రక్రియ, రిజిస్ట్రేషన్ విధానం, రిటర్న్‌ల దాఖలు ఇలా చాలా విషయాల్లో మార్పులు వస్తాయి. అందుకే జీఎస్‌టీని కేవలం పన్ను సంస్కరణ అనుకుంటే సరిపోదు. వ్యాపార రూపురేఖలను మార్చే విధాన ప్రక్రియగా కూడా భావించాల్సి ఉంటుంది.

**లోపించిన మౌలిక వసతులు**

అయితే కొత్త పరోక్ష పన్నుల విధానాన్ని ప్రవేశపెట్టేందుకు అవసరమైన కీలక మౌలిక వసతులు పూర్తి స్థాయిలో సిద్ధం కాక పోవడం వర్తక, వాణిజ్య వర్గాలలో ఆందోళన కలిగిస్తున్నది. తమ ఐటీ సిస్టమ్స్ (ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వ్యవస్థ) ఇంకా సిద్ధం కాలేదని జీఎస్టీ సువిధ ప్రొవైడర్లు (జీఎస్పీ) అంటున్నారు. కొత్త చట్టం అమలులో సువిధ ప్రొవైడర్ల పాత్ర ఎంతో కీలకం. ఎందుకంటే, పన్ను చెల్లింపుదారులను ప్రభుత్వానికి అనుసంధానం చేసేది వీరే.

జీఎస్టీకి సంబంధించి అన్ని నిబంధనలను అధికారికంగా నోటిఫై చేసిన తరువాత ఇతర సిస్టమ్స్ సిద్ధం చేసుకోవడానికి తగు వ్యవధి లేదు. పైగా ఈ సందర్భంగా దాఖలు చేయవలసిన పత్రాల గురించి తగు అవగాహనా కల్పించలేదు.

బ్యాంకింగ్ రంగంతోపాటు ఇండస్ట్రీలోనూ చాలావరకు సంస్థలు జీఎస్టీ అమలుకు అవసరమైన మౌలిక వసతులను పూర్తి స్థాయిలో సమకూర్చుకోలేదు. జీఎస్టీని అమలుపర్చాలంటే వ్యాపార వ్యవస్థను సమూలంగా మార్చాల్సి ఉంటుంది. ఆ దిశలో తగు ప్రయత్నాలు జరుగనే లేదు.

కాబట్టి కొత్త చట్టాన్ని జూలై 1కి బదులుగా సెప్టెంబర్ 1 నుంచి అమలు చేయడం ఉత్తమం అని పలువురు పన్ను నిపుణులు విజ్ఞప్తి చేశారు.

జీఎస్టీ సువిధ ప్రొవైడర్లను జీఎస్టీఎన్ ఎంపిక చేసి లైసెన్సు మంజూరు చేస్తుంది. మొత్తం 34 జీఎస్పీలు ఎంపికయ్యాయి. వీరు జీఎస్టీఎన్ ఏర్పాటు చేసే అప్లికేషన్ ప్రోగామ్ ఇంటర్‌ఫేస్‌పై (ఏపీఐ) ఆధారపడాల్సి ఉంటుంది.

జీఎస్టీఎన్ ఏపీఐలను తమ అకౌంటింగ్, ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్, ఫైలింగ్, బిల్లింగ్ సాఫ్ట్‌వేర్‌లో ఉపయోగించుకోవడం ద్వారా జీఎస్పీలు కొత్త చట్ట నిబంధనలకు అనుగుణంగా సేవలందించగలవు.

జూలై 1 నుంచి జీఎస్టీ అమలు పెద్ద సమస్య కాకపోయి నప్పటికీ. ఇంకా చాలా విషయాలు కొలిక్కి రావాల్సి ఉండటం జీఎస్పీలను కలవర పెడుతున్నది. ఐటీ వ్యవస్థను సిద్ధం చేసుకున్నాక, కార్యకలాపాలకు సంబంధించి సమగ్ర స్థాయిలో ముందస్తు పరీక్షలు నిర్వహించాల్సి ఉంటుంది.

**గడువు కోరుతున్న బ్యాంకర్లు**

జులై 1 నుంచే కొత్త పరోక్ష పన్నుల చట్టాన్ని అమలు చేసేందుకు బ్యాంకులింకా సిద్ధం కాలేదని ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) ఆర్థిక వ్యవహారాలు పర్యవేక్షించే పార్లమెంటరీ కమిటీకి వెల్లడించింది.

ముఖ్యంగా పన్ను చెల్లింపుదారుల ఇన్‌వాయిస్‌లు, పన్ను చెల్లింపులు, ఇన్‌పుట్ టాక్స్‌ను అందుకోవడం, వారి రిజిస్ట్రేషన్ వివరాలను బ్యాంకు ఖాతాలతో అనుసంధానం చేయడం, సాఫ్ట్‌వేర్‌ను అప్‌డేట్ చేసుకోవడం వంటి సాంకేతికపరమైన సమస్యలు ఉన్నాయని కమిటీకి ఐబీఏ ఛైర్మన్ రాజీవ్‌రుషి (సెంట్రల్ బ్యాంకు సీఎండీ), డిప్యూటీ ఛైర్‌పర్సన్ చందాకొచ్చర్ (ఐసీఐసీఐ బ్యాంకు సీఎండీ) లిఖితపూర్వకంగా వివరించారు.

నెలాఖరులోగా భారీ మార్పులకు లోనుకావడం అన్ని బ్యాంకు లకు సాధ్యమవుతుందో లేదోనని ఐబీఏ సందేహం వ్యక్తం చేసింది. పన్ను చెల్లింపుదారులు రోజువారీ జరిపే ఆర్థిక లావాదేవీలకు అనుగుణంగా అన్ని బ్యాంకులు సంసిద్ధమైన తర్వాతే జీఎస్టీని అమలు చేయడం సహేతుకంగా ఉంటుందని ఐబీఏ కోరింది.

మరోవంక, ఐటీ సిస్టమ్స్‌ను డాటా నిక్షిప్తానికి ముందే ఇంటర్నే షనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్‌వో) ప్రమాణాలకు అనుగుణంగా ఆడిటింగ్ జరిపించాలని జీఎస్పీలను జీఎస్టీఎన్ కోరింది. అంతేకాదు, కంప్యూటర్లలో సమాచార భద్రత సామర్థ్యాన్ని కూడా పటిష్ఠం చేసుకోవాలని సూచించింది.

పౌరవిమాన మంత్రిత్వ శాఖ సహితం మరికొంత వ్యవధి కోరింది. పశ్చిమ బెంగాల్, కేరళ రాష్ట్ర ప్రభుతాలు సహితం వ్యవధి కోరాయి. ఎలక్ట్రానిక్ వే బిల్స్ సిద్ధం కాకపోవడంతో కొన్ని సమస్యలు తలెత్తనున్నాయి.

**చిన్న పరిశ్రమలకు పెనుభారం**

జీఎస్టీ హయాంలో చిన్న పరిశ్రమలకు రిటర్నుల దాఖలు తలకుమించిన భారం కానుందని పన్ను నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే, జీఎస్టీ పరిధిలోకి వచ్చే వ్యాపారాలు, పరిశ్రమలు నెలకు మూడు రకాల రిటర్నులు దాఖలు చేయాలి. ప్రతియేటా వార్షిక రిటర్ను సైతం ఫైల్ చేయాల్సి ఉంటుంది.

అంటే నెలకు మూడు చొప్పున పన్నెండు నెలలకు 36 రిటర్నులతోపాటు వార్షిక రిటర్ను కలిపితే మొత్తం సంఖ్య 37కు చేరుకోనుంది. ఇది కేవలం ఒక రాష్ట్రంలో వ్యాపారం నిర్వహించే సంస్థలకు మాత్రమే.

ఎన్ని రాష్ట్రాలలో వ్యాపారం నిర్వహిస్తే అన్ని రాష్ట్రాలల్లోనూ ఏటా 37 రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

ఉదాహరణకు, ఏదేని సంస్థ మూడు రాష్ట్రాలలో వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్నది అనుకుందాం. అంటే, ఆ సంస్థ రాష్ట్రానికి 37 చొప్పున మూడు రాష్ట్రాలలో ఏటా 111 రిటర్నులు దాఖలు చేయాల్సి ఉంటుంది.

చిన్న, మధ్య తరహా పరిశ్రమలు తమ వ్యాపార పద్దులు చూసుకునేందుకు మహా అయితే ఒకరిద్దరు వ్యక్తులను నియమించు కుంటాయి. కానీ, జీఎస్టీ నిబంధనలకు అనుగుణంగా పద్దులు నిర్వ హించడంతోపాటు రిటర్నులు దాఖలు చేయాలంటే, కొత్త చట్టంపై అవగాహన కలిగిన నిపుణులను నియమించుకోవడంతోపాటు తగిన ఐటీ వ్యవస్థను సైతం ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. ఫలితంగా సంస్థలపై ఆర్థిక భారం మరింత పెరుగనుంది.

**సైబర్ భద్రతపై అనుమానాలు**

జీఎస్టీలో లావాదేవీలు అన్ని ఆన్‌లైన్‌లో జరుగనున్నాయి. ఈ వ్యవస్థను ప్రభుత్వ సంస్థలు కాకుండా ప్రైవేట్ సంస్థలు నిర్వహింప నున్నాయి. దానితో వాటి సామర్థ్యం, సమాచార గోప్యత కాపాడగల చిత్తశుద్ధి, నిపుణత, కార్యదక్షతలపై పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నాయి. కార్పొరేట్ సంస్థలు కూడబలుక్కొని పన్నులు ఎగగొట్ట డానికి, తక్కువగా చెల్లించడానికి ప్రయత్నం చేసే అవకాశం ఏర్పడు తుందని కూడా భావిస్తున్నారు.

**రాష్ట్రాలకు చెందిన పన్నుల వ్యవస్థను కేంద్రం హైజాక్ చేయడం, కేంద్రం వద్ద అందుకు అవసరమైన యంత్రాంగం, నిపుణత లోపించడంతో మొత్తం వ్యవస్థ కుప్పకూలే ప్రమాదం ఉన్నదని, రాష్ట్రాల అధికారాలను నిర్వీర్యం చేసినట్లు కాగలదని, కేంద్రం దయాదాక్షిణ్యాలపై తమ ఆర్థిక అవసరాలకు రాష్ట్రాలు ఆధార పడవలసి వస్తుందని ఈ సందర్భంగా భయాందోళనలు వ్యక్తం అవుతున్నాయి.**

మొత్తం మీద ప్రజలపై జీఎస్టీ వల్ల పన్నుల భారం పెరగ బోవడం లేదని చూపించడం కోసం కేంద్రం తీవ్రమైన కసరత్తు చేస్తున్నది. అయితే కొద్ది కాలంలోనే పన్నుల భారం రెట్టింపు అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. కీలకమైన పెట్రోల్/డీజిల్, మద్యంలను జీఎస్టీ పరిధిలోకి తీసుకు రాకపోవడం పట్ల విమర్శలు చెలరేగుతున్నాయి.

---

*(31వ పేజీ తరువాయి)*

# ఇద్దరమ్మల కథలు

లుగా ప్రసిద్ధులు. పరిపూర్ణగారు కూడా కథలురాశారు. ఆమె కథలు "కథాపరిపూర్ణమ్" అనే సంకలనంగా వచ్చింది. ఆ కోవలోనే యిటీవలనే ఆమె తన ఆత్మకథను రాశారు.

నంబూరి పరిపూర్ణగారు తన ఆత్మకథకు 'వెలుగుదారులలో' అని పేరుపెట్టారు. చుట్టూ కమ్ముకున్న చీకటికి బయపడకుండా ధైర్యంతో వొక స్త్రీ సాగించిన పోరాటపు వెలుగుదారి యిది.

'మనసుకు మల్లెల మాలలు' 'వెలుగుదారులు' లను వొకే సమ యంలో వెంటవెంటే చదవడం యాదృచ్ఛికమే కాని అయితే యీ రెండు బలమైన కోణాలు గావటం స్పష్టంగా బోధపడుతుంది.

"మనసున మల్లెల మాలలు" పుస్తకం చదివాకా కూడా కోకా సావిత్రి గారి కులమేమిటో నాకైతే నిర్ద్వంధంగా చెప్పడం కష్టమైంది. "వెలుగుదారులు" పుస్తకం మొదట్లోనే రచయిత్రికున్న దళిత కమ్యూనిష్టు నేపథ్యం విస్పష్టంగా తెలిసిపోతుంది. మధ్యతరగతి జీవుల మందహాసాలను మొదటి పుస్తకం వివరిస్తే దళితుల పోరాటాన్ని రెండో పుస్తకం ఆవిష్కరించింది. నీతిగా నియమబద్ధంగా జీవించడం మధ్యతరగతి అగ్రకులస్థుల జీవిత విధానమైతే, కమ్యూనిజమనే గొప్ప ఆదర్శంకోసం జీవితాన్ని పరీక్షలకు దించే సాహసం దళితులది. ఆదర్శాలకు తగినంతగా యెదగలేకపోయిన రాజకీయ సంస్థల వుత్థాన పతనాలు రెండో పుస్తకంలో వ్యక్తమవుతాయి.

రెండువేర్వేరు సామాజిక భూమికలున్నా యీ పుస్తకాలలోని వ్యక్తులిద్దరూ గొప్ప స్వాభిమానమున్న నాగరిక స్త్రీలు. గొప్ప వ్యక్తిత్వాలున్న వాళ్ళు. 'మనసున మల్లెల మాలలు' వొకప్పటి మనుషులల్లోని నైతిక విలువల్ని విశదీకరిస్తూ మన తెలుగు వాళ్ళ – లేకపోతే యీకాలపు ప్రజలందరి జీవన గతిని బేరీజువేసి చూపెడు తుంది. 'వెలుగుదారులలో' జీవనపోరాటం చేస్తున్న స్త్రీలందరికీ స్ఫూర్తిగా వుంటుంది. యీ యిద్దరి స్త్రీ మూర్తులూ మన [illegible] కున్న రెండు బలమైన పార్శ్వాలను పరిచయం చేశారు.

-వావిలాల సుబ్బారావు
98664 02973

# పతంజలి మహర్షీ! నమస్కారమయ్యా..



నీపేరును అంతర్జాతీయం చేసినందుకు నీవు మాకు కృతజ్ఞుడవో, నీ దయవల్ల మన దేశ యోగసంస్కృతికి అంతర్జాతీయ ప్రశస్తి వచ్చినందుకు మేమే నీకు కృతజ్ఞులుగా ఉండాలో తెలియక సతమత మవుతున్నాము. నీ పేరు తప్ప నిన్ను గురించి మాకేం తెలియదు. అదే మంచిది. ఎంతగొప్పగా నయినా ఊహించుకొనే సదవకాశం వచ్చింది. నిన్ను గురించి అదీ యిదీ తెలిసిందనుకో, అంతేనా ఇంతేనా అని దిగజార్చక ఊరుకుంటామా! "మహాభాష్య" రచనతో భాషాశాస్త్రానికి, వైద్య శాస్త్రంతో మా శరీరాలకు, యోగశాస్త్రంతో మా మనసుకు (మనో వాక్కాయాలకూ) దారి చూపించి ఆదిశేషు అవతారమని గౌరవించే అవకాశమిచ్చావు. కృతజ్ఞులమయ్యా!

నీవొక కాపీరైటు హక్కు సంపాదించిఉంటే బాగుండేది. "నా పుస్తకంలో అంతా కాని, కొంతకాని, అనువదించటం కాని, అల్లరి పాలు చేయటానికి కాని నా అనుమతి పొందకపోతే సివిల్, క్రిమినల్ దావాలకు అర్హులవుతారు." అని ఒక వాక్యం వ్రాసిఉంటే బాగుండేది. అది లేకపోబట్టే యోగ పేరుమీద నానారకాల దుర్యోగాలు 'బ్రాండు నేమ్స్'లో చెలామణి అవుతున్నాయి. కాళ్ళు, చేతులు, నడుము వంచటం నేర్పే ప్రతివాడు 'యోగి' అని తగిలించుకుంటున్నాడు. యోగి అంటే గడ్డం పెంచుకొనితీరాలన్న నియమం ఏమీలేదు. ఉంటే మంచిదే. ఎడిషనల్ ఎట్రాక్షను... ప్రత్యేకమైన యూనిఫారం అక్కర లేదు. కాని, రంగు యూనిఫారమైతే మరీమంచిది

యోగి అన్నపేరు నాకు రావాలి. నేర్చుకున్న మీకు కూడా వస్తే నాకేమీ అభ్యంతరం లేదు. స్వీట్ యోగ అని, హాట్ యోగ అని రకరకాల పేర్లు తగిలించుకుందాం. అందరం కలసి అందరిలాగానే ఆహార విహారాలు అనుభవిద్దాం. యమ నియమాలా! జాన్‌తా నై! రాందేవ్ గారి పుణ్యమా అని ప్రాణాయామం ఒకటి అదనంగా వింటున్నాం.

**దేశంలో యోగాభ్యాసం ఇంత విస్తరించింది గదా! ఆహార విహార నియమాలు యింతగా పతనమయినాయేమి? శౌచం, సంతోషం, తపస్సు, స్వాధ్యాయాలనే నియమాలు లేకపోతే పోనీ, - జాతి, దేశ, కాల, సమయాలతో నిమిత్తంలేని మహావ్రతాలు గదా- అహింస, సత్యం, అస్తేయం, బ్రహ్మచర్యాలనే 'యమాలు', ఇవి కూడా పాటించ కుండా కాళ్ళు చేతుల భంగిమలు మారుస్తుంటే చాలా! అదీ యోగమేనా? అంతర్జాతీయ యోగం అంతా ఆసనాలకు, కొద్దో గొప్పో ప్రాణాయామానికే పరిమితం అయిపోతే, అది ఫిజియోథెరపీ కన్నా, శ్వాస వ్యాయామానికన్నా ఏమంత గొప్ప? యోగ మహావిద్యను కుదించి కుదించి ఎంత కనిష్ఠానికి పరిమితం చేశామో గ్రహిస్తే, పతంజలి మహర్షికి మనం చేస్తున్నది ఆరాధనో, అపచారమో అర్థమవుతుంది.**

దేవాలయ మహావ్యవస్థను టిక్కెట్లు, లడ్డూలకు కుదించాము. భగవంతుడన్నా మహాబ్రహ్మ భావనను హారతికి, నైవేద్యానికి దిగలాగాము. జ్ఞానదాన విద్యావ్యవస్థను కోట్లకు పడగలెత్తినవారి వశం చేశాము. ఆరోగ్యాన్ని ఇల్లు ఇల్లు తిరిగి పంచిన గ్రామీణ వైద్యసేవను, రక్త కణాలను చిల్లర నాణాలుగ చూచే విలాస వైద్యంగా డయాలసిస్ చేశాము.

జాతి, వర్గ, కుల, మత రహిత సమాజ నిర్మాణం లక్ష్యంగా చేసుకున్న రాజ్యాంగం సాక్షిగా కులాలను పదిల పరుచుకుంటున్నాం. కుల కార్పొరేషన్లకు ప్రభుత్వ నిధులిచ్చి. ప్రభుత్వ ధనంతోనే గుంపులవారీగా ఓట్ల మూటలు కట్టుకుంటున్నాం. మా గుంపుకొక కార్పొరేషనంటే మాగుంపుకొక కార్పొరేషనంటూ రోడ్డుమీది కొస్తున్నాం. కులాల వారీగా కాలనీలు కట్టుకోవటానికి సిగ్గువిడిచి వ్యాపార ప్రకటనలనిస్తున్నాం. అఖండ భారత్ అంటూనే ముక్కలు ముక్కలుగా భారతాన్ని కత్తిరించుకుంటున్నాం.

**ఎన్నెన్ని వైరుధ్యాలో..పతంజలి మహర్షీ రక్షించు వైరుధ్యాలనుండి, చీలిన మనసులనుండి. యోగమంటే వైరుధ్య రహిత ఏకత్వ సమాధి సాధన అని తెలియచెప్పటానికి ఎవరి స్వరాన్నయినా ఆవహించరాదా?**

ఎంత వింత మనుష్యులమో మనం. నా స్వరాన్ని స్వీకరించ మనటం చేతకాక ఎవరి స్వరాన్నయినా ఆవహించు అంటాను. నాలోని వైరుధ్యమే పోగొట్టుకోని నేను, పరుల వైరుధ్యం గురించి పేజీలు పేజీలు రాస్తాను.

*మనలో తమాషా ఏమంటే మనలోని వెలుగు నీడల వైరుధ్యమే*
*వయసు ఎదగడానికి కష్టపడతాం-గడచిన బాల్యంకోసం చింతిస్తాం*
*సంపదకై ఆరాటపడతాం- ఆడంబరంగా వెచ్చిస్తాం*
*బీదరికాన్ని పొగడుతాం- నిరాడంబరాన్ని కీర్తిస్తాం*
*ఇక మనకు చావే రాదన్నట్లు జీవిస్తాం*
*జీవించనే లేదన్నట్లు టప్పున చచ్చి ఊరుకుంటాం*
*డబ్బు సంపాదించటానికి కష్టించి జబ్బున పడతాం*
*జబ్బునుండి కోలుకోవటానికి అంతా వెచ్చిస్తాం*
*రేపటికోసం- ఇంకా పైపై రేపట్లకోసం అర్రులు చాస్తాం*
*చేతుల్లోని క్షణాలను చేజార్చుకుంటాం*
*ఊహల్లోని ప్రేయసికోసం ఉవ్విళ్ళూరుతాం*
*పక్కనున్న అర్ధాంగికి అర్థంకాని దూరంలో ఉంటాం*
*ప్రజా ప్రభుత్వాలు ప్రజలను పట్టించుకోవాలంటాం*
*ఓట్లనాడు నోట్లురాగానే బ్యాలటుకు దూరం జరుగుతాం*
*మదర్సు ఫాదర్సు డేలను ఘనంగా చేస్తాం*
*వాళ్ళకు వృద్ధాశ్రమాలలో సీట్లు రిజర్వు చేస్తాం*
*ప్రేమాహింసల ప్రవక్తలకు బంగారు గోపురాలు నిర్మిస్తాం*
*మారణాయుధాల పరిశోధనకు బడ్జట్లు విస్తరిస్తాం*
*మనలోని వైరుధ్యాలను గుర్తించి మనమే విస్తుపోతాం*
*ఒక్కదాన్నీ తొలగించుకోక సమర్థించుకుంటాం.*

(నోబెల్ రచయిత "PAVLO COELHO" గీతం. "The Funniest thing about human being"కు అనువాదం- నుండి విస్తరణ.)

-బద్రి కూర్మారావు
97047 98643

# కాశీతో 'తెలుగు' బంధం



**కాశీ** హిందువుల పుణ్యక్షేత్రం. ప్రతి హిందువు జీవితంలో ఒక్కసారైనా గంగానదిలో స్నానమాచరించి కాశీని దర్శించాలనుకుంటారు. మరికొంతమంది జీవిత చరమాంకంలో కాశీ విశ్వేశ్వరుని సన్నిధిలోనే తనువు చాలించాలని అనుకుంటారు. కాశీని సందర్శించే భక్తులలో తెలుగువారు ఎక్కువ సంఖ్యలో ఉంటారు. తెలంగాణా, ఆంధ్రప్రదేశ్, ఇతర ప్రాంతాలలోని తెలుగువారు నిత్యం వేల సంఖ్యలో వారణాసిని సందర్శిస్తుంటారు. శివరాత్రి దినాలలోనూ, కార్తీకమాసం, ఏప్రిల్, మే నెలల్లో తెలుగువారి సందర్శన మరీ ఎక్కువగా ఉంటుంది. వారణాసి రైల్వేస్టేషన్లో దిగిన నుండి దైవదర్శనముకు వెళ్లే వరకు ఎక్కడో ఒక దగ్గర తెలుగు వినిపిస్తుంది.

ఇక కాశీతో తెలుగు సాహిత్య, సాంస్కృతిక, విద్య, భాషా, అను బంధాలు చూస్తే - మొదటిగా సామెతలతో మొదలు పెడితే ***"కాశీకి వెళ్లిన వారు కాటికి వెళ్లిన వారు ఒక్కటే".*** ఆరోజుల్లో బస్సు, రైలు ప్రయాణం లేని కాలంలో కాలినడకన కాశీకి వెళ్లిరావటం సాహసంతో కూడుకున్న విషయాన్ని ఇది తెలియజేస్తుంది. ***'కాశీకి వెళ్లి గాడిదను తెచ్చినట్లు', 'తనది కాకపోతే కాశీవరకు దేకుతానన్నాడట', 'కాళ్ల దగ్గరకు వచ్చే బేరం కాశీకి వెళ్లినా రాదు'*** - ఇవన్నీ కాశీతో తెలుగు సామెతలకు ఉన్న బంధం.

ఇక పురాణాల్లోకి వెళ్తే కాటికాపరి అయిన హరిశ్చంద్రచక్రవర్తి, అతని భార్య చంద్రమతిల ఇతిహాస గాథలతో పౌరాణిక నాటకాన్ని తెలుగు కవులు బలిజేపల్లి లక్ష్మీకాంతం, గుర్రం జాషువాలు అద్భుతంగా వ్రాశారు. ఆ పద్యాలు ఈరోజుకీ ప్రజల నాలుకలపై పలుకుతునే వున్నాయి. " భక్తయోగ పదన్యాసి వారణాసి/ భవదురిత శాత్రవఖరాసి వారణాసి/ ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము నిప్పులలో కరిగిపోయె/ ఓ అయ్యలారా, ఓ అమ్మలారా, కాశీపుర వాసులారా... దాసిగా ఈమెను గొనరయ్య ఓ ధన్యులారా... వంటి తెలుగు పౌరాణిక పద్యాలు తెలుగు సమాజం ఉన్నంతవరకు ఉంటాయి. హరిశ్చంద్ర ఘాటులో నిత్యమూ జరుగుతున్న శవ దహనాలు చూస్తే తెలుగు పద్యాలలోని హరిశ్చంద్రుడు, చంద్రమతి గుర్తుకు వస్తారు.

14వ శతాబ్దానికి చెందిన శ్రీనాథ మహాకవి కాశీ ఖండాన్ని కావ్యముగా వ్రాసాడు. ఇక దుర్భేద్యమైన కొండలు, గుట్టలు, వాగులు, వంకలు, దాటుకుంటూ సత్రాల్లో విశ్రాంతి తీసుకొని "మజిలీలు" తో చేసే కాశీయాత్రలో కథలు లేకపోతే ప్రయాణమే సాగదు. అందుకే రాజమహేంద్ర వరానికి చెందిన మధిర సుబ్బన్న దీక్షితులు కాశీమజిలీ కథలు వ్రాసారు. అవి 1970 వరకు తెలుగు లోగిళ్లలో ఉండేవి.

1830 మే 18న చెన్నపట్నం నుండి కాశీయాత్రకు కాలి నడకన 40 మందితో బయలుదేరి 40 బిందెలు కాశీగంగతో సెప్టెంబర్ నెలకు యింటికి చేరుకున్న ఏనుగుల వీరాస్వామయ్య తన ప్రయాణ అనుభవాలతో రాసిన "నా కాశీయాత్ర"ను 1938లో కోమలేశ్వరుపు పిళ్ళై పేరుతో అచ్చయ్యింది. 1941లో దిగవల్లి వెంకట శివరావు సంపాదకత్వంలో మూడవసారి అచ్చు అయ్యింది. బహుశా తెలుగు యాత్రాసాహిత్యంలో ఇదే మొదటి పుస్తకం. అక్కడకు 100 సంవత్సరముల తరువాత రైలు, బస్సు సౌకర్యాలు వంటి రవాణా సౌకర్యాలు

ఏర్పడిన తరువాత చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి (తిరుపతి వెంకట కవుల్లో ఒకరు) తన కాశీయాత్ర అనుభవాలతో ఒక పుస్తకాన్ని వ్రాసారు.

తెలుగు గ్రామాల్లో ఇప్పటికీ కాశీ కావడితో ఇంటింటికి వచ్చి అమ్మా అన్నపూర్ణేశ్వరీ భిక్షాందేహి అని యాచన చేసిన వారు కూడా ఉన్నారు. విజయనగర సామ్రాజ్యాధిపతి శ్రీ కృష్ణదేవరాయలు కూడా కాశీని సందర్శించారు. దానికి గుర్తుగా విజయనగర ఘాట్ ఉంది. ఆంధ్రప్రదేశ్ కు చెందిన విజయనగరం సంస్థానాధిపతులకు కాశీతో విడదీయరాని సంబంధం ఉంది. విజయనగరం మొదటి జమీందార్ నారాయణ గజపతి 40 ఏళ్లు కాశీలోనే గడిపారు. విజయనగరంను కాశీగా మార్చివేయాలని ఉద్దేశ్యము కలిగినవారు. ఆ కారణముచేత కాశీ నుండి పండితులను విజయనగరంనకు రప్పించి తగు సన్మానాలతో గౌరవించేవారు. కాశీలో సంస్కృత విద్యాపీఠాలు ఉండటం చూసి, సంస్కృత కళాశాల స్థాపించారు. అభినవ ఆంధ్రభోజుడు శీ ఆనంద గజపతి మహారాజు (1850-1897) కాశీ కళాకారులతో విద్యావినోదాలు జరిపించేవారు. వీరి కాలములోనే 200 తెలుగు కుటుంబాలు కాశీలో నివాసము ఏర్పరచుకున్నారు. కాశీలో విజయనగరం ఘాట్ కూడా వుంది.

ఇక కాశీలోని బెనారస్ హిందూ విశ్వవిద్యాలయంలో అనేక మంది తెలుగువారు చదువుకొని పెద్ద పెద్ద ఉద్యోగాలలో స్థిరపడ్డారు. తెలుగు, సంస్కృత విభాగాల్లో పరిశోధనలు జరిపి, ఉద్యోగాలు పొందిన వారు ఉన్నారు. కాశీలో తెలుగు విద్యాపీఠ్ కూడా ఉంది. కాశీలో పిండప్రదానం చేసేందుకు తెలుగు పండితులు ఉన్నారు. వీరు మూడు తరాలు నుండి కరీంనగర్ జిల్లా, మంథని ప్రాంతము నుండి వచ్చామని చెప్తారు. అప్పుడప్పుడు వీరు తెలుగు ప్రాంతాలను, వెంకటేశ్వరుని దర్శిస్తుంటారు.

కాశీలో అడుగు పెట్టగానే గుర్తుకొచ్చేది బెంగాలీటోల. ఇక్కడ తెలుగుభాష రానివారు ఎవరూ ఉండరు. తెలుగు వంటలు, ఇడ్లీ, అన్నము, సాంబారు లభిస్తాయి. కాశీలో ఆర్యవైశ్య సత్రము, కరివెన వారి సత్రము, మరికొన్ని తెలుగు సత్రాలుతో పాటు 50 ఏళ్ళ క్రిందట తెలుగు యాత్రికుల కోసం ప్రారంభించిన శ్రీ తారక రామాంధ్రాశ్రమం ఉంది. తెలుగు ప్రాంతాల నుండి వచ్చే వందలాది భక్తులుకు మూడు రోజులు పాటు వసతి, భోజనసదుపాయాలు, రైలు, రవాణా సౌకర్యాలు కల్పిస్తుంది. 2010లో ఈ ఆశ్రమం స్వర్ణోత్సవాలు జరుపుకుంది. ఇక కాశీలోని అన్నపూర్ణ సత్రములో భోజనము తెలుగువారి కోసం కాశీ అన్నపూర్ణమ్మే వండి పెట్టిందా అన్నంత తృప్తితో అన్నం, సాంబారు, కూరలు, పచ్చళ్ళు వడ్డిస్తారు.

కాశీ సందర్శించిన తరువాత చివరిగా కాశీ గ్రామదేవత "గవ్వలమ్మ" గుడిలో కూడా తెలుగుపాట వినిపిస్తుంది. గవ్వలమ్మ కాశీవిశ్వేశ్వరుని చెల్లెలుగా చెబుతారు. అక్కడ భక్తులు దేవతకు గవ్వలు సమర్పిస్తారు. గవ్వలమ్మేవారందరూ తెలుగులోకూడా మాట్లాడు తారు. గవ్వలు సమర్పించునపుడు అక్కడ పూజారి పాడే తెలుగుపాట *"గౌరీ ఫలం మాకు/కాశీ ఫలం హమ్కో /గవ్వల ఫలం నీకు"* అని చెబుతూ పాడుతుంటే ఎంతో ముచ్చట వేస్తుంది. కాశీలో కొన్ని ప్రాంతాల్లో సంగిడీరాళ్ళను చూడవచ్చును. అవి ఉత్తరాంధ్రలోని యాదవ కులస్తులుగల గ్రామాల్లో సంగిడీ పోటీలను (బరువులు ఎత్తడం, వెయిట్‌లిఫ్టింగ్) తలపిస్తాయి. చివరగా సత్రం నుండి తిరిగి ఊరుకు వస్తున్నప్పుడు అక్కడి అంగడి వర్తకులు, హోటల్ వారు అక్కా, అన్నా, మరలా కాశీ ఎప్పుడు వస్తారని ఆప్యాయముగా అడుగుతుంటే మనస్సునకు ఆర్ద్రత కలుగుతుంది.

ఇలా కాశీతో తెలుగువారి అనుబంధం కలకాలం కొనసాగి తెలుగు భాషా సంస్కృతులు వర్ధిల్లగలవని కోరుకుందాం.



- సన్నిధానం నరసింహశర్మ
92920 55531

## కమ్యూనిష్టుగా జీవించి, భక్తుడుగా మారిన

# మహీధర జగన్మోహనరావుగారు



వాస్తవాల అద్దం చరిత్ర. మన సంఘసంస్కరణ చరిత్రలో వీరేశలింగం, రఘుపతి వంటివారు మనకు తరతరాలకు స్ఫూర్తినిచ్చారు. అయితే ఈ సేవాంకితులకు స్ఫూర్తికాంతుల్ని ఇచ్చింది రాజా రామమోహన రాయలు వంటి మేటి వంగ ప్రముఖులనేది చరిత్ర చాటుతుంది.

సుభాసు చంద్రబోసు, రవీంద్ర కవీంద్రుడు, శరత్, జగదీశ చంద్రబోసు, వివేకానందుడు, బిపిన్‌చంద్రపాల్, రాజారామమోహన రాయ్, ఇలా చాలా చాలా రంగాల శక్తిమూర్తుల్ని వంగదేశం ప్రసాదించింది, ప్రభావితం చేసింది.

అయితే స్వాతంత్ర్యం వచ్చాక దేశభక్తి, భాషాప్రయుక్త రాష్ట్రాలు వచ్చాక మాతృభాషాసక్తి (ముఖ్యంగా మన తెలుగువారికి) తగ్గుతోందా అనే ఆవేదనా కోణం గుచ్చుతూనే వుంది. ఇంక సామాజిక రంగంలో సవాలక్ష అంశాలు కలిపేవి వున్నా విడదీసే అంశాలకు ఎక్కువ మక్కువ చూపిస్తున్నామేమో!

చరిత్ర, సాహిత్యం, కళలు, భాషా సాహిత్యాలు వంటి అంశాల్ని గాలికొదిలేస్తే మన మనుగడ రసంలేని పిప్పిచెరకుగడ కాక ఏమవుతుంది? గత తరాలవారు ఎన్నో విలువల్ని అనేక రంగాల్లో మనకు అందించారు కానీ అందిపుచ్చుకోవటంలో ఆమడ దూరంలో ఉన్నాం మనం!

వీరేశలింగంతరంవారు సామాజికాంశాలలోనూ రాజా రామమోహన రాయ్, బ్రహ్మ సమాజం ఆశయాలను బాగా అందిపుచ్చుకున్నారు.

మహీధర – 'రామమోహన'రావు, జగన్ 'మోహన'రావు, కృష్ణ 'మోహన్', నళినీ 'మోహన్' ఈ పేర్లు పెట్టుకోవడం లోను, 'రామమోహన' గ్రంథాలయం వంటివి నెలకొల్పబడడంలోనూ రాజా రామమోహన్‌రాయ్ భావ సమ్మోహనాస్త్రమే కారణం.

మహీధరవారి కుదురు తూర్పు గోదావరిలోని ముంగండ అగ్రహారం. మొగలాయీ ప్రభువుల అభిమానాన్ని చూరగొన్న విద్వత్కవి పండితరాయలు ముంగండ వాడే. 'మాది తెనాలి'లా మాది ముంగండ అని చెప్పుకోవడానికి ఉవ్విళ్ళూరే ఆవూరి వారెందరో! ఆ అగ్రహారంలో మహీధరవారు కమ్యూనిజానికి అగ్రతాంబూలమిచ్చి ఎర్రదనాన్ని వ్యాపించడానికి 'విశ్వసాహిత్యమాల' గ్రంథప్రకాశన సంస్థను నెలకొల్పారు.

మా గురువుగారు ఆరుద్రగారు గౌతమీ పొత్తపుగుడికి విచ్చేసిన సందర్భాన 'శర్మగారూ! ఓసారి మహీధర జగన్మోహనరావు గారింటికి వెళ్ళొద్దామా' అన్నారు. రిక్షాలో వెళ్ళాం, ఇన్నీస్‌పేటలోని మహీధర గృహానికి. ఆధునిక కాలంలో గ్రాంథిక భాషా వ్యామోహంతో 'సమాలోచన' అనే సాహిత్య పత్రికను నడపిన బులుసు సీతారామ శాస్త్రి గారింటి ప్రక్కనే మహీధర జ.మో.రా వుండేవారు. పుస్తక రచనేకాదు, అచ్చువేయడమే కాదు, బైండింగు చేయడమే కాదు, పుస్తకాలు పార్సిలు కట్టడంలో అన్నిటా సవ్యసాచి ఆయన. పుస్తకాల పార్సిలు కడుతున్న జగన్మోహనరావు ఆరుద్రగారు రావడం చూసి "ఏమయ్యా ఆరుద్రా ఇంకా మేం గుర్తున్నామా?" అన్నారు. "గుర్తుండే కదండీ మిమ్మల్ని చూడడానికి రావడం. మీ విశ్వసాహిత్యమాల వేసిన కమ్యూనిస్టు గ్రంథాలు చదివే మేం ఇలాగయ్యాం" అన్నారు.

వందేళ్ళకు మించిన చరిత్రగల ప్రయివేటు గౌతమీ గ్రంథాలయానికి చివరి కార్యదర్శి మహీధర జగన్మోహనరావుగారు, చివరి గ్రంథభాండాగారాధికారిని నేను కావడం వాస్తవాంశాలు.

స్థాపకులు నాళం కృష్ణారావుగారి జీవితాంకిత సేవల తర్వాత గౌతమికి ఆమధ్యకాలంలో పునర్వైభవం తీసుకురావడానికి జగన్మోహనరావు పడిన తాపత్రయం, క్రియాత్మక సేవలూ మరచిపోలేనివి. దొరతనానికి, ఆర్థిక సహాయానికి దరఖాస్తులో నేను 'గౌతమీ గ్రంథాలయం' అని రాస్తే మహీధర "మన గ్రంథాలయం పేరు శ్రీ గౌతమీ గ్రంథాలయం. లేని శ్రీకి (ధనానికి) దరఖాస్తు చేయమంటే నువ్వు వున్న 'శ్రీ'ని తీసేస్తున్నావ్ అన్నారు చమత్కారంగా. రాజమహేంద్రవరానికి తీసుకొచ్చిన విశ్వసాహిత్యమాల ద్వారా ఘన గ్రంథాలూ, తన గ్రంథాలూ ఇతరులవీ 50, 60 దాకా ప్రచురించారు. తాజాగా వచ్చే ఆంగ్ల గ్రంథాల్ని సైతం మథిస్తూ చదివి వాని ఆత్మాంశాల్ని గ్రంథాలయ సందర్శకులకు పాఠకులకు చెప్పి ఆసక్తి కలిగించేవారు. గ్రంథాలయం బయట సిమెంటు గోడ వార్తా పత్రికను ఏర్పాటుచేశారు. రోజూ ఉదయం నాచే ప్రముఖ వార్తలూ అవీ రాయించేవారు. ఋగ్వేదానికి సరళ పద్యానువాదం చేసినవారు ఉత్తరాంధ్రకు చెందిన నేమాని వేంకట నరసింహశాస్త్రిగారు. ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఆ శ్రీమదాంధ్రీకృత పద్య ఋగ్వేద సంపుటాలు (20పైగా వుండేవి) రాత ప్రతులు శ్రీ గౌతమీ గ్రంథాలయానికి వచ్చేలా పంచాగ్నుల ఆదినారాయణ శాస్త్రి మహోదయులు కృషి చేశారు. దాని మచ్చుపుటల్ని అచ్చువేసి దాని ముద్రణావశ్యకతను ప్రచారం చేశారు మహీధరవారు. ఆ పెద్దపెద్ద రాతప్రతులు వడ్లమూడి గోపాలకృష్ణయ్య 'రాక్షస కృషి వల్ల' తిరుమల తిరుపతి దేవస్థానం లక్షల వ్యయంతో ప్రకటించడం అవిస్మరణీయ అంశం. రెవరెండు కె. ప్రశాంతకుమార్ 'గౌతమీ' అధ్యక్షులుగా ఉన్నప్పుడు టి.టి.డితో ఒప్పందం ప్రకారం వెలుగు చూశాయి. దానికి మహీధర బాట వేశారు. ప్రథమ ప్రపంచ తెలుగు మహాసభలు జరిగినప్పుడు ఆ సభల్లో గౌతమీ గ్రంథాలయ సంక్షిప్త చరిత్రను ఇస్తూ, ఇటువంటి

గొప్ప గ్రంథాలయానికి తగిన భవనం లేకపోవడం గుర్తుచేస్తూ దానికి అందరూ సహకరించాలని- వందల కరపత్రాలు పంచిన ఉద్యమశీలి ఆయన.

గౌతమీ గ్రంథాలయం సర్వజన సమాదరణీయ గ్రంథసంస్థ. అయితే కమ్యూనిస్టులకు ఆ సంస్థతో చివరకంటా సంబంధాలుండేవి.

దేశమంతా నెత్తిన పెట్టుకున్న కమ్యూనిస్టు పుచ్చలపల్లి సుందరయ్య తాను వంటెద్దు పార్వతీశంతో (స్వాతంత్ర్య సమర యోధుడు) గౌతమీ గ్రంథాలయానికి వెళ్ళి ఆంధ్రపత్రిక దినపత్రికలు తన తొలినాళ్ళలో చదువుకొనే వాడినని ఆయనే రాసుకొన్నారు. పందిరి మల్లికార్జునరావు శ్రీ గౌతమీ పాలకవర్గంలో (1930 ప్రాంతంలో?) సభ్యుడుగా ఉండడమే కాక మద్రాసునుండి తన పుస్తక సేకరణల్ని జగన్మోహనరావు ఆసక్తివల్ల గౌతమికి అందజేశారు. మహీధర జగన్మోహనరావు తూర్పు గోదావరిజిల్లా కమ్యూనిస్టుపార్టీలో ఒక పాత్ర వహించిన కాలం వుంది.

'జనులు - మహాజనులు', 'మానవులు, మహీధరములు,' 'సెలవుల్లో' అనే గ్రంథాలు రచయితగా జగన్మోహనరావుకు మంచిపేరు తీసుకొచ్చాయి.

ఏపుస్తకం ఏకాలంలో ప్రజలు ఆదరిస్తారో మనం చెప్పలేం. ఆయన విశిష్ట సంకలనం 'సూక్తి ముక్తావళి'ని ప్రజలు నెత్తిమీద పెట్టుకున్నారు. జానపద వాఙ్మయోద్ధారకులు నేదునూరి గంగాధరంగారి 'వ్యవసాయ సామెత'లను ప్రకటించిన ఘనత జగన్మోహనరావుగారి విశ్వసాహిత్యమాలవారిదే.

నిత్య సంచలన కార్యక్రమశీలి ఆయన. తపాలా బిళ్ళల సేకరణలో యువకుల్ని మించిపోయేవారు. ఒక అరుదైన తపాలా బిళ్ళను ఎవరో తస్కరిస్తే డిటెక్టివ్‌లా పరిశోధించి దొంగను పట్టుకొని తన తపాలాబిళ్ళను రక్షించుకున్న యువక చైతన్య మాయనది.

రాజమహేంద్రిలో సన్నసన్న ఇరుకిరుకు వీధుల్లో పెద్ద వయస్సులోనూ సైకిలుపై వేగంగా వెళ్ళిపోయేవారు. కొందరిళ్ళల్లోకి వెళ్ళి ఈ పుస్తకాలు మీకెందుకు, ఇన్ని కుర్చీలు మీరేం చేసుకుంటారని గద్దించి అడిగి వానిని గ్రంథాలయానికి చేర్చేవారు.

ఒకవైపు సంస్కృత శిక్షణా తరగతులు, మరొకవైపు యోగాసనా కేంద్ర కార్యకలాపాలు, ఇంకొకవైపు కంచుమర్తి బాబాయమ్మ హాలులో సాహిత్య సభలు, చర్చాగోష్ఠులు, గ్రంథ సమీక్ష సభలు, కవి, పండిత, రచయితల సమ్మేళనాలు... ఓహో! ఎంత గొప్ప సాంస్కృతిక చైతన్య కాలం ఆయన కార్యదర్శిగా ఉన్నకాలం! ఆయన సంభాషిస్తుంటే ఎన్నెన్నో తెలుగు సామెతలు సమయ సందర్భ కాంతివంతాలుగా ఉండేవి. అశ్లీలంగా కొందరు సూచించే 'అవ్వ తీసిన గంధం...' వంటివెన్నో ఆయన నోట అలవోకగా వచ్చి మమ్మల్ని విభ్రాంతి పరచేవి. రచనల్లో తెలుగుదనం మాట అలావుంచి అసలు మనం సంభాషణల్లో తెలుగుదనం రక్షించుకుంటున్నామా అనిపిస్తుంది ఆయనను తలచుకుంటే! భాషపట్ల, సాహిత్యం పట్ల, సంస్కృతిపట్ల మాత్రమే కాదు విశ్వవిజ్ఞాన వీక్షణ అవసరమని, హేతు దృక్పథం అవసరమని ఆయన యువతరానికి ప్రబోధించేవారు. 'నిందు మనంబు నవ్య నవనీతము' పద్యానికి ఆయన ఓ ఉదాహరణ.

మాజీమంత్రి, నిస్వార్థతకు ప్రతిబింబం డా॥ ఏ.బి. నాగేశ్వరరావు దగ్గరకు జగన్మోహనరావుగారితో పాటుగా నేనూ వెళ్ళాను. ఆయనతో జగన్మోహనరావు "గౌతమికి నేను అంతో యింతో సేవజేశాను. ఇప్పుడు రాజకీయాలు పెరిగిపోతున్నాయి. ఎవర్ని నేను పాలకవర్గ సభ్యుడుగా చేశానో వారే నన్ను వద్దంటున్నారు" అన్నారు ఆవేదనతో.

అప్పుడు డా॥ ఏ.బి. "సంస్థలనేవి మన యిళ్ళుకావు. వారు వద్దన్నారంటే మానేయండి. లేదా నిలద్రొక్కుకు వుండండి. ఎన్నికలనేవి వుండి పదవుల్లోకి వచ్చినప్పుడు రాజకీయాలు తప్పనిసరిగా ఉంటాయి." అన్నారు, అనుభవంపండిన గుండెతో.

వందేళ్ళకు పైబడ్డ చరిత్రగల శ్రీ గౌతమి పొత్తపుగుడి ఎందరినో చూసింది. అందులో జగన్మోహనరావుగారు తన పునర్వైభవానికి పాటుపడిన కుమారరత్నం అని ఆతల్లికి తెలుసు.

1970 దశకంలో గుడివాడలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయసేవక మహాసభలు జరిగాయి. అందులో అయ్యంకి వెంకటరమణయ్యగారి అధ్యక్షతన ప్రాచీన గ్రంథాలయాలపై నా ఉపన్యాసం ఏర్పాటవటం యువకునిగా నాడు నాకు మహీధర ఇచ్చిన ప్రోత్సాహానికి స్వచ్ఛ వాత్సల్య దర్పణం.

ఇంతకీ ఆ సభలకై మహీధర గుడివాడకి కూడా తీసుకువెళ్ళారు. స్టేషనులో దిగాం. నేను నా టిక్కెట్టు పారేసుకున్నాను. ఆయన టిక్కెట్టు ఆయన చేతి రుమాలు చిరుమూటలో వుంది. విషయం చెప్పాను. కంగారు పడకు. నా టిక్కెట్టు నువ్వు తీసుకుని రాజమార్గంలో వెళ్ళు అని నన్ను సురక్షితంగా పంపారు. తాను ప్లాటుఫారం చివరికి వెళ్ళి పంచెను సరిగా బిగించుకుని, నిలువు ఇనుపబద్దెల్ని జాగ్రత్తగా దొంగతనంగా దాటి అలా బయటికి వచ్చారు. బయటికి వచ్చాక, కలిశాక ఆయనకు నేనో ప్రశ్న వేశాను. "మీరు స్వాతంత్ర్య సమర యోధులు. ఆదర్శంగా ఉండవలసినవారు కదా అలా దొంగతనంగా రావచ్చా?"

"నీగురించి- కుర్రాడివి ఎక్కడ కంగారు పడతావో అని నేను అలా వస్తే మళ్ళీ నీ యక్షప్రశ్నేకటేమిటి? అయితే విను. మనం టిక్కెట్టు కొన్నాం. రైల్వేని మోసం చేసి దొంగతనంగా దాటిరాలేదు. ఇది మన హృదయం మనకి చెప్పే ధర్మం. ఆపద్ధర్మం కాకపోయినా అదోధర్మం. బలే ప్రశ్న వేశావయ్యా" అన్నారు నవ్వుకుంటూ. ఆయన నాకు గురు సమానుడు. గురువులు శిష్యుల్ని కన్నవారికన్నా ఎక్కువగా చూసుకునేవారు. ఇటువంటి తీపి గురుతులు బతుకుల్ని ఆనంద రసమయం చేస్తాయి.

రచయితగా, అనువాదకునిగా, ప్రజలలో వైజ్ఞానికదృష్టికై తపన పడిన వ్యక్తిగా, శ్రీ గౌతమీ గ్రంథాలయ పునర్వైభవ కారకునిగా మహీధర జగన్మోహనరావు గొప్పవ్యక్తి.

కమ్యూనిస్టుగా జీవించిన జగన్మోహనరావు చివరికాలంలో ఆస్తికునిగా, ఒక మాత్రపు భక్తునిగా మారిపోయారు. ఆయన సోదరుడు, నవలా రచయిత మహీధర రామమోహనరావు ఈ మార్పుని విమర్శిస్తూ "ఇప్పటి దాకా బాగావుండి ఇప్పుడిలా పాడయిపోయావన్నమాట" అని రాస్తే జగన్మోహనరావు "నేను ఇప్పటికి బాగుపడ్డాను అని భావిస్తున్నాను" అని రాశానని నాకు చెప్పారు.

నమ్మినవాటిపట్ల విశ్వాసాలు అనుభవాలనుండే వస్తాయి మరి.

-ద్వానాశాస్త్రి
9849293376

# తెలుగు చదివితే ఉద్యోగాలొస్తాయ్

ఆంగ్లభాష వస్తేనే, ఆంగ్లమాధ్యమంలో చదివితేనే ఉద్యోగాలొస్తాయని ప్రగల్భాలు పలికేవారు "సర్వే" చేసి మాట్లాడుతున్నారా? అలవోకగా ప్రకటనలు చేస్తున్నారంతే. ఇప్పుడు యాభైసంవత్సరాల పైబడిన రాజకీయవాదులు, అధికార్లు ఆంగ్లమాధ్యమంలో చదువలేదు గదా? కాకపోతే ఆంగ్లభాష వచ్చు. వచ్చు అంటే మామూలుగా వచ్చు . డ్రాఫ్ట్ లేదా ఒక ప్రాజెక్టు రిపోర్ట్‌ను తప్పులేకుండా రూపొందించగలరా? తెలుగుతోపాటు ఆంగ్లం చదివితే ఉద్యోగ అవకాశాలు మెండుగా వున్నాయన్నది యువతతో నాకు గల ముప్పయి సంవత్సరాల అనుభవం.

తెలుగు చదివితే, రాయటం వస్తే నేటి ప్రసార పత్రికా మాధ్యమాలలో ఉద్యోగాలు వస్తున్నాయ్. వార్తల సేకరణకర్తగా, విలేఖరులు, సహ సంపాదకులుగా, డి.టి.పి. ఆపరేటర్లుగా, ప్రింట్‌మీడియా నిర్వాహకులుగా ఉద్యోగాలున్నాయి. ఆంగ్ల మాధ్యమంలో బి.టెక్, ఎం.టెక్., ఎం.బి.ఎ.లు, చదివి ఉద్యోగాలు రాక, సివిల్స్ పరీక్షలలో తెలుగు భాషాసాహిత్యాలు చదివి ఉద్యోగాలు కాదు - ర్యాంకులు సాధిస్తున్నారు. తెలుగు మాధ్యమానికి తెలుగు భాషా సాహిత్యాలకు కీర్తి పతాకను ఎగురవేసిన రోణంకి గోపాలకృష్ణను చూసి అయినా ప్రభుత్వం కళ్ళు తెరవాలి. గ్రూప్ 1, గ్రూప్ 2, లలో తెలుగు చదివిన నా శిష్యులు ఎంతోమంది ప్రభుత్వోద్యోగాలు పొందారు. వారి వివరాలు సంగ్రహంగా తర్వాత వెల్లడిచేస్తాను. సివిల్స్‌లో మాతృభాషను తప్పనిసరి చేసింది కేంద్రప్రభుత్వం. అది రాజ్యాంగబద్ధమని న్యాయకోవిదులు స్పష్టీకరించారు. కొన్ని రాష్ట్రాలు రాష్ట్రంలోని పోటీ పరీక్షలకి మాతృభాషపై నూరుమార్కుల పరీక్షా పత్రం తప్పనిసరి చేశాయన్న సంగతి ప్రభుత్వానికి తెలుసు. వై.ఎస్. రాజశేఖరరెడ్డి గారు అధికారంలో ఉండగా గ్రూప్ 1, గ్రూప్ 2 పరీక్షలలో ఆప్షనల్ (తెలుగుతోసహా) పద్ధతి రద్దుచేసి తెలుగుకి తీవ్రనష్టం కలిగించారు. గ్రామీణ, మధ్య తరగతి అభ్యర్థుల్ని నిరాశానిస్పృహల్లో ఉంచారు.

డా.కె.వి.రమణాచారిగారు, డా. రాళ్ళబండి కవితా ప్రసాద్‌గారు. మేడిశెట్టి తిరుమలకుమార్ గారు, పూర్ణచంద్రరావుగారు. కృష్ణబాబుగారు వంటి ఎందరో ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్., ఐ.ఆర్.ఎస్., లు తెలుగుభాషా సాహిత్యాలు చదివి అధికారులయ్యారు. నా శిక్షణలో తెలుగు చదివి గ్రూప్ 1, గ్రూప్ 2, లో విజయం సాధించినవారు వేల సంఖ్యలో ఉన్నారు. (గత 20 సం॥లుగా)

"తెలుగు తీసుకొని డి.ఎస్.పి. ఉద్యోగం సాధించాను. చాలా తేలిగ్గా అర్థమవటం వల్ల మార్కులు బాగావచ్చాయి" -హేమంతనాగరాజు

"తెలుగు భాషా సాహిత్యాలపై మక్కువతో చదివి ఫస్ట్‌ర్యాంక్ సంపాదించి మునిసిపల్ కమీషనర్‌గా చేస్తున్నాను" -కంఠమనేని శకుంతల

"తెలుగు మాతృభాష కావటం వల్ల అర్థం చేసుకొని బాగా రాయగలిగాను. గుర్తు పెట్టుకోవటం సులభమైంది." -పి. అరుణ్ బాబు, డెప్యూటి కలెక్టర్.

"నాకు తెలుగంటే ఉన్న కొద్దిపాటి ఆసక్తి పోటీ పరీక్షలవల్ల ఎక్కువైంది. మాతృభాషాభిమానం ఏర్పడింది." -ఆర్.బి.పెద్దిరాజు, ఎక్సైజ్ సబినస్పెక్టర్

"నాకు తెలుగంటే భయంగా ఉండేది. కానీ మార్కులు బాగావస్తాయనీ, ఆసక్తిగా వుంటుందనీ చెప్పడంతో తెలుగు భాషాసాహిత్యాలు ఎంచుకొన్నాను. తెలుగు వల్లనే ఉద్యోగం వచ్చింది. - పి స్రవంతి ఎ.పి.ఒ

"తణుకులో కొప్పర్తి మేష్టారుగారి వల్ల గ్రూప్ 2లో తెలుగు తీసుకున్నాను. తెలుగు ఇంత బాగుంటుందా అనిపించింది. డెప్యూటీ తాశీల్దార్‌గా ఎంపికయ్యాను." - దేవకీదేవి

ఇలా ఎంతో మంది పోటీ పరీక్షలలో తెలుగు భాషాసాహిత్యాలు ఎంచుకొని అనుకున్నది సాధించారు. "మాతృభాష మాకు అన్నం పెడుతోంది. ఆంగ్లభాష మాకు అండగా వుంటోంది" అంటున్నారు. ఇటీవల ఒక ఉర్దూ అమ్మాయి సివిల్స్‌లో తెలుగు ఎంచుకొని ఉద్యోగం సంపాదించింది. ఇది స్థాలీపులాకన్యాయంగా సేకరించిన సమాచారం. అయితే తెలుగు చదివి ఉద్యోగాలు సంపాదించే అవకాశం లేకుండా యువతను పక్కదోవ పట్టిస్తున్న వారినేమనాలి? "మాతృభాషా తృణీకారం-మాతృమూర్తి తిరస్కారం" అన్నారు [illegible]

## తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఘనకార్యం
## తెలుగు, సంస్కృతం చెప్పే జూనియర్ లెక్చరర్లకు ఆంగ్లం తప్పనిసరి.

ప్రభుత్వ రెసిడెన్షియల్ కళాశాలల్లో తెలుగు, సంస్కృతం పాఠాలు చెప్పాలనుకునే జూనియర్ లెక్చరర్లు కచ్చితంగా ఆంగ్ల వ్యాకరణంపై పట్టు సాధించాలని తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఆదేశించింది. అభ్యర్థులు ఆంగ్ల వాక్యాల రూపకల్పన, ఆంగ్లంలో కాలాలు, క్రియాపదాలు, జాతీయాలు మొదలైనవాటిపై పట్టు సాధించాల్సి ఉంటుంది.

మరొక ఆందోళనకరమైన విషయమేమిటంటే వివిధ విషయాల బోధించే జూనియర్ లెక్చరర్లకు జరుగనున్న ఈ పరీక్షలకు ఎంపిక పరీక్ష పూర్తిగా ఆంగ్లంలో ఉండబోనున్నది. ఎంపిక పరీక్షలో అర్హత సాధించినవారు వ్రాయబోయే మెయిన్స్ పరీక్ష మాత్రం అభ్యర్థి ఎంచుకున్న భాషలో ఉంటాయి. అంటే సంస్కృతం-తెలుగు బోధించాలనుకునే అభ్యర్థులు ఆంగ్లంపై పట్టు సాధిస్తేనే కొలువు చేరతారు.

# పోటీపరీక్షల్లో తెలుగుతోనే ముందడుగు

తెలుగు అంటేనే మాతృభాష అని ఒకరు, సంస్కృతి సంప్రదాయమని మరొకరు ఇలా రకరకాలుగ చెబుతారు. ఈ రోజుల్లో అమ్మే అక్కర లేని వాడు అమ్మభాషను ఖాతరు చేస్తాడా? కనుక మనందరం కూడ ఆచరణాత్మకంగ ఆలోచించాలంటాను.

నేను ఈ క్రింద మాతృభాష అందునా తెలుగై ఉండడం వలన ప్రయోజనాలేమిటో వివరించాను గమనించండి.

తెలుగు బాగా వచ్చినవారు "ఈనాడు" వంటి ప్రామాణిక పత్రికల సంపాదకత్వ పుటను ఓ అరగంటలో ముగించవచ్చు. అదే బాగా ఇంగ్లీషు బాగా వచ్చినవారు సైతం "హిందూ" లాంటి పత్రికల సంపాదకత్వ పుటకు కనీసం రెండు నుండి నాలుగైదు రెట్ల సమయం తీసుకొంటారు. అందుకనే మీరు గమనించండి. మన దేశంలో సివిల్స్‌లో పైవరుసలోనివారందరూ కూడ వారివారి మాతృభాష మీద పట్టున్నవారే. ఐ.ఎ.ఎస్., ఐ.పి.ఎస్. వంటి పరీక్షల్లో హిందీ వారు ఎక్కువగ ఎంపిక కావడానికి ఒక ముఖ్య కారణం వారి మాతృభాషలోనే పరీక్ష ప్రశ్న పత్రాలుండడం, సామగ్రి మొత్తం లభించడం ఇత్యాది కారణాలు. మిగిలిన వారికి డిమాండు-సరఫరా కారణాల వలన అది లభించడం లేదు. అయితే ఇలాంటి వాటిని కూడ మన రోణంకి గోపాలకృష్ణ(తాజాగా సివిల్స్‌లో 3వ ర్యాంకు) అధిగమించి తనే తన భాషలో మెటీరియల్‌ను తయారు చేసుకొని కృతకృత్యులవడం మన మెరిగినదే. అలాగే మొదటిర్యాంకు సాధించిన "నందిని" కూడ తన మాతృభాష(కన్నడ)ను ఐచ్ఛికాంశంగ ఎంచుకొందంటే ఆభాషపై పట్టుండబట్టి సాధించినట్లే కదా! వీరే కాదు ఐ.ఎ.ఎస్. ఉన్నతులయిన మన తెలుగువారు శ్రీయుతులు ముత్యాల రాజు (ఇప్పటి నెల్లూరు జిల్లా కలెక్టరు), డి.వి. సుబ్బారావు (రిజర్వుబ్యాంకు మాజీ గవర్నరు), జె.డి.లక్ష్మీనారాయణ (సి.బి.ఐ. మాజీ డైరెక్టరు), జయప్రకాష్ నారాయణ(లోక్‌సత్తా) అందరూ కూడ మాతృభాష ఆలంబనతో ఎదిగిన వారే. ఇంగ్లీషుమీడియం చదివిన వారు కూడ ఎంపికవుతున్నారు కదా అని మీరు అనుకోవచ్చు. కాని దాదాపుగ వారు 'టాపర్స్' కాదు. ఎందుకంటే ఆ పరీక్షలో 1750 మార్కులకు గాను 1000 మార్కులకు సమకాలీన విషయాలకు సంబంధించి ఉండడం, వీరు వాటిని అమ్మభాషలోని దిన పత్రికల ద్వారా తక్కువ సమయంలో ఎక్కువ విషయాన్ని ఆకళింపు చేసుకొని పరీక్షల్లో రాయగలుగుతున్నారు.

ఇతర సౌలభ్యాల విషయానికి వస్తే ఆరోగ్యానికి, ఆనందానికి, జీవన సౌందర్యానికి మాతృభాష ఒక టానిక్ లాగ పని చేస్తుంది. చదవడం ఒక వ్యాపకంగా మీరు అలవాటు చేయగలిగితే టి.వి. చూస్తూ ఏదో ఒకటి తినడంతగ్గి, స్థూలకాయం లాంటి సమస్యలు లేకుండ ఆరోగ్యంగా ఉంటారు. ఎంత ఒత్తిడిలో ఉన్నా పత్రికలు మొదలైన వాటిల్లో ఒక మంచి కార్టూన్ చూడటమో, మంచి విషయం చదవడమో చేసి మానసిక ఒత్తిడిని జయించి తేజోవంతులౌతారు. అంతేగాకుండ వారికి తెలియకుండానే మానసిక తాజాదనం జరుగుతుంది. దాంపత్య జీవనం, వంటా వార్పూ, చిట్కాలు మొదలైన వెన్నో ఎంత వద్దనుకొన్నా కొన్నైనా అంతర్లీనంగ గ్రహించడం జరుగుతుంది. అదే మన భాష రానివారు ఒక వేళ పఠనార్హమైన ఇంగ్లీషు పుస్తకాలున్నా పైపైన అలా చూసి పడేస్తారు.

తెలుగు నేర్చుకొంటే ఏ ఇతర భాషనైన నేర్చుకోవడం వీలవుతుంది. కారణం ఇతర భాషలు నేర్చుకోవడానికి వీలుగ మనకంత అవసరం లేకపోయినా,ణ,శ,ళ వంటి అక్షరాలు ఏర్పరచడం జరిగిందంటారు. హిందీలో ఎత్వం, ఏత్వం ఒకే గుర్తు. అలాగే ఒత్వం, ఓత్వం కూడ ఒకటే గుర్తు...కాబట్టే మనవారు అన్ని రంగాలలోకి దూసుకుపోగలుగుతున్నారంటారు. భాషలో స్పష్టత వలన తెలుపుడు నేర్పరితనం(కమ్యూనికేషన్ స్కిల్స్) బాగాఅబ్బి ఏభాషనైన ఏ యాసలోనైనా మాట్లేడే వీలవుతుందంటారు. కనుక ఆంగ్ల మాధ్యమమైనా తెలుగును మన మాతృభాషగ కలిగి ఉండడం ఒక వరంగా భావించాలి.

**ఆనంద నాయుడు.వై**

## స్పందన

*జూన్ నెల అమ్మనుడి లో వారసత్వ విజ్ఞానం శీర్షిక క్రింద అచ్చుయిన విమాన-వ్యాసం మన పత్రిక పరువు తీసేలా ఉంది. అటువంటి వ్యాసాలు ప్రచురించి మన పనులను పాడుచేసుకోవద్దు. ఆ వ్యవహారం పై చాల అధ్యయనం జరిగింది. సుబ్బరాయశాస్త్రి రచించిన దొంగ శ్లోకాలు పాతవిలా కనిపిస్తాయి. కాని అవి కొత్తవి. ఆపుస్తకం ఇక్కడ విద్యాపీఠంలోను ఉంది. ఆయుర్వేదంలోనూ ఇలాగే టీకా వేయటం ప్రాచీనకాలంలో ఉందని బుకాయిస్తుంటే ఈ మధ్యనే జరిగిన పరిశోధన అది తప్పని నిరూపించింది. మీరు ప్రచురిస్తారంటే వివరాలు పంపగలను. కాని, అమ్మనుడి భాషకే పరిమితమైతే బావుంటుంది. లేకపోతె అసలుకే మోసం వస్తుంది.*

***డా. రంగనాయకులు***

http://www.thehindu.com/sunday-anchor/sunday-anchor-grounded-before-takeoff/article6775677.ece, http://www.indiatimes.com/technology/news/india-did-not-invent-the-worlds-oldest-plane-here-is-proof-that-the-vyamanika-shastra-is-

---

త్యాగయ్యపై రహ్మానుద్దీన్ షేక్ గారి వ్యాసం సందర్భోచితం. వారికి అభినందనలు. అయితే ఆయనకు త్యాగయ్య గురించి పూర్తిగా తెలియదని భావించవలసి వస్తూంది. త్యాగయ్య కీర్తనలలో మకుటాన్ని ఎవరో అపార్థం చేసుకున్నారనడం అర్థరహితం. ముఖ్యంగా త్యాగయ్య కూటికి లేని వాడు కాదు, యాచన చేసి బ్రతకడానికి. ఉంఛవృత్తి చేయడం ఆయనకొక ఆచారం మాత్రమేనని, త్యాగయ్య సంపన్న గృహస్థు అని సంగీత చరిత్ర కారుడు శ్రీరామ్ కూడా పరిశోధించి వ్రాశారు.

తర్వాత వుప్పల నరసింహం గారు సుబ్బరాయ శాస్త్రిగురించి వ్రాసిన వ్యాసం కూడా బాగుంది. అయితే తొలి విమాన నిర్మాతగా తల్పడే పేరు ఒక్కటే వ్యాప్తిలో ఉంది. ఆయనవద్ద విమానం వివరాలు బ్రిటిష్ వాళ్ళు సంగ్రహించారంటే సరే. అక్కడినించి రైట్ సోదరులకు అవి చేరాయనడం సహేతుకంగా లేదు.-**ప్రసాద్ యమ్.వి.యస్.**

ఫోన్:8500398580

# ప్రభుత్వ బడుల మూసివేతకు నిరసన



జూన్ 4వతేదీ ఆదివారం ఉదయం 10గంటలకు రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, ఉపాధ్యాయ సంఘాలతో రౌండ్‌టేబుల్ సమావేశం ఆర్టీఈ ఫోరం మరియు మాతృభాషా మాధ్యమ వేదిక ఆధ్వర్యంలో విశాఖపట్టణం- పౌరగ్రంథాలయంలో నిర్వహించారు.

ఆర్టీఈ కన్వీనర్ నరవ ప్రకాశరావు మాట్లాడుతూ "ప్రభుత్వం జారీచేసిన హేతుబద్ధీకరణ ఉత్తర్వు 29 ప్రకారం 3,220 ప్రాథమిక పాఠశాలలు మూతబడతాయి. ఫలితంగా 56వేలమంది బాలలు, మరియు యు.పి. పాఠశాలల్లో 6,7,8 తరగతులవల్ల 46 వేలమంది బాలలు విద్యాహక్కుకు దూరం అవుతారు. అలాగే బడులులేక పేద, దళిత, గిరిజన పిల్లలు చదువులు మానుకునే ప్రమాదం ఉంది" అన్నారు.

ఎమ్.ఎల్.సి. పి.వి.ఎన్.మాధవ్ మాట్లాడుతూ "ప్రభుత్వ ఉత్తర్వులను వ్యతిరేకించాలని, అందుకు తన సహకారముంటుందని అన్నారు. సంబంధిత మంత్రులతోను, ముఖ్యమంత్రితోనూ మాట్లాడి న్యాయం చేస్తానన్నారు. ప్రాథమికవిద్య తెలుగుమాధ్యమంగా కొనసాగాలని దానిని తల్లిదండ్రులు ప్రభుత్వంపై ఒత్తిడి ద్వారానే సాధించగలమని" అన్నారు. ఈ రౌండ్‌టేబుల్ సమావేశంలో సి.పి.ఐ., సి.పి.ఎమ్., జనసేన, కాంగ్రెస్, బి.జె.పి. మరియు ఉపాధ్యాయ-పౌరహక్కుల నేతలు పాల్గొని, ప్రభుత్వ చర్యలపై నిరసన తెలిపారు. రానున్న రోజుల్లో ఐక్యంగా పనిచేయాలని తీర్మానించారు.




## విశాఖపట్టణంలో న్యాయవాదులను కదిలించిన తెలుగు భాషోద్యమకారులు

జూన్ 13న తెలుగుభాషోద్యమకారులు జయంతి వి.ఎన్.ఎన్.మూర్తిగారి నేతృత్వంలో న్యాయస్థాన సముదాయానికి వెళ్ళి, న్యాయవాదులను కలిసి, న్యాయస్థానాల్లో తెలుగు వాడకం గురించి వారితో మాట్లాడారు. కార్యక్రమంలో వేదుల కామేశ్వర శర్మ, పరవస్తు సూరి, ఎమ్.ఎస్.మాధవ్ తదితరులు పాల్గొన్నారు. పారుపల్లి కోదండరామయ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. ముమ్ముందు ఈ విషయంలో కృషిని కొనసాగించాలని నిర్ణయించారు.

## వెలవెలబోతున్న వుడా తెలుగు మ్యూజియం

ప్రయాణ సౌకర్యాలు లేని కారణంగా పర్యాటకులు తెలుగు సాంస్కృతిక నికేతనానికి (తెలుగు సాంస్కృతిక మ్యూజియం) రావటం లేదు. ఈ మ్యూజియంను అట్టహాసంగా రెండేళ్ళ క్రితం కైలాసగిరి కొండ మీద ఏర్పాటు చేసారు. మ్యూజియంలో తెలుగు భాషకు సంబంధించిన బొమ్మా-మాటల లఘుచిత్రాల ప్రదర్శన మాత్రమే ప్రత్యేక ఆకర్షణ. ఈ మ్యూజియంను తెలుగు భాష చారిత్రక సంస్కృతిని అందరికీ చాటి చెప్పేందుకు ఏర్పాటు చేసారు. అయితే ఈ మ్యూజియం కోసం ఎంచుకున్న స్థలం, అక్కడికి ఏర్పాటు చేసిన రవాణా సౌకర్యాలు సరిగ్గా పని చేయకపోవడంతో పర్యాటకులు మ్యూజియంకు రావడం లేదు. రోజులో నాలుగు సార్లు ప్రదర్శించే లఘు చిత్రాలు కూడా నిడివి తగ్గించి, తక్కువ సార్లు ప్రదర్శిస్తున్నారు. వచ్చే అర కొర జనాలకి ఈ కాలపట్టిక తెలీక చూడలేకపోతున్నారు.

మ్యూజియం కైలాసగిరికి ఒకటిన్నర కిలోమీటర్ల దూరంలో ఉంది. అక్కడికి వెళ్ళాలంటే బ్యాటరీ తో నడిచే వాహనాలే మార్గం, కానీ నాలిగింటిలో ఒకటే పని చేస్తున్న బ్యాటరీ వాహనాలు వారాంతాల్లో పని చేసినా, వారపు రోజుల్లో పని చేయడం లేదు. వ్యక్తిగత వాహనాల రాకపోకలను అనుమతించకపోవడమూ పర్యాటకుల పల్చదనానికి మరొక కారణం.

ఈ మ్యూజియం అభివృద్ధికి ప్రపంచ బ్యాంకు ఇరవై కోట్ల నిధులు మంజూరు చేసిందన్న విషయం గమనార్హం.

- వాగుమూడి లక్ష్మీరాఘవరావు
9849448947

# తెలంగాణ తెలుగు గణితం

**సమాధానం నుంచి ప్రశ్నను తయారుచేసే పద్ధతి ఒకటి వుంది. లెక్కల్లో ఈ పద్ధతి మహోన్నత పద్ధతి. గణితాభిమానిని గణిత శాస్త్రవేత్తను చేసే పద్ధతి. కాబట్టి మనకున్న ఇలాంటి పద్ధతులను నేటి విద్యార్థులకు తెలియజేస్తే, తెలంగాణ తెలుగు-తెలంగాణ గణితం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది.**

ప్రపంచ తెలుగు మహాసభలను ఘనంగా నిర్వహించాలని ముఖ్యమంత్రి కేసీఆర్ చెప్పడం తెలుగు భాషాభిమానులకు మహదానంద విషయం. ఈ సందర్భంగా తెలంగాణలో తెలుగు భాషాభివృద్ధి, సాహిత్యాభివృద్ధి జరిగిన విధానాన్ని ప్రపంచానికి ఎరుకపరచాలన్న ముఖ్యమంత్రిగారి సదాలోచన ప్రశంసనీయం. అయితే నేడు తెలుగు నేర్చుకునేవారు, మాట్లాడేవారు ఎంతమంది ఉన్నారు? నేడు తెలుగు వెనుకబడటానికి శాస్త్రీయమైన కారణం ఏమిటి? అన్న విషయాలను గ్రహించి అందుకు తగ్గట్లుగా తెలుగు సభలను నిర్వహిస్తే, తెలంగాణలో తెలుగుభాష మునుముందు ఉన్నతస్థాయిన నిల్వడానికి అవకాశం ఉంటుంది. ముఖ్యమంత్రిగారి చొరవతో నిర్వహించ తలపెట్టిన తెలుగుసభలతో మహోన్నత ప్రయోజనం చేకూరుతుంది.

నేటి విద్యా ప్రపంచం గణిత, రసాయన, జీవశాస్త్రాల మీద ఎక్కువ మక్కువ చూపిస్తున్నది. ఆయా శాస్త్రాల పారిభాషిక పదాలు ఆంగ్లంలోనే అధికంగా ఉండటం వల్ల ఆంగ్లభాషలోనే విద్యాబోధన ఎక్కువ జరుగుతున్నది. మరి ఆయా పారిభాషిక పదాలు తెలుగులో లేవా? అంటే ఉన్నాయి. ముఖ్యంగా తెలంగాణ తెలుగులో ఎక్కువగా ఉన్నాయి. కానీ మరుగున పడిపోయాయి.

తెలంగాణ తెలుగులో గణిత పారిభాషిక పదాలు అనేకం ఉన్నాయి. దీనికి కారణం ప్రపంచానికి సున్నా(0)ను అందించిన ఆర్యభట్ట తెలంగాణవాడు కావడం. సున్నా కనిపెట్టిన తర్వాతనే దశాంశమానానికి చక్కని రూపం వచ్చింది. ఆర్యభట్ట క్రీ.శ.476-550ల నడుమ అస్మక దేశంలో జన్మించాడు. కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్, నేడు మహారాష్ట్రలో కలిసిపోయిన నాందేడ్‌లను అస్మకదేశం అని అంటారు. ఆర్యభట్ట 121 శ్లోకాలతో ఆర్యభట్టీయం అనే గ్రంథాన్ని రాశాడు. ఇది అమర భాషలో ఉన్నప్పటికీ భావజాలం, గణజాలం తెలంగాణ జనజీవన భావజాలానికి దగ్గరగా ఉంటుంది.

ఆర్యభట్ట గణితంలో ఉన్న బీజగణితం, వర్గం, వర్గమూలం, ఘనం, ఘనమూలం, క్షేత్ర గణితం, త్రికోణమితి వంటి అంశాలు ఆధునిక గణితంలో కూడా ఉన్నాయి. తెలంగాణలో వాడే కుంట, అరకుంట స్థలం వంటి లెక్కలకు దగ్గరగా ఇతని క్షేత్రగణిత లెక్కలుంటాయి. ఇలాంటి విషయాలను తెలుగు మహాసభల సందర్భంగా అయా ప్రాంతాలలోని విద్యార్థులకు ఎరుకపరుస్తూ, తర్వాత కాలంలో యీ అంశాలనే సిలబస్‌గా మలుచుకుంటే **తెలంగాణ తెలుగులో ఉన్న గణితం ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తుందన్నది అక్షరసత్యం. మన తెలుగు బతకాలంటే తెలుగులో ఉన్న శాస్త్రీయ పారిభాషిక పదాలు బయటకు రావాలి. ఆ పదాలను ఈతరం విద్యార్థులు శక్తిమంతంగా ప్రయోగించేటట్లు చెయ్యాలి. అంతేగానీ మన యాస అంటూ, యాసతో ఆగిపోయి, యాసలోని శాస్త్రీయతను పట్టించుకోకపోతే, ఆ యాస అక్కడితోనే ఆగిపోతుంది. మరలా అక్కడినుంచి ఆంగ్లమే దిక్కవుతుంది.**

రెండు ప్లస్ మూడు హోల్ స్క్వేర్ ఎంత అంటే.. రెండు ప్లస్ మూడు అయిదు. అయిదు హోల్ స్క్వేర్ 25. లేదా ఏ ప్లస్ బి హోల్ స్క్వేర్ సూత్రం ప్రకారం.. రెండు స్క్వేర్ నాలుగు, టూ ఏబి 12. బి స్క్వేర్ 9, నాలుగు, పన్నెండు, తొమ్మిదుల మొత్తం 25.. అని వివరించడం కన్నా ఓ పద్య రూపంలో చెబితే విద్యార్థి ఆలోచనాత్మకంగా ఆనందంగా ఈ లెక్క నేర్చుకుంటాడు.

*చిలుకలు చిలుకలు చెలిమిన*
*కలవన్; కళికలు కళికలు కళికలు కలిసెన్*
*తలపిరువదయిదు తలవగ*
*తలపుల్ తలచిన వివరణ ధరనతలపుమా..?*

ఈ కంద పద్యం చదివితే ముందుగ పోతనగారి సర్వలఘు కంద పద్యపోకడ తప్పక గుర్తుకువస్తుంది. అయితే దీనిని కందగర్భ మణిగణ వృత్తపద్యం అని అంటారు. అంటే.. ఈ పద్యంలో కందపద్య లక్షణాలు, మణిగణవృత్త పద్యలక్షణాలు రెండూ ఉన్నాయి. చిలుకలు కందమయితే మణిగణ వృత్తపద్యం కళికలు. ఇందులో సమాధానం నుంచి ప్రశ్నను తయారుచేసే పద్ధతి వుంది. లెక్కల్లో ఈ పద్ధతి మహోన్నత పద్ధతి. గణితాభిమానిని గణితశాస్త్రవేత్తను చేసే పద్ధతి. కాబట్టి మనకున్న ఇలాంటి పద్ధతులను నేటి విద్యార్థులకు తెలియజేస్తే, తెలంగాణ తెలుగు-తెలంగాణ గణితం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తుంది. **(నమస్తే తెలంగాణ సౌజన్యంతో..)**

## హర్యాణాలో తెలుగు భాష చదువు
## తెలంగాణా టుడే సద్దు

హైదరాబాదులో జూన్ 8 న జరిగిన కేంద్ర ప్రభుత్వ కార్యక్రమంలో అతిథిగా విచ్చేసిన హర్యాణా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖత్తార్ హర్యాణా-తెలంగాణా రాష్ట్రాల మధ్య సంబంధం మరింత మెరుగయ్యేందుకు పలు కార్యక్రమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. అందులో భాగంగా త్వరలో తెలంగాణా రాష్ట్రప్రభుత్వంతో ఒడంబడిక మీద సంతకం చేస్తామన్నారు. హర్యాణాలోని ఫరీదాబాద్, గుర్‌గావ్‌లలో తెలంగాణా నుండి పొట్టకూటి కోసం వలసవెళ్ళిన ఎందరో తెలుగువాళ్ళు నివసిస్తున్నారని ఆయన చెప్పారు. తెలుగు భాషలో ఒక కోర్సును హర్యాణాలోని ఏదైనా కళాశాల లేదా విశ్వవిద్యాలయం ద్వారా కరెస్పాండెన్స్ కోర్సు ద్వారా అందించే ప్రయత్నం చేస్తామని, అది అలా స్థిరపడిన తెలుగువారి పిల్లలకు ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు.

# ఉడుమలపేట (తమిళనాడు) లో తెలుగు తరగతులు

**త**మిళనాడులోని ఉడుమలపేట తాలూకాలో సుమారు 50 పల్లెలలో తెలుగు తరగతులు నడిచిన సంగతి చదువరులకు తెలిసిందే. ఇందులో 16 పల్లెలలో చదివిన 350 మందికి ఒరపురేకులు (సర్టిఫికేట్లు) ఇచ్చే వేడుక జూన్ 18, 2017న జరిగింది. ఈ వేడుకకు




ఉడుమలపేట తాలూకా ముక్కోణం పల్లెలోని శ్రీమహల్ వేదిక అయింది. తెలుగు చదివిన 350 మంది వారి పెద్దలతో కలిసి వేడుకకు వచ్చినారు. అయిదారు వందలమంది వేడుకలో పాలు గొన్నారు. వేడుకకు తెలుగువాణి మేనేజింగ్ ట్రస్టీ శ్రీ వేణుగోపాలరెడ్డి ముఖ్య అతిధిగా వచ్చినారు. తెలుగువాణి ట్రస్టీలు స.వెం.రమేష్, మార్టూరి వసంత్‌నాయుడు, దామోదర రెడ్డి మరియు 'మాతెలుగు' సంస్థ ముఖ్యులు వలపుల సెంథిల్ నాయుడు, మద్దినేని జవహర్, గుది వెంకటపతి మొదలైనవారు ఈ వేడుకను నడిపించినారు. జిక్కాట, దేవరాట అనే రెండు తెలుగు పల్లెకళలను ఈ వేడుకలో అడి, చూపరులను అలరించినారు పల్లె కళాకారులు.





# ఒడిశాలో రాష్ట్రేతర తెలుగుసమాఖ్య వార్షికోత్సవం




**జూ**న్ 25న భువనేశ్వర్‌లో రాష్ట్రేతర తెలుగు సమాఖ్య రెండవ వార్షికోత్సవం జరిగింది. రెండు తెలుగు రాష్ట్రాల బయటవున్న తెలుగు వారందరి సమైక్యవేదికగా రా.తె.స. పనిచేస్తున్న సంగతి తెలిసిందే. రా.తె.స. జాతీయ అధ్యక్షుడు కోడూరు శ్రీనివాస్ (ముంబై) అధ్యక్షతన జరిగిన సభలో ఛైర్మన్ పి.వి.పి.సి.ప్రసాద్, కార్యదర్శి వి.వై.ఎల్. శ్రీనివాసమూర్తి ఇంతవరకూ జరిగిన కృషిని వివరించారు. 11అంశాలపై సమగ్ర చర్చ జరిగింది. అన్ని రాష్ట్రాలనుంచి సభ్యత్వాన్ని పెంచాలని నిర్ణయించారు. మొత్తం 12 రాష్ట్రాలకు చెందిన 72మంది ప్రతినిధులు హాజరయ్యారు. కొత్త కార్యవర్గాన్ని ఎంపిక చేశారు. అధ్యక్షుడుగా పూడిపెద్ది సత్యనారాయణ, కార్య నిర్వాహక అధ్యక్షునిగా పి.వి.పి.సి.ప్రసాద్, కార్యదర్శిగా వి.వి.ఎల్.ఎస్.మూర్తి, 6 జోన్‌లకు అధ్యక్షులను ఎంచుకున్నారు.

Owned, printed & published by Samala Lakshmana Babu (9440448244) and printed at Sri Mahalakshmi Offset Printers, 16-7-20, Veera Raghavulu Street, Sharabu Bazaar, Tenali, Guntur Dist. and published from 8-386, Jivaka Bhawan, Angalakuduru Post, Tenali Mandal, Guntur Dist. - 522211. Editor: Dr. SAMALA RAMESH BABU (9848016136)
RNI-APTEL/2015/62362

GMP Certified

1970 నుండి ఆయుర్వేద
ఔషధ నిర్మాణ రంగంలో ప్రఖ్యాతి గాంచిన
జీవక® వారి విశిష్ట ఉత్పత్తి




# జీవశక్తి

## కుటుంబానికి సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే రసాయనం

## సహజమైన కాల్షియం, విటమిన్లు గల స్వదేశీ హెల్త్ డ్రింక్




అనారోగ్యకర కాఫీ, టీ, కోకో, కోలా డ్రింక్స్‌ను త్రాగటం మానండి !
సంపూర్ణ ఆరోగ్యాన్నిచ్చే "జీవశక్తి"ని కుటుంబమంతా నిత్యం సేవించండి !!

రోగనిరోధక శక్తిని పెంచుతుంది. శరీరాన్ని శక్తివంతం చేస్తుంది.
మలబద్ధకం పోగొట్టి, సుఖ విరేచనానికి దోహదపడుతుంది.
శరీరంలోని సప్త ధాతువులకు, శక్తి చక్రాలకు పుష్టినిస్తుంది.
సహజమైన, ప్రశాంతమైన నిద్రను ప్రసాదిస్తుంది.
పిల్లలకు మానసిక, శారీరక ఎదుగుదలను, చురుకుదనాన్ని కలిగిస్తుంది.

"జీవశక్తి" నిత్యం వాడదగిన రసాయనం – అంటే నిరంతరంగా శరీరాన్ని రోగాలకు దూరంగా, శక్తితో అన్ని పనులనూ నిర్వహించేందుకు, నిత్యమూ శరీరాన్ని సన్నద్ధంగా ఉంచేందుకు "టానిక్"గా వాడవచ్చు. వయస్సుతో పనిలేకుండా స్త్రీ, పురుషులందరు నిరంతరము సేవించవలసిన గొప్ప రసాయనం "జీవశక్తి".

మా ఉత్పత్తులన్నీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ అంతటా ప్రభుత్వ ఖాదీ షాపులు, ఆయుర్వేద అంగళ్ళల్లో లభిస్తాయి

100కు పైగా గల మా ఉత్పత్తుల వివరాలకు, వ్యాపార నియమ, నిబంధనలకు సంప్రదించండి

జీవక జీవక JIVAKA
SINCE : 1970

## జీవక® ఆయుర్వేదిక్ & అలైడ్ ప్రొడక్ట్స్

8-386, సామల సీతారామయ్య స్మారక జీవక ఆయుర్వేద భవనం, జీవక నగర్
అంగలకుదురు – 522 211. తెనాలి. గుంటూరు జిల్లా.
☎ 08644 - 220998 Customer Care : 9494 88 44 22 (10 a.m. to 6 p.m.)

వివరాలకు - ఉచిత జీవశక్తి సీసా కొరకు పూర్తి చిరునామా, ఫోన్ నెంబరుతో కొరియర్ నిమిత్తం రు. 20/- లు మనిఆర్డర్ చేయండి.

అమ్మనుడి (తెలుగుజాతి పత్రిక)
AMMANUDI (Telugu Monthly)
July 2017, Vol.3, Issue 5

Date of publication : 1st of every month
Date of posting : 4th of every month

RNI-APTEL/2015/62362
Postal Reg. No.TEN/12/2015-17

